
# కథామంజరి

పది కథల సమాహారం



ఆగస్టు 2025

# కథామంజరి

## పది కథల సమాహారం



కథా మార్గదర్శి

ఆగష్టు 2025

సంపుటి : 6 ♦ సంచిక : 8



# మా జట్టు


సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు

కృపాకర్ పోతుల

నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు

కొచ్చెర్ల వి.ఆర్.

సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి సహకారం అందించిన గళాకారులు

శ్రీ/శ్రీమతి /కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వరరావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్నగారు
- అవసరాల వెంకటరావు గారు
- చీమలపాటి శ్రీనివాసరావు గారు
- సమ్మెట ఉమాదేవి గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి




## శీర్షికలు


కథాకీయం ... ... ... ... ... ... i

విశిష్ట అతిథి ... ... ... ... ... ... ii

కథా మార్గదర్శి ... ... ... ... ... ... iv

కథాపుస్తక పరిచయం ... ... ... ... ... ... vi


## కథలు, వ్యాసాలు


వెలుగువైపు అడుగులు! ... కె. వి. లక్ష్మణరావు ... ... ... 1

రంగు నిరంకుశత్వం ... సింహప్రసాద్ ... ... ... 9

స్త్రీబుద్ధిః ప్రళయాంతకః ... వసుంధర ... ... ... 17

జాలివాన ... పెనుమాక నాగేశ్వరరావు ... ... 23

సుదూరమౌతున్న స్వప్నం ... భమిడిపాటి గౌరీశంకర్ ... ... 30

అసలైన దేవుడు ... విరించి ... ... ... ... 38

అద్భుత శక్తులు ... శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు ... 44

పందిరి మంచం ... డేగల అనితాసూరి ... ... ... 48

సంకెళ్ళు ... మంజరి ... ... ... ... 50

వన్ మినిట్ ... కీ. శే. బెహరా వెంకట సుబ్బారావు ... 57


Cover Page Credits : Tetyana Kovyrina, Canada

# కథాకీయం



కథా'యజ్ఞం' చేస్తున్నప్పుడు, మధ్య మధ్య కథా'యుద్ధాలు' నిర్వహిస్తూ ఉండాలి. అంటే 'కథల పోటీ'లన్నమాట! పోటీ అనే సరికి.. మంచి కథలు వ్రాయడానికి రచయితలు కసరత్తు చేస్తారు. మెదడుకు మేత అందిస్తారు. కలాలకి పదును పెడతారు. ప్రతీ వాక్యాన్ని గురి తప్పకుండా నిర్మాణం చేస్తారు. కథాంశాన్ని వాడిగా, వేడిగా నడిపిస్తూ రణరంగంలోకి అడుగు వేయిస్తారు. యుద్ధంలో గెలవాలనీ ప్రతీ రచయితా.. పరీక్షల ముందు విద్యార్థిలా, భగీరథ ప్రయత్నాలు చేస్తారు. అయితే అక్కడ పరీక్ష తప్పితే, విద్యార్థి భవిష్యత్తు కుంటుపడుతుంది, కానీ రచయిత కథకి బహుమతి రాకపోయినా, భవిష్యత్తు కుంటుపడదు. ఉత్సాహంతో మరో పరీక్షని ఎదుర్కోడానికి, కలంతో ముందడుగు వేస్తాడు. మరో పోటీలో బహుమతి పొందాలనే ఆశయం అతనిలో మెండుగా ఉంటూనే ఉంటుంది!

ఈ నేపథ్యంలో కథామంజరి.. తలపెట్టింది కథాయజ్ఞం మాత్రమే! ఈ యజ్ఞానికి ఋత్విజులు.. రచయితలే! ఈ యజ్ఞం ద్వారా లోక కల్యాణం జరగాలనే మంచి ఉద్దేశంతో వదాన్యులు, వెనుక ఉండి పోటీలకు ఆర్థికసహాయం అందిస్తారు. అంటే.. తెలుగుకథ కలకాలం నిలిచి, సమాజానికి మంచి సందేశంతో మేలు జరగాలనీ, తెలుగు కథ దశదిశల ఖ్యాతి ఆర్జించాలనే. ఆ వెనుక ఉన్న రచయితని ప్రోత్సహించాలనే తపన వారిలో ఉంటుంది. ఈ దిశలో కథామంజరి అడుగులు వేస్తూ, సంవత్సరానికి రెండుసార్లు కథల పోటీలు నిర్వహిస్తున్నది. కథాంశానికి సంబంధించిన సమకాలీన సమస్యని శీర్షికగా ఇచ్చి ఓసారి, అలా కాకుండా స్వేచ్ఛారచనలను ఆహ్వానించి మరోసారి పోటీలు నిర్వహిస్తున్నది. కథారచనలో లబ్ధప్రతిష్టులైన పెద్దలకి, ఎంపిక కోసం కథలు పంపి, వారు ఇచ్చే సూచనలను పాటిస్తూ, వారి నిర్ణయాలను శిరసావహించి ఫలితాలు ప్రకటిస్తున్నాం! అయితే.. నాణ్యత ఉన్న కథలు వచ్చి బహుమతులు పొందితే, మాకూ ఆనందంగానే ఉంటుంది. కానీ, మంచి కథలు రాకపోయినా సరే నిరుత్సాహపడకుండా మా అడుగులు ముందుకే పడతాయి. కారణం ఈ యజ్ఞం నిత్యకృత్యంగా ఉండాలి! అప్పుడే తెలుగుకథ నిత్యకల్యాణం, పచ్చతోరణంగా నిలుస్తుంది!

జన్మదిన కథల పోటికి ఇచ్చిన "నేటి యువత" శీర్షిక మీద ఎప్పటిలాగే కథలు సంఖ్యాపరంగా వచ్చాయి. "ఎక్కువ శాతం కథల్లో.. శీర్షిక చుట్టూ కథాంశాలు నడిచాయి. కథ నిర్మాణంలో గాని, పాత్రల ఔచిత్యంలో గాని, కథనంలో గాని, శిల్పంలో గాని కథలు పాఠకుల్ని ఆకట్టుకుని 'అబ్బా' అనిపించేటట్టు లేవు. కొన్ని కథల్లో... పాత్ర పేర్లలో ఆధునికతకు ప్రాధాన్యత ఇచ్చారు కాని, అవి చదువుతున్నప్పుడు పాఠకుడిని గందరగోళంలో పడేసి, మళ్ళీ కథ మొదట్నుంచి చదివేటట్టున్నాయి. సహజత్వానికి దూరంగా ఉన్నాయి! పోటీ కథ అంటే ఓ ప్రత్యేకత ఉండాలి. చదువుతున్నప్పుడు అసంకల్పితంగా పాఠకుడిలో స్పందన కలిగించాలి. సాధారణ కథల కంటే ఓ నాలుగైదు మెట్లు ఎత్తులో ఉండాలి! కానీ.. వచ్చిన కథలు బహుమతి స్థాయికి తక్కువగా ఉన్నాయి!' అన్నది న్యాయనిర్ణేతల అభిప్రాయం. ఆ నిర్ణయాన్ని గౌరవించి ఈసారి ఏ కథకీ బహుమతి ప్రకటించలేదు.

అయితే... "పెద్ద రచయితల కథలకి కూడా బహుమతులు రాలేదా?" అన్న మాటలు వినబడ్డాయి. కాని అందరూ గ్రహించవలసింది ఒకటే.. "పోటీలు రచయితలకు కాదు, వారి రచనలకి మాత్రమే!"

**సంపాదకుడు**



# విశిష్ట అతిథి

**మంజరి**

ఓ మూడు, నాలుగు దశాబ్దాల క్రితం.. వృత్తిపరంగా రచనలు చేసే రచయితలు ఉండేవారు. వారికీ జీవనాధారం కూడా ఆ ఆర్జనమే! మరో వైపు.. విద్యాలయాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, బ్యాంకుల్లో, ప్రైవేటు సంస్థల్లో.. ఏ ఆఫీసు చూసినా కనీసం ఒకరిద్దరైనా రచయితలు కనబడేవారు. పోలీసుశాఖ కూడా ఈ సాహిత్యకుసుమ నిలయాలకి అతీతం కాదు! ఎందరో ఐపిఎస్ అధికారులు కూడా ఎన్నో మంచి రచనలు అందించారు. ఇలా ఏ రంగంలోనైనా రచయితలు కనబడేవారు. అయితే కొన్ని ఉద్యోగాలలో నిబంధనలు ఉండేవి. ఆ ఉద్యోగులకు.. ఇతరత్రా ఉన్న ప్రవృత్తుల మీద నిబంధనలు ఉండేవి. ముందుగా అనుమతి తీసుకోవాలి. ఆ అనుమతి తీసుకోవడానికి పెద్ద తతంగం ఉండేది. అలాంటి పరిస్థితులలో గాని, లేదా తమ ఉనికి ఇతరులకు తెలియకుండా ఉండడానికి గాని, లేదా ఇష్టంగా గాని... కొందరు రచయితలు కలంపేరుతో రచనలు చేసేవారు. బాగా పేరు తెచ్చుకున్న రచయిత తమ మధ్య ఉన్నాడనే విషయం వారెవరికీ తెలిసేది కాదు. అలా పోలీసు డిపార్ట్‌మెంటులో పనిచేస్తూ.. కలంపేరుతో రచనలు చేస్తూ.. తెరవెనుక "కథ"ల్ని నడుపుతున్న "మంజరి" గారిని ... వారి డిపార్ట్‌మెంట్ వాళ్ళే పట్టేసారు. ఓసారి జిల్లా జడ్జిగారి ద్వారా మంజరిగారు తన నవలకి వచ్చిన బహుమతి అందుకుంటున్న సమయంలో.. జడ్జిగారి వెనుక ఉన్న సెక్యూరిటీ డ్యూటీలో ఉన్న ఓ మిత్రుడు టక్కున మంజరిగారిని గుర్తు పట్టేసాడు. ఆలా మంజరిగారి కలం బయటపడిపోయింది. పోలీసు డిపార్ట్‌మెంట్ లో ఒకప్పుడు ఐపిఎస్ అధికారుల నుంచి కానిస్టేబులు వరకు.. ఎందరో రచయితలు ఉండేవారు. వారి రచనలలో డిపార్ట్‌మెంట్ కథలు, క్రైమ్ కథలు, పరిశోధనా కథలు కూడా కనబడేవి. అదే కోవలో నడిచి, సాంఘిక కథలకు, నవలలకు మంచి పేరు తెచ్చుకున్న రచయిత 'మంజరి' అనబడే శ్రీ గంధం నాగేశ్వరరావు గారు!

ఏకాఏకీ నవలతోనే రచనారంగం వైపు అడుగులు వేసిన మంజరిగారి మీద, వారి తాత గంధం కృష్ణమ్మగారి ప్రభావం బాగా ఉంది. ఆయన సాహితీవేత్త.. వారి పిల్లల పేర్ల దగ్గర నుండి సాహిత్య గుబాళింపులు కనబడతాయి. విరజాంబుజ, తారుణాంబుజ, కళాభాషిణి... ఇలా వాళ్ళ అమ్మాయిల పేర్లు బట్టి వారింట సాహిత్యానికి ఎంత పెద్దపీట వేసారో చెప్పొచ్చు. ఆయన జీన్స్ మనవడికి కూడా సంక్రమించి, పుస్తకాలు చదివే అలవాటు చిన్నప్పటి నుంచే అబ్బింది. ఎలాంటి ప్రభావాలు లేకపోయినప్పటికీ కథలు వ్రాయాలనే తపన మంజరిగార్ని రచయిత చేసింది. మంజరిగారి కథల్లో.. ఆయన వృత్తిలో కనబడే నిజాయితీయే కనబడుతుంది. ఆయన క్రైమ్ కథల్లో ఆయన వృత్తి నైపుణ్యం కూడా కనబడుతుంది. ఒకప్పటి కాలంలో డిటెక్టివ్ కథలు, నవలలు, ధారావాహికాలు రాసేవారు ఉండేవారు. ఇప్పుడు రచయితలు బహు తక్కువమంది ఆ కథలు వ్రాస్తున్నారు. అందులో మొదటివరసలో మంజరిగారు ఉంటారు. శైలి, కథనం.. లలో తనకంటూ ప్రత్యేకతని

నిలుపుకుంటున్న మంజరిగారు "మాండలికంలో రచనలు అవసరమే గాని, ఎక్కువమంది మాట్లాడే భాషలోనే సాహిత్యరచన ఉండాలి. రచయిత సమాజానికి మార్గదర్శకంగా ఉండాలి. రచనలలో కనబడే మంచి.. ఆ రచయితలో కూడా ఉండాలి. వ్యక్తిత్వం.. వ్యక్తిగతం కదా అనొచ్చు! కాని నీతి నిజాయితీలను ప్రబోధిస్తూ రచనలు చేస్తూ, అయినా అవినీతిలో కూరుకుపోయి ఉన్నాడనుకోండి.. ఆయన్ని ప్రజలు ఎందుకు గౌరవిస్తారు! అయన మీదే కాదు, నీతి నిజాయితీల మీద కూడా నమ్మకం పోతుంది. తను వ్రాసింది.. తన ఆచరణలో ఉంచాలి. ఆచరణలో ఉన్నదాన్నే వ్రాయాలి! రచయితలకి దురలవాట్లు అసలు ఉండకూడదు. నిరంతరం మెదడుకు పదును పెడుతూనే ఉండాలి. అప్పుడే మంచి రచనలు వస్తాయి!" అంటూ తన అభిప్రాయాలని ఖచ్చితంగా చెప్తారు. వందకు పైగా కథలు, ఇరవై నవలలు, మరెన్నో వ్యాసాలు మంజరిగారి కలం నుండి జాలువారాయి! కొన్ని కథలకు, నవలలకు బహుమతులు వచ్చాయి. కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువదింపబడ్డాయి.

మంజరి గారు 1954 సంవత్సరంలో తూర్పుగోదావరి జిల్లాలో జన్మించి, యస్ యస్ యల్ సి చదివి.. పద్దెనిమిదో ఏటే పోలీసుగా ఉద్యోగం ప్రస్థానం ఆరంభించారు. 1986లో మొదటి నవల "మృత్యుకెరటం" వ్రాసారు. "ఏలూరు టైమ్స్' దినపత్రికలో డైలీ సీరియల్‌గా ప్రచురించారు. ఆ నవలను ఎమెస్కో వారు పుస్తకంగా కూడా తీసుకొచ్చారు. 1989లో వీరి మొదటికథ "నిమిత్తమాత్రుడు" రచన మాసపత్రికలో ప్రచురితమైంది. ఉద్యోగ విరమణ తర్వాత విజయనగరంలో స్థిరనివాసంలో ఉన్న మంజరిగారు.. ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ధన్యవాదాలు తెలుపుకుంటూ, సమాజాన్ని జాగృతం చేసే మరిన్ని రచనలు ఆయన కలం నుండి రాగలవనీ ప్రగాఢంగా ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**



# కథా మార్గదర్శి

## కీ.శే. బెహరా వెంకట సుబ్బారావు

రచయిత కళ్ళు ఎప్పుడూ సమాజం మీదే వుంటాయి! ఏదో అన్వేషణ లోనే మెదడు పనిచేస్తుంటుంది. ఎక్కడ ఏం అన్యాయం జరిగినా తన కలం ద్వారా స్పందిస్తాడు. ఎక్కడ లోటుపాట్లు కనబడినా, వాటిని తన రచన ద్వారా సభ్యసమాజానికి అందించి, వారిని జాగృతం చేస్తాడు. ఓ రకంగా సమాజానికి కాపలా కాసే బాధ్యత తీసుకుంటాడు. ఓ శతాబ్దం కాలం కిందట చూస్తే.. సమాజం, మనుషులు, ఆలోచనలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయంటే.. ఆ మార్పు రావడానికి అక్షరమే ఆయుధంగా పనిచేసింది. అలా.. కథలు కాలక్షేపానికి వ్రాయకుండా, సామాజిక ప్రయోజనం ఉండాలనీ, బాధ్యతగా రచనలు చేసిన మొన్నటి తరం రచయితలలో మరో ఆణిముత్యం కీ.శే. బెహరా వెంకట సుబ్బారావుగారు.

సుబ్బారావుగారు.. తనకి కనబడుతున్న రంగుల ప్రపంచం వైపు కన్నెత్తి కూడా చూడకుండా, సామాజిక బాధ్యతను స్వీకరించి, రచనలు చేసారు. ముఖ్యంగా మధ్యతరగతి జీవితాలనే ఎన్నుకుని రచనలు చేసారు. ఈ మధ్యతరగతి జనాల మనస్తత్వాలని, బలహీనతలను 'క్యాష్' చేసుకునే కుటిల రాజకీయాల మీద కూడా కథాస్త్రాలు సంధించి రచనలు చేసారు. సుబ్బారావుగారి ఏ కథ చదివినా, మధ్యతరగతి మందహాసాలే కనబడతాయి. ఆ శతాబ్దంలో కనబడిన పల్లె, పట్నపు వాసనలు, కుటుంబ బాంధవ్యాలు, ఆఫీసులు, రాజకీయాలు, నీతి అవినీతులు.. ఇలా అన్నీ సుబ్బారావుగారి కథల్లో దృశ్యంలా కనబడతాయి. సుబ్బారావుగారు బాలకథలు కూడా విరివిగా వ్రాసారు. బాలజ్యోతి పిల్లల మాసపత్రికలో వీరి నవల "దారి తప్పకు" ధారావాహికంగా వచ్చి, చాలా ఆదరణ పొందింది. సుబ్బారావుగారి శైలి కూడా.. అతి సరళమైన ఇంటిభాషలో ఉంటుంది. ఏ కోణంలో చూసినా.. కథే పాఠకుడి చేత చదివిస్తుంది.

1935 లో తూర్పు గోదావరి జిల్లా పిడపర్తిలో జన్మించి, బాల్యం విద్యాభ్యాసంలో యస్.యస్.యల్.సి. వరకు చదివారు. కుటుంబ బాధ్యతలను నిర్వర్తించవలసిన పరిస్థితులలో, పై చదువులు కొనసాగించలేక, వెంటనే వచ్చిన పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో చేరి, అనకాపల్లి, విజయనగరం, కొత్తవలస, విశాఖపట్నం.. మొదలగు ఊర్లలో పనిచేసి 1993లో పదవీవిరమణ చేసారు. 1957 లో ప్రారంభమైన సుబ్బారావుగారి రచనా ప్రస్థానం, నలభై సంవత్సరాలు నిర్విఘ్నంగా సాగింది. ఆయన వ్రాసిన రెండువందల పైచిలుకు కథల్లో, ఏభై కథలకి పైగా బహుమతులు వచ్చాయి. వీరి మరో మూడు నవలలు కూడా వివిధ పత్రికల్లో ధారావాహికంగా వచ్చాయి. ఆ రోజుల్లో వచ్చే అన్ని పత్రికలలో ఆయన కథలు వచ్చాయి. "అంతశ్శత్రువు, బహుమతి, భగవంతుడు, దాహం, హంసలా కలకాలం, ఇది కథ కాదు, కులాసా పురుషుడు, మొక్కుబడి, మానవత్వం మరోసారి మరణించింది, ఒపెన్ జోకర్, ప్రోమిస్" .. వంటి కథలు పాఠకుల


మన్ననలను పొందాయి. సుబ్బారావుగారి కథలు వచ్చేతరాలకి మార్గదర్శకాలుగా ఉంటాయని నమ్మి, వారి కుమారులు, 2006లో 'బెహరా వెంకట సుబ్బారావు కథలు' పేరిట ఓ కథల సంపుటిని, ఇటీవల కాలంలో "మధ్యతరగతి మందహాసం" శీర్షిక మీద.. 73 కథలు, 2 నవలలతో మరో సంపుటిని విడుదల చేసారు. జూన్ 29న విజయనగరంలో జరిగిన ఈ పుస్తకావిష్కరణ సభకి, వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సుబ్బారావుగారి సాహితీ అభిమానుల స్పందనలు, విశ్లేషణలు చూస్తే.. పాఠకుల హృదయాల్లోకి ఆ కథలు ఎంతగా చొచ్చుకు పోయాయో అర్థమవుతుంది.

తెలుగు కథాసాహిత్యంలో ఓ విశిష్టమైన ఉనికి చాటుకున్న, కథామార్గదర్శి కీ.శే. బెహరా వెంకట సుబ్బారావుగారిని తలుచుకుంటూ.. వారికి ఘనమైన నివాళి తెలుపుకుంటున్నాం. అలాగే సుబ్బారావుగారి గురించి వివరాలు అందించి, తమ ఆనందాన్ని తెలియచేసిన ఆయన కుమారులు శ్రీ బెహరా సత్యనారాయణమూర్తి గార్కి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

**కథామంజరి బృందం**

# కథాపుస్తక పరిచయం






## సుగుణకథాభిరామం

ప్రముఖ రచయిత డా. ఎమ్. సుగుణరావుగారి కలం నుండి జాలువారిన 27 బహుమతి కథల సంపుటి. ఈ పుస్తకం అమెజాన్, ఫ్లిప్కార్ట్, గూగుల్ పే, ఈబుక్స్ దగ్గర లభ్యమవుతుంది. ఈ సంపుటి వెల రు.275/-.

## మీది తెనాలి – మాది తెనాలి

ప్రముఖ రచయిత శ్రీ ఆర్. సి. కృష్ణస్వామి రాజుగారి 18వ పుస్తకం. పాఠకుల పెదవులపై చిరునవ్వు తేగల్గిన ఈ 20 కథల సంపుటి వెల రు.170/-.

ప్రతులకు

శ్రీ కృష్ణస్వామి రాజు,
22-4-71, బ్యాంక్ ఎంప్లాయీస్ కాలనీ, అక్కరంపల్లి పోస్ట్,
**తిరుపతి – 517507**
✆ 9393662821 | Email: rcksrajulic@gmail. Com







## నా కథలు

హైదరాబాద్ ఏ. జి. ఆఫీసు వారి శైథి సంస్థ "రంజని" లో ప్రచురింపబడిన శ్రీమతి అద్దంకి శ్రీదేవిగారి 44 కథల సంపుటి. ధర అమూల్యం.

ప్రతులకు

శ్రీ ప్రభాకర్,
1-10-54, స్ట్రీట్ నెం. 2, అశోక్ నగర్,
**హైదరాబాద్ – 50020**
✆ 040-27634929

# వెలుగువైపు అడుగులు!

కె. వి. లక్ష్మణరావు
✆ 9014659041

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***"సార్! రోజూ మీరు ఎంతోమందిని వారి గమ్యానికి క్షేమంగా చేరుస్తారు. వారంతా మీకు తెలియదు. అలాగే వారికీ మీరూ తెలియదు. వారి సురక్షిత ప్రయాణం కోసం మీరు కంటిరెప్పను కూడా మూయకుండా 'ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా పోరాడే సైనికునిలా' పని చేస్తారు. 'రేపు ఉదయానికల్లా... వెలుగొచ్చే సమయానికి నీ ఇంటి ముందుంటానని ధీమాగా బంధువులతో ఫోన్‌లో చెబుతాం. కానీ ఆ చేర్చే బాధ్యతను మీరు నెత్తిమీద వేసుకుంటారు. ప్రయాణీకులు మిమ్మల్ని పట్టించుకోరు. కనీసం పలకరించరు. అయినా బాధ్యతగా అందరినీ క్షేమంగా చేరుస్తారు. థాంక్యూ సో మచ్ సర్!***

హైదరాబాద్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి అనుకోకుండా బయలుదేరాల్సి వచ్చింది. అన్నయ్య క్యాంప్‌లో ఉండటం, నాన్నకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో కార్యక్రమానికి నేను హాజరుకాక తప్పలేదు. అక్కడకూ లలిత అంటూనే ఉంది, "ట్రైన్ రిజర్వేషన్ దొరుకుతుందేమో ట్రై చేయండి!" అని.

"అప్పటికప్పుడు అంటే తత్కాల్ కూడా దొరకవు. బస్ అయితే బెటర్!" అన్నాను.

ప్రైవేట్ ట్రావెల్స్ ఆఫీసుకు వెళ్ళాను.

మా ఆఫీసులో నాకు రెండు రోజులు సెలవు ఏమీ కష్ట పడకుండానే దొరికింది కానీ, బస్సులో సీట్ మాత్రం కష్టమైంది.

"అంకుల్! మీరు సీనియర్ సిటిజనే కదా. . . అరవై ఏళ్లు దాటాయి కదా!" లాప్‌టాప్ లోంచి తల ఎత్తకుండానే అడిగాడు ట్రావెల్స్ వాడు.

"అవును" అన్నాను.

"లేడీస్ పక్కన ఒక్క సీటు మాత్రం ఉంది. వద్దంటే సీట్స్ లేవు!" అన్నాడు.

"సరే, ఇవ్వు!" అన్నాను.

సాయంత్రం బస్ ఎక్కాను. లగేజ్ బ్యాగ్ పైన ర్యాక్‌లో పెట్టాను. శాస్త్రీ బామ్‌ను జేబులో పెట్టుకున్నాను. వాటర్‌బాటిల్ నా ముందు సీటుకు తగిలించాను.

బస్ తాటిపాక నుండి బయలుదేరింది. సీటులో వెనక్కు వాలాను.

ఐదు కిలోమీటర్లు బాగానే వెళ్ళింది.



రాజోలు రావడంతో ఆగింది. 'ఎక్కేవాళ్ళు ఉన్నారేమో?' అనుకున్నాను.

నలుగురైదుగురు గబగబా ఎక్కారు.

"సార్! మీకు అభ్యంతరం లేకపోతే విండో సీటు ఇస్తారా?" ఒకమ్మాయి నా ఎదురుగ్గా నిల్చొని అడగడంతో... 'నా పక్కన లేడీస్ కదా!' అని గుర్తొచ్చింది.

ఆ అమ్మాయికేసి తేరిపారా చూసాను.

గ్రీన్‌కలర్ పంజాబీ డ్రెస్‌లో, చేతిలో స్మార్ట్‌ఫోను, చెవుల్లో ఇయర్‌ఫోన్స్‌తో సన్నగా ఉంది. వయసు ఓ ఇరవై, ఇరవైరెండు ఏళ్ళుంటాయేమో!

"సార్! నాకు వామ్టింగ్ సెన్సేషన్ ఉంది!" అమ్మాయి అనడంతో ఠక్కున లేచి "కూర్చో తల్లీ!" అన్నాను.

"థాంక్స్ సార్!" అంటూ తన బ్యాగును పైన పొడుగు బల్ల మీద పెట్టింది.

విండో సీట్లో దర్జాగా కూర్చొంది. చేతిలో స్మార్ట్‌ఫోను, చెవుల్లో ఇయర్‌ఫోన్స్ మాత్రం ఆమెకు అదనపు ఆభరణాలుగా అమిరాయనిపించింది.

చేతులు స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ మీద అటూ, ఇటూ చకచకా చక్కర్లు కొడుతున్నాయి.

ఫేస్‌బుక్ పోస్ట్‌లకు లైక్ కొడుతోంది. వాట్సప్ స్టేటస్‌లకు రిప్లై ఇస్తోంది.

నేటియువత ఇలాగే ఉంది. నెట్ అనే వలలో చిక్కుకుంది. అబ్బాయిలు, అమ్మాయిలు అనే తేడా లేనే లేదు. పెద్దలంటే లెక్క లేదు. డబ్బు విలువ అక్కర్లేదు. జాబులు చేస్తూ... సెలవుదినాల్లో, పబ్బులు, పార్టీలంటూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. అదే జీవితం అనుకుంటున్నారు.

యువతకు నీతులు చెప్పడం అంటే, చెవిటి చెవి ముందు శంఖం పూరించడమే!

నాకు ఆమె ఫోన్ భాగోతం చిరాకు పుట్టిస్తోంది.

అయినా ఈ కాలంలో ఫోన్ మూడో చేయి అయిపోయింది. ఒక్క బాత్రూమ్‌కు తప్ప, మరెక్కడకూ ఫోన్ లేకుండా బయటకు పోలేకపోతున్నారు.

'ఫోన్స్ కాలం... పోయే కాలం!' అనుకున్నాను.

బస్‌లో లైట్స్ అన్నీ ఆఫ్ చేసేశారు. ఇక ఎక్కడా ఎక్కేవాళ్ళు లేరనుకుంటా? అందరూ నిద్రలోకి జారుకుంటున్నారు. నాకు కూడా నిద్రపోవాలనిపించింది. బస్‌లో టీవీ మాత్రం వాగుతూ దానిపని అది చేసుకుపోతోంది.

అమ్మాయి ఫోన్లో గట్టిగా మాట్లాడుతోంది.

రెండూ నా నిద్రకు ఆటంకాలే! అందరికీ వాటర్‌బాటిల్స్ ఇస్తూ ఓ కుర్రాడు వచ్చాడు.

“అందరూ మొద్దుగా నిద్రపోతున్నారుగా! ఇంక ఆ సినిమా అవసరమా?”అన్నాను ఆ కుర్రాడితో.

“మా డ్రైవర్‌కు నిద్ర రాకుండా సార్!” నవ్వుతూ అన్నాడు.

“మీకు మాత్రమే వినబడేలా పాటలు పెట్టుకోండి. అంతేగానీ మా నిద్ర చెడగొట్టకండి!” నేను సీరియస్‌గా అనేసరికి, టీవీ ఆఫ్ చేసాడు.

నా పక్క అమ్మాయి మాత్రం నోటికి తాళం వేయకుండా లొడలొడా మాట్లాడేస్తోంది.

“ఫోన్లో అవతల ఉన్న వాళ్లకు వినబడేలా మాట్లాడితే చాలమ్మా!” అన్నాను కాస్త వ్యంగ్యంగా.

నేను సీరియస్‌గా అనే సరికి నన్ను చిరునవ్వుతో చూసింది. స్వరం స్థాయి తగ్గించి, ఫోన్‌లో చాలా నెమ్మదిగా మాట్లాడసాగింది.

‘ఒకప్పుడు నిద్రపట్టేందుకు పెద్దలు పడుకునే ముందు, ‘పుస్తకం’ చదివేవారు. కానీ ఈ కాలం పిల్లలు ఇప్పుడు నిద్రను కూడా మరచిపోయి మరీ ఫోన్‌కు అతుక్కుపోతున్నారు.

‘రోజులు మారినా, మారకపోయినా, యువత మారదు. వారికి ఉన్నత మైన భవిత ఉండదు’ అని మనసులో అనుకుంటూనే, నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాను.

ఎంత సేపు పడుకున్నానో తెలియదు కానీ, బాగా నిద్ర పట్టేసిందనిపించింది.

డ్రైవర్ బస్‌లో లైట్లన్నీ ఒక్కసారి వేయడంతో మెలకువ వచ్చేసింది.

లేచి చూసాను. నా పక్కనున్న అమ్మాయి తీరులో మార్పు లేదు. అదే ఫోన్, అవే వేళ్ళు... ఫోన్ స్క్రీన్ మీద అటూ ఇటూ కదులుతున్నాయి.

‘ఎంత ఫోన్ పిచ్చియో... ఇంత రాత్రి వేళలో?’ అనిపించింది.

“బస్ విజయవాడ వచ్చింది. ఒక అరగంట ఆగుతుంది. ఈలోగా భోజనం, టిఫిన్ ఏదైనా చేసేవాళ్ళుంటే చేసేయచ్చు!”

డ్రైవర్ అరుస్తూ బస్ దిగాడు.

చేతి గడియారం కేసి చూశాను. సమయం సరిగ్గా రాత్రి రెండు గంట లైంది.

‘‘పడుకునే సమయంలో ఫలహారమా? అసలు మతుందా?’’ అమ్మాయి కేసి చూస్తూ అన్నాను.

“సార్?” అంది ఒక్కసారిగా. ఎందుకన్నట్టుగా చూశాను.

“కిందికి వెళ్ళాలి! సార్!” అంది ఇబ్బంది పడుతున్నట్లుగా.

డ్రైవర్ గురించి నేనన్న మాటలు ఆమె వినలేదని అర్థమైంది.

‘అయినా చెవుల్లో వైర్లు ఉన్నప్పుడు నా మాట ఎందుకు వింటుంది?’ నన్ను నేను తిట్టుకున్నాను.

నేను కూడా తప్పదనుకుంటూ ఇబ్బందిగా లేచాను. అమ్మాయి కిందకు వెళ్ళింది. నేను కూడా కిందకి దిగి లఘుశంక తీర్చుకుని వచ్చాను.

ఒక్కసారి బస్ లోపల పరిశీలించాను. పిల్లలు ఏడుస్తున్నారు. తల్లులు వాళ్ళని ఆడిస్తున్నారు. పెద్దలు ఆవలిస్తున్నారు. చిన్నవాళ్ళు విచిత్రంగా చూస్తున్నారు!

“రోజూ ఇంత మందికి ఎన్ని అవసరాలుంటాయో కదా? ఇబ్బంది పడుతూనే ప్రయాణిస్తారు. గమ్యం చేరడం కోసం గమనం తప్పదనుకుంటారు!’అనుకున్నాను, మనసులో.

అంతలోనే అమ్మాయి వచ్చి కూర్చుంది. మళ్ళీ ఫోన్‌లో చాటింగ్ చేస్తోంది.

బస్ బయలుదేరింది.

అందరూ రెండోసారి మెల్లగా నిద్రలోకి జారుకుంటున్నారు.

కానీ అమ్మాయి మరియు ఫోన్‌లో మార్పు (రా) లేదు.

“ఇంత రాత్రిలో కూడానా తల్లీ? కనీసం పడుకోకుండా?” అన్నాను.

ఆమెకు వినపడినట్లు లేదు. అవునులే, ఫోన్‌లో పడితే పగటికి, రాత్రికి తేడా తెలియదుగా?”

అమ్మాయి గాలిలో “ఉమ్మ్” అంటూ ముద్దులు కూడా పెడుతోంది.

నాకు అలా చూడగానే అసహ్యం వేసింది.

అమ్మాయి విపరీత వికృతచేష్టలు నాకు చిరాకును తెప్పించాయి.

“ఒక పెళ్లికాని అమ్మాయి ఇలా ప్రవర్తించవచ్చునా?” అనుకున్నాను. కానీ నా అవసరం ఇవన్నీ పక్కన పెట్టి అమ్మాయితో తప్పక మాట్లాడేలా చేసింది.

“అమ్మాయీ!” అంటూ పిలిచాను.

“ఏమిటి సార్?” అంది తలత్రిప్పి.

“బస్సు దిల్‌షుఖ్ నగర్ వస్తే చెప్పమ్మా! నేను అక్కడ దిగాలి! అన్నాను.

“నేనూ అక్కడే దిగుతాను సార్! చెబుతాను! “అంది.

“సంతోషం!” అంటూ అమ్మాయి కేసి కొంచెం వెటకారంగా చూస్తూ సీటులోనుండి వెనక్కు వాలాను. నిద్రలోకి మెల్లగా జారుకునే సమయంలో మా వెనుక వరుసలో కూర్చున్న ఒక చంటిపిల్లాడు గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు.

బస్సులో ఉన్న వారంతా ఒక్కసారిగా లేస్తూ, “ఏమైంది?” అంటూ అడుగుతున్నారు.

నా పక్కన కూర్చున్న అమ్మాయి కూడా నన్ను అడగకుండానే నా కాళ్ళను రాసుకుంటూ, తోసుకుంటూ... వెళ్ళింది.

నాకు భలే కోపం వచ్చింది. ఆకలి, నిద్ర అనేవి అవసరాలు. అవి వచ్చినప్పుడు తీర్చేసుకోవాలే గానీ, మనకు వీలైనప్పుడు వాటిని ఆహ్వానించలేము కదా? చంటిపిల్లాడి ఏడుపును కూడా ప్రపంచంలో ఎనిమిదో వింతగా చూస్తున్న జనాన్ని లోపల తిట్టుకుంటూనే నిద్రకు తలొగ్గాను.

★★★

“దిల్‌షుఖ్ నగర్ వచ్చింది. దిగేవాళ్ళు దిగాలి!” క్లీనర్ అరుపులాంటి పిలుపుతో ఒక్కసారిగా దిగ్గున లేచాను.

అప్పటికే ఆ అమ్మాయి తన బ్యాగ్ తీసుకోవడానికి సమాయత్తం అవుతోంది.

“అమ్మాయీ! చెప్పలేదే?” సీరియస్‌గా ఒక లుక్ వేస్తూ నా బ్యాగ్‌ను గబగబా చేతిలోకి తీసుకుంటూ అడిగాను.

“పిలిచాను సార్! ఒకసారి కాదు. రెండు మూడుసార్లు. ‘సార్’ అంటూ అరిచాను. కానీ మీరు లేవలేదు. బ్యాగ్ తీసుకుంటూ మీరు మెలకువ తెచ్చుకోవడానికి గట్టిగా చప్పుడు కూడా చేశాను” అంది.

‘గొప్ప పని చేశావ్?’ అన్నట్టుగా వెటకారంగా చూశాను.

బ్యాగ్‌తో నా ముందు నడుస్తూ, డ్రైవర్ కేసి చూస్తూ ఒక్కసారిగా ఆగింది.

‘దిగే ముందు డ్రైవర్‌తో పనేముంది?’ అమ్మాయికేసి విచిత్రంగా చూస్తూ అనుకున్నాను.

“సార్!” అని పిలిచింది.

డ్రైవర్ , ‘నన్నేనా సార్?’ అని పిలిచారన్నట్టుగా సందేహిస్తూ చూశాడు.

ఆ అమ్మాయి డ్రైవర్‌కేసి చిరునవ్వుతో చూసింది.

డ్రైవర్‌తో బాటు నేనూ ఆశ్చర్యపోతూ అమ్మాయి వెనుక ఆగాను.

“సార్! రోజూ మీరు ఎంతోమందిని వారి గమ్యానికి క్షేమంగా చేరుస్తారు. వారంతా మీకు తెలియదు. అలాగే వారికీ మీరూ తెలియదు. వారి సురక్షిత ప్రయాణం కోసం మీరు కంటిరెప్పను కూడా మూయకుండా ‘ప్రాణాలకు సైతం లెక్కచేయకుండా పోరాడే సైనికునిలా’ పని చేస్తారు. ‘రేపు ఉదయానికల్లా... వెలుగొచ్చే సమయానికి నీ ఇంటి ముందుంటానని ధీమాగా బంధువులతో ఫోన్‌లో చెబుతాం. కానీ ఆ చేర్చే బాధ్యతను మీరు నెత్తిమీద వేసుకుంటారు. ప్రయాణీకులు మిమ్మల్ని పట్టించుకోరు. కనీసం పలకరించరు. అయినా బాధ్యతగా అందరినీ క్షేమంగా చేరుస్తారు. థాంక్యూ సో మచ్ సర్ !” అంటూ చేతులెత్తి నమస్కరించింది.

డ్రైవర్ ఆమె సంస్కారానికి ఆశ్చర్య పోయాడు.

“అమ్మా! ‘ఏయ్ డ్రైవర్! సరిగ్గా నడుపు. వేగం పెంచు, నెమ్మదిగా పోనీ!’ అంటూ... ఏకవచనంతో అమర్యాదగా, అగౌరవంగా మాట్లాడే వారేనమ్మా అంతా! మమ్మల్ని సాటిమనిషిగా చూడరు. మొదటిసారి మర్యాదగా పిలిచిన వ్యక్తిని, డ్రైవర్‌ని గౌరవంగా చూసిన వ్యక్తిని చూశానమ్మా!” అంటూ తడిబారిన కళ్ళను తుడుచుకున్నాడు.

ఆమె చెప్పేదాకా డ్రైవర్ సేవలను నేనూ గుర్తించలేకపోయాను. నేనే డ్రైవర్‌కు చేతులెత్తి దండం పెట్టాలనుకున్నాను.

అంతలోనే ఆ డ్రైవర్ ఆ అమ్మాయితో, “అమ్మా! కొన్ని గంటల క్రితం ముందుసీటు దెబ్బ తగలడంతో నుదుటినుండి రక్తం కారుతూ ఏడుస్తూన్న బాబును సకాలంలో స్పందించి ప్రమాదం నుంచి కట్టుకట్టి రక్షించారు. భయం లేదన్నారు. మీరూ?” అంటూ ఆగాడు. అప్పుడు ఆ అమ్మాయి చిన్నగా నవ్వుతూ, “కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్‌లో యం.డి జనరల్ మెడిసిన్ చేస్తున్నాను. డాక్టరుగా చూశాను. వైద్యం చేసాను. ఇది గొప్ప విషయమేమీ కాదు సార్” అంది సింపుల్‌గా.

బదులుగా డ్రైవర్ నవ్వుతూ, “డాక్టర్లు కూడా బస్సులో ఉన్నప్పుడే ప్రయాణీకులు క్షేమంగా గమ్యం చేరుకుంటారు. నేనే మీకు థాంక్స్ చెప్పాలి!” అంటూ డ్రైవర్ తిరిగి చేతులెత్తి ఆ అమ్మాయికి ప్రతినమస్కారం చేశాడు.

“నిద్ర మత్తులో ఏం జరిగిందో గమనించలేదు. తోటి ప్రయాణికుల కష్టాన్ని పట్టించుకోని నా ప్రవర్తన గురించి ఆలోచిస్తే నాకే సిగ్గనిపించింది. ఆ అమ్మాయి నా దృష్టిలో అందనంత ఎత్తుకు ఒక్కసారిగా ఎదిగి పోయినట్లనిపించింది. ఆ అమ్మాయికి చదువుతోపాటు ఎవరికీ లేని సంస్కారం ఉంది. ఆ అమ్మాయి తీరును బట్టి తక్కువ అంచనా వేయడంలో పొరబడ్డాను.

‘నేటి యువతలో అందరూ చెడ్డవాళ్ళుండరు. ఈ అమ్మాయిలా మంచివారు కూడా ఉంటారని పించింది. వయసును బట్టి, వారిని తక్కువగా చూడరాదు’ అన్న నిజం తెలిసింది.

ఆలస్యం చేయకుండా గబగబా ఆ అమ్మాయి వెనుకనే దిగుతూ, “అమ్మాయీ!” అంటూ ఎంతో ఆప్యాయంగా పిలిచాను.

“ఎందుకు సార్?” ఆగి నా వైపు తిరుగుతూ చిరునవ్వుతో అడిగింది.

“పేరు?” అడిగాను.

“రమ! సార్” అంది.

“రమ్యమైన పేరు!” అన్నాను.

“నిజం చెప్పాలంటే ఒక్క నిమిషం కూడా గ్యాప్ లేకుండా ఫోన్ పట్టుకుని వేలాడిన నిన్ను ‘చిన్నచూపు’ చూశాను. తక్కువ అంచనా వేశాను. కానీ డ్రైవర్‌తో నీ మాటలతీరుతో నీమీద ఉన్న అభిప్రాయం తప్పని గ్రహించాను. “ అన్నాను.

రమ నవ్వుతూ “సార్! నిన్న అమ్మ పుట్టినరోజు. రాజోలులో ఫ్రెండ్ పెళ్లి హడావుడిలో పడి, అమ్మకు విష్ చేయలేదు. తీరిక దొరకడంతో ఫోన్‌లో చెప్పాను. అమ్మ ప్రేమకు, అవని సహనానికి హద్దేముంది? అమ్మ ఫోన్ ఆఫ్ చేయలేదు. ఇక నా అన్న కొడుకు, ముద్దుల మేనల్లుడు, మూడేళ్లకే వచ్చీరాని మాటలతో ముద్దుగా “అత్తా” అంటూంటే ముద్దులివ్వకుండా ఉండలేకపోయాను!” అంది వినయంగా నా కేసి చూస్తూ.

నా అజ్ఞానానికి నన్ను నేను మనసులో తిట్టుకున్నాను.

"నీ సంస్కారానికి చేతులెత్తి నమస్కరించాలి. కానీ వయసు అడ్డు వస్తోంది. గాడ్ బ్లెస్ యూ తల్లీ!" అన్నాను ఆశీర్వదిస్తూ.

"థాంక్స్! సార్!" అంటూ ముందుకు కదిలింది రమ.

నేను చేసిన ఒకరోజు ప్రయాణం, నా జీవిత ప్రయాణంలో ఒక మరచిపోలేని జ్ఞాపకంగా మిగిలి పోయిందనుకున్నాను. ఈ రోజు సూర్యోదయంకంటే ముందే నాకు జ్ఞానోదయం అయింది.

నా చుట్టూ వెలుగు రేఖలు విచ్చుకోగా, నా పయనం మొట్టమొదటిసారిగా, 'వెలుగు వైపు' అని అర్థమయ్యింది.

# రంగు నిరంకుశత్వం

సింహప్రసాద్
✆ 98490 61668

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***ప్రపంచీకరణ పుణ్యమా అని ఆడదాన్నే కాదు అందాన్నీ అంగడి సరుకు చేసేశారు. అందం ఇప్పుడు వేల కోట్ల పరిశ్రమ అయింది! ఇప్పుడైనా కళ్ళుతెరచి లెంపలేసుకోండి ప్లీజ్. మీ కలాల్లోని ఇంకు మార్చండి. చేతనైతే సమాజాన్ని బాగుచేయండి గాని అందంగా లేని ఆడపిల్లల్ని ఆత్మన్యూనతలోకి తోసేసి బలహీనుల్ని చేయకండి! ఆత్మక్షోభకు గురి చేయకండి!***

"కవిగారూ! కవిగారూ!" పిలుస్తూనే చొరవగా ఇంట్లోకి వచ్చేసిందో యువతి.

యూట్యూబ్‌లో అందాల పోటీల క్లిప్పింగ్స్ చూస్తున్న దుర్గారావు అదిరిపడి చూశాడు. "మీరు.... నువ్వు..."

"మీ అభిమానిని!" మందహాసం చేసింది దీపిక.

"ఓ వెరీగుడ్. రండి కూర్చోండి" కుర్చీ చూపించాడు.

"మీరు నా అభిమాన కవి, రచయిత అన్నీను. మీ రచనలంటే పడిచస్తాను..."

"చాలా సంతోషం. మీలాంటి అభిమానుల ప్రశంసలే మాకు టానిక్. నా రచనలు ఏవేం చదివావు?" ఆమె వయస్సు గుర్తించి ఏకవచనంలోకి దిగిపోయాడు.

"ఒకటేమిటి? కవిత్వం, కథలు... మీర్రాసి పడేసిన ప్రతీదీ నమిలి మింగేస్తుంటాను" ఆ మాటల్లో 'నింద' స్ఫురించి ఇబ్బందిగా కదిలాడు. "నా రచనల్లో మీకు ప్రత్యేకంగా బాగా నచ్చిందేమిటి?"

"స్త్రీల వర్ణన. అబ్బో! కాలిగోటి దగ్గర్నుంచి జుట్టుచివర్ల దాకా ప్రతి భాగాన్నీ ప్రతి అంగాన్నీ ప్రతి కదలికనీ ప్రతి చూపునీ అమోఘంగా వర్ణిస్తారు..."


చిన్నగా నవ్వాడు. ఏమీ అనకపోతే బాగుండదని, "ఏదో నీ అభిమానం..." అన్నాడు.

“, , , !” అన్పించేలా శృంగారరసాన్ని అక్షరాలా మామిడిరసంలా పిండి కథల్లో ప్రవహింపజేస్తారు. మీకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే!”

ఆమె పొగుడుతోందో, తెగడుతోందో బోధపళ్లేదు. వెర్రిగా నవ్వుతూ చూశాడు.

“మీ లెక్క ప్రకారం నేను బావుంటానా సార్?”

సూటిగా అడిగేసరికి సమాధానం ఇవ్వడానికి చాలా ఇబ్బందిపడ్డాడు.



“నేనేమీ అనుకోను. మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పండి”

పెదవి విరిచాడు. “నల్లగా ఉన్నావు. లావుగా ఉన్నావు. సారీ!”

“మీకు లావుగా కన్పించాను. కానీ మా అమ్మ బొద్దుగా ఉన్నానంటుంది”

“కన్నతల్లి కదా. పైగా జిహ్వాకో రుచి!”

“మీ జిహ్వాకీనా!”

తుళ్ళిపడ్డాడు. నవ్వేసింది.

“నలుపులోనే విశ్వసౌందర్యం ఉందంటారు. రాముడూ కృష్ణుడూ నలుపేగా! ఇప్పుడు నేను మీ స్త్రీ పాత్రల్లా మారాలంటే ఏం చేయాలి? తెల్లతోలు కోసం వెర్రిగా ఆరాటపడుతూ తెల్లబరిచే క్రీములు ఎడాపెడా పూసేసుకోవాలా! అదేగా మీలాంటి వారి సమాధానం! లేకపోతే మనదేశంలో ఏడాదికి 35 నుంచి 40 వేల కోట్ల స్కిన్ వైట్నర్స్ ఎందుకు అమ్ముడవుతాయి?!”

“రాంగ్ పెర్సన్ని అడుగుతున్నావు!”

“పోనీ ఇది చెప్పండి. నా నల్లరంగు ప్రభావం నా వ్యక్తిత్వంమీద, నా ప్రతిభమీద, నా పనిమీద ఉంటుందంటారా?”

“మళ్ళీ నాకు రాంగ్ క్వశ్చనే!”

“సినిమాల్లో హీరోయిన్ని చూసీచూడంగానే ప్రేమించేస్తాడు హీరో. నిన్ను 12 మంది చూసినా ఒక్కరికీ నచ్చలేదు – అంటూ మా పేరెంట్స్ నన్ను నిందిస్తున్నారు !”

“ఎవర్నో అడగాల్సినవి నన్ను అడుగుతావేం!”

“సరే. మీకు సంబంధించిందే అడుగుతాను. ఒకసారి మీ ఆవిడ్ని చూడాలి… కవిగారి భార్యగారూ! కవిగారి భార్యగారూ!” లేచి కిచెన్ వైపు అడుగులు వేసి గట్టిగా పిలిచింది.

గబగబా వచ్చి నుదురు చిట్లించి చూసింది సుజాత.

ఆమె నఖశిఖ పర్యంతం చూసి పెదవి విరిచేసింది దీపిక. “అబ్బే! మీ కథల్లో, కవిత్వంలో ‘ఆహో ఓహో’ అని వర్ణించే ఒక్క స్త్రీమూర్తిలానూ లేదు! మీ భాషలో చెప్పాలంటే ఒకటోరకం అందవిహీన! మీ టేస్ట్ బొత్తిగా బావోలేదు. ఇలాంటి మహిళను పెళ్ళిచేసుకుని కూడా, మీ రచనల్లో ప్రవరాఖ్యుడికైనా రిమ్మ తెగులు పుట్టేలా ఎడాపెడా వర్ణించి పారేస్తున్నారంటే… ఓ… అర్థమైంది లెండి. మీకు దక్కని అందాలని ఊహించుకుంటూ తృప్తి పడిపోతున్నారన్న మాట… పాపం!”

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అనుభూతించాడా సానుభూతికి!

సుజాత మాత్రం ముఖం ఎర్రగా చేసుకుంది. “నువ్వెవతివే నా అందం గురించి దెప్పిపొడవడానికి!” మీదికెళ్ళింది.

దీపిక బెదర్లేదు. “అప్సరస ఇలా ఉంటుంది. ఇలా ఇలా ఉన్న ఆడదే అందగత్తె – అంటూ ఊరిపోతూ ఊగిపోతూ పేట్రేగిపోయి పేజీల కొద్దీ రాసి పడేసే ఈ కవిగారి అభిమానిని!”

భర్త వంక అయోమయంగా చూసింది సుజాత.

“చూడూ. నీ పద్ధతేం బావోలేదు. అసల్నువ్వెందుకొచ్చావో అది చెప్పు ముందు” కల్పించుకోకపోతే మర్యాద దక్కదనుకున్నాడు దుర్గారావు.

“గుండ్రని ముఖం, చేపపిల్లల్లా మిలమిల మెరిసే కళ్ళు, కోటేరులాంటి ముక్కు, పుష్టిగా ఉండే చెక్కిళ్ళు, శంఖంలాంటి మెడ, జంటకలశాల్లాంటి స్తనాలు, సింహపు నడుము, సన్నగా నాజూగ్గా మెరుపుతీగో లేక సన్నజాజితీగో అన్పించే రూపం,

అరటిబోదెల్లాంటి కాళ్ళు, ఉన్నత జఘనం, లేత అరటి ఆకుల్ని తలపించే పాదాలు – ఓహ్ ఆడవారి అణువణువునీ ఎంత అద్భుతంగా వర్ణిస్తారండీ... అలా ఉంటేనే అందగత్తె అని మీ పాఠకులమందరం అనుకుంటున్నాం. అలాంటి మహిళని మీరు ఎప్పుడు ఎక్కడ చూసి స్ఫూర్తిపొందారో కొంచెం చెప్తారా? చూపిస్తే మరీ మంచిది!"

ఇద్దరి వంకా నిరసనగా చూసి విసవిసా వెళ్ళిపోయింది సుజాత. బిక్కచచ్చిపోయాడు దుర్గారావు.

గోడమీది ఫోటో దగ్గరికెళ్ళి పరిశీలనగా చూసింది దీపిక. "మీ అమ్మానాన్నలేగా! అబ్బే. మీ అమ్మగారిలోనూ మీరు వర్ణించే సౌందర్య లక్షణాల్లో అయిదోవంతు కూడా లేవు. అంటే మీ లెక్క ప్రకారం చెప్పాలంటే మీ అమ్మగారిది, మీ భార్యది అందమే కాదు. మరి ఇంకెవర్ని ఐడియల్ ఉమన్‌గా తీసుకున్నారబ్బా! వాళ్లసలు ఈ భూమ్మీద ఉన్నారంటారా!"

అతడు గుటకలు మింగుతూంటే, గలగల వాగుతోందల్లా టేబుల్ మీదో ఫోటో కనిపించగా దగ్గరికెళ్ళి చూసింది.

"మీ అమ్మాయా! మీ పోలికలే వచ్చాయిగాని, అబ్బే... ఈమె కూడా మీరు వర్ణించే బ్యూటీలా ఏ కోశానా లేదు. నాకన్నా అధ్వాన్నంగా ఉంది, కాదంటే నేను లావు, ఆ అమ్మాయి ఈనుపుల్ల. అసలు ఇలాంటి అమ్మాయిని ఎలా కన్నారు సార్?"

రోషం పొడుచుకొచ్చింది దుర్గారావుకి. "షటప్. నా ఇంటి కొచ్చి నానాచెత్తా వాగుతావేంటి!"

"శాంతమే మనిషికి మహా ఆభరణం అంటూ ఏకంగా నవలే రాసిపడేసిన మీరిలా అడ్డంగా కోప్పడటం ఏం బావోలేదు! అంతలా ఉలిక్కిపడుతున్నారంటే, ఇంతదాకా మిమ్మల్నిలా ప్రశ్నించే అభిమాన పాఠకులు మీకు తారస పళ్ళేదా సార్?"

"నువ్వెక్కడ ప్రశ్నించావు? వచ్చినప్పట్నుంచీ అందం, నా శ్రాద్ధం అంటూ వదవద వాగుతూనే ఉన్నావ్!"

"సారీ. వెరీసారీ సార్. అందం అంటే ఏమిటో, ఎలా ఉంటే అందమంటారో కాస్త వివరించి పుణ్యం కట్టుకోండి సార్!"

స్థిమితపడుతూ అన్నాడు. "నేను కొత్తగా చెప్పేదేంటి? పూర్వంనుంచి ఎందరో కవులు, చిత్రకారులు, శిల్పులు వర్ణిస్తూనే ఉన్నారు. రంగుల రేఖల్లో చిత్రిస్తూనే, అపురూప శిల్పాలుగా మలుస్తూనే ఉన్నారు. ఆఖరికి బ్యూటీ కాంటెస్ట్‌ల వారు 36–24–36 కొలతల్లో ఉంటేనే బ్యూటీ అని ఎప్పుడో ముద్రకొట్టేశారు!"

"అంటే అందగత్తెని అన్పించుకోవాలంటే ఎప్పుడూ ఆ కొలతల్ని మెయిన్‌టెయిన్ చేస్తుండాలన్నమాట. అయితే కడుపునిండా తినకూడదు. శరీరంలో కొవ్వు క్యాలరీలు పెరగకుండా ప్రతీదీ తూకం వేసుకునే తినాలి. పనీపాటా చెయ్యకూడదు. కాని ఫిట్‌నెస్ కాపాడుకోడానికి కసరత్తులూ, యోగాలు చేయాలి. ఆపైన ఊరికే ఇలా ర్యాంపు మీద వంకరటింకర నడక నడుస్తూ మీ మగాళ్ళు థ్రిల్లయ్యేలా వయ్యారాలు ఆరబోయాలి. అంతేగా!" అంటూ నడిచి చూపించింది.

నవ్వకుండా ఉండలేకపోయాడు దుర్గారావు.

"అవునూ... పిల్లల్ని కన్నా, వాళ్ళకు పాలిచ్చినా అందం తరిగిపోతుందేమో కదండీ. సో, నిన్నటి బ్యూటీక్వీన్ నేటికి బ్యూటీ గాకపోయే ప్రమాదం ఎక్కువగా ఉందన్నమాట. పాపం, అందగత్తెల నుదుట ఎలాంటి పాపిష్టి రాత రాశారు కవిగారూ!"

"ఇది మరీ బావుంది. వాళ్ళెవరో కొలతలు, కొలబద్దలు నిర్ణయిస్తే మధ్యలో నన్నంటావేంటి? నేనేం చేశాను?"

"అంత అమాయకంగా మాట్లాడతారేంటి సార్? జనానికి... అదేనండి పాఠకుల మెదళ్ళను బ్రెయిన్‌వాష్ చేసింది మీరు, మీలాంటివారేగా! మీ రచనల్లో అప్సరసలకు తప్ప అప్పలమ్మలకు చోటుండదు. అసలు అందహీనుల్ని ఆడవారు అనకూడదేమో కదండీ? అదే మీ దృక్కోణం అయితే మీ ఇంట్లోని వారంతా..."

"వాగింది చాలు. ఏదో అభిమానిని అన్నావని లోపలికి రానిచ్చాను. నా పాఠకురాలివి గనుక కొద్దో గొప్పో సంస్కారం ఉండకపోతుందా అనుకుని గౌరవించాను. నువ్వు నా శత్రువు కన్నా ప్రమాదకరమైన దానిలా ఉన్నావు. ఇక దయచేయ్..." గుమ్మం చూపించాడు.

"మీ స్త్రీ పాత్రల వీరాభిమానిని పట్టుకుని ఇలా ముఖం వికారంగా పెట్టుకుని ముఖం మీదే పొమ్మని చెప్పడం సంస్కారం కాదేమో సార్..." అంతలో ఏదో గుర్తొచ్చినట్టు అతడ్ని సమీపించి పరిశీలనగా చూసి అంది. "నాకో డౌటు కవిగారూ. ఈ అందాలూ, సౌందర్య లక్షణాలూ, సంస్కారాలూ ఇవన్నీ మగాళ్ళకు అక్కర్లేదేమో కదండీ! అందుకే మీరు అనాకారిగా ఉన్నా సౌందర్య సాధనలూ, బ్యూటీ టిప్పూ పాటించడం లేదనుకుంటాను. యామై కరెక్ట్ ?"

"అధికప్రసంగం కట్టిపెట్టు. ఎవరితో ఎలా వ్యవహరించాలో తెలుసుకున్నాకే నాబోటి పెద్ద మనుషుల్ని కలువు. నీకో క్లారిఫికేషన్. అందాలనాయికల గురించి రాస్తేనే, వర్ణిస్తేనే పాఠకులు చొంగకారుస్తూ చదువుతారు. పచ్చిగా చెప్పాలంటే అప్పుడే మా సరుకు అమ్ముడవుతుంది. అందుకే మహామహులు కూడా శృంగారరసాన్ని గుప్పిస్తుంటారు!"

"మీరంతా ఒకే తాను ముక్కలేగా! ఆడదాన్ని భోగవస్తువుగా చూసే కళ్ళేగా! అవునూ, మీరంతా కన్నతల్లిలోనూ అందాలు వెదుకుతారా సార్?"

"నీకు పిచ్చెక్కిందా! అమ్మ ఎలా ఉన్నా అమ్మే. ఆమె మాట, నవ్వు, చూపు పరమ దుర్మార్గుడి చేతనైనా సరే 'నమో నమ:' అన్పిస్తుంది, తెలుసుకో!"

"మరి ఆడవారంతా ఎవరో కొందరికి అమ్మలే, అక్కలే, చెల్లెళ్ళే కదండీ. మరి వారినలా పవిత్ర భావనతో చూడకుండా శృంగార రసాధిదేవతల్లానే – కొంచెం ఎక్కువ కొంచెం తక్కువ కాకుండా – చూస్తారేంటి కవిగారూ!"

"నీ చేత చెప్పించుకునే స్థాయిలో లేను, మైండిట్" కోప్పడ్డాడు.

"నా సందేహం తీర్చనేలేదు. మీ రచనల్లోని అందాల భామలకు స్ఫూర్తి లేక మోడల్ ఎవరో చెప్పండి చాలు. వారు కచ్చితంగా మీ ఇంట్లోని వారు కాదు. మీ కాలేజీనాటి అమ్మాయిలా లేక మీ ఫ్రెండ్సా? అది ఇదీ గాక కోలీగ్స్ భార్యలా? అదేమీ కాకుండా పూర్తిగా మీ బుర్ర గీచిన ఏఐ చిత్రాలా!"

అతడి ముఖం మధ్యకు కోసిన కందగడ్డ అయింది. "నేను రాసింది నచ్చితే చదువు, నచ్చకపోతే పేజీలు తిప్పెయ్. అంతే గాని ఇలాంటి చచ్చు పుచ్చు వాదనలొద్దు. ఇంకా విసిగించకుండా దయచేస్తే మంచిది"

"గెస్ చేయగలన్లెండి. మీరు వర్ణించే స్త్రీ మూర్తులు మీ కథల్లోనే తప్ప నిజజీవితాల్లో ఉండరు. బహుశా మీ స్వప్నాల్లో, ఊహల్లో ఉండడానికి 90% ఛాన్సు ఉంది..."

"గట్టిగా అనకు. మా ఆవిడ వింటే చీపురు తిరగేస్తుంది!"

“మీ మీదా!” జాలిగా చూసింది.

వెర్రెత్తిపోయాడు. “గెట్ లాస్ట్ యూ బి...!”

“ఆఖరి అక్షరం మింగేశారేం? ఫరవాలేదు. నేనేమీ అనుకోనుగాని పూర్తిచేయండి. మీరు కార్చిన సొల్లు చదివిన నేరానికి మాకు తగిన శాస్తే చేస్తున్నారు. ఇన్నాళ్ళూ కవులూ, కళాకారులూ సమాజాన్ని ఉద్ధరిస్తారనుకునేదాన్ని. వాళ్ళు కీర్తికండూతితో సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని ఇప్పుడే అర్థమైంది. మీకో పెద్ద నమస్కారం!” తపీమని రెండు చేతులూ జోడించింది.

“నా రాతలేవీ ఈ సమాజాన్ని చెడగొట్టవు” స్వరం పెంచి, బింకంగా అన్నాడు.

“గంటనుంచి వాగుతున్నా నా కంఠశోష మీకు అర్థం కాలేదా? మీ మెదడు ఇంత ఘోరంగా కుంచించుకుపోయిందనుకోలేదు!”

“వెధవ్వాగుడు కట్టిపెట్టి చెప్పదలచింది సూటిగా చెప్పేడు!” కటువుగా అన్నాడు.

“మీ కథలూ కాకరకాయలూ చదివి జనం ఆడవాళ్ళంటే అందాల బొమ్మల్లా ఉండాలనీ, సినిమా స్టార్లలా ఎప్పుడూ మేకప్ చెరగకుండా ఉండాలనీ, కడకు వంటచేస్తున్నా సరే సౌందర్యశిల్పాల్లా కన్పించాలనీ కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటున్నారు. ఒంటిరంగు తెల్ల బడటానికి, నిగనిగలాడే జుట్టు కోసం, నాజూగ్గా ఉండే చర్మం కోసం ఎన్నో క్రీములు వాడుతున్నారు. ఇక జీరో సైజు కోసం ఎన్ని పాట్లు పడుతున్నారో చెప్పలేను. ఎందుకంటే అందంగా ఉంటేనే పెళ్ళవుతుందని, మొగుళ్ళని ఆకర్షించగలరని, ఈ మగ సమాజం గుర్తిస్తుందని! లేకపోతే కాస్త ఒళ్ళున్న నాలాంటివారిని ‘పిల్ల ఏనుగు’ అంటూ బాడీ షేమింగ్ చేయడానికి వెనుకాడరనీ కొన్ని అభిప్రాయాలు ఏర్పరచుకుంటున్నాం. దానిక్కారణం మీరూ మీలాంటి కళాకారులే. మేం బాపు బొమ్మలం కాదు. దయచేసి ఆడవారిని అందమైన శరీరాలుగా చూడకండి. మేమూ రక్తమాంసాలే కాదు మెదడు, జ్ఞానం ఉన్న మనుషులం. మీరేమీ మమ్మల్ని పొగడక్కర్లేదు. మమ్మల్ని మమ్మల్నిగా గుర్తించండి చాలు!” వేదనతో విలవిల్లాడింది దీపిక.

దిమ్మెరబోయాడు. తన అక్షరాలు సమాజాన్ని కలుషితం చేస్తున్నాయంటే అంగీకరించడానికి అతడి అహం అడ్డొచ్చింది.

“అదే నిజమైతే మా పుస్తకాలు చదవటం మానేయొచ్చుగా. పోటీపడి కొని మరీ చదవటం ఎందుకు? మమ్మల్ని పొగిడి బిరుదులిచ్చి సన్మానాలు చేయడం ఎందుకు? బూతురాతల్నీ, బూతు పత్రికల్నీ తిరస్కరిస్తే మళ్ళీ అలా ఎవరూ రాయసాహసించరుగా!”

“విజ్ఞతగల పాఠకులే మీకూ సంపాదకులకూ బుద్ధి, సంస్కారం నేర్పాలంటారు!” వ్యంగ్యంగా నవ్వింది.

కంగారుపడ్డాడు దుర్గారావు. “అహ అలా అని కాదు. అమ్ముడవని సరుకును ఎవరూ ఉత్పత్తి చేయరు!”

“ప్రపంచీకరణ పుణ్యమా అని ఆడదాన్నే కాదు అందాన్నీ అంగడి సరుకు చేసేశారు. అందం ఇప్పుడు వేల కోట్ల పరిశ్రమ అయింది! ఇప్పుడైనా కళ్ళుతెరచి లెంపలేసుకోండి ప్లీజ్. మీ కలాల్లోని ఇంకు మార్చండి. చేతనైతే సమాజాన్ని బాగుచేయండి

గాని అందంగా లేని ఆడపిల్లల్ని ఆత్మన్యూనతలోకి తోసేసి బలహీనుల్ని చేయకండి! ఆత్మక్షోభకు గురి చేయకండి!" చేతులు జోడించి కన్నీటితో అర్థించింది.

గబగబా లోపల్నుంచి వచ్చింది సుజాత.

"ఆవిడ నిలబెట్టి కడిగేస్తున్నా నోరు విప్పరేమండీ. అంటే అదంతా అక్షరసత్యమని మీ అంతరాత్మకి అర్థమైందన్నమాట! అలాంటప్పుడు ఆ రాతలు రాయడం ఎందుకు? మానేసేయండి! మీ భార్యగా గాక ఒక స్త్రీగా చెబుతున్నాను. అందం శరీరపు రంగులో, ఒంపుసొంపుల్లో కాదు నడతలో వ్యక్తిత్వంలో ఉంటుంది. ఇకనైనా బాహ్యసౌందర్యాన్ని గాక ఆత్మసౌందర్యాన్ని చూడటం నేర్చుకోండి. ఫలానా కవిగారి భార్యగా నన్ను తలెత్తుకుని తిరగనివ్వండి!"

"నువ్వు కూడానా?" పరమాశ్చర్యపోయాడు దుర్గారావు.

సరిగ్గా అప్పుడు ఇంటర్ చదువుతున్న వారమ్మాయి సుడిగాలిలా వచ్చి తల్లిని చుట్టేసింది. "నాకు చచ్చిపోవాలనుందమ్మా!" బావురుమంది.

"ఏమైందమ్మా?" అని తల్లి, "అంత కాని కష్టం ఏమొచ్చిందే?" అని తండ్రీ ఒకేసారి అడిగారు.

"నేను అందంగా లేనని కాలేజీలో ఎవరూ నాతో స్నేహంగా ఉండట్లేదు. బాయిస్ నా ఫ్లాట్ చెస్ట్ చూసి నవ్వుతున్నారు. నేనసలు గాళ్‌నే కాదని హేళన చేస్తున్నారు. ఇన్నాళ్లూ నాలో నేనే కుంగిపోయాను. ఈ టార్చర్ భరించడం నా తరం కావట్లేదు. చచ్చిపోతానమ్మా!"

దీపిక ముందుకొచ్చి ఆమె వీపు నిమిరింది. "నువ్వెందుకు చనిపోవాలి చిన్నారీ? ఆడవారిని అందమైన శరీరాలుగా మాత్రమే చూసే మగాడి కళ్ళు పేలిపోవాలి. ఆడవారి శరీరాన్ని వస్తువుగా చూసే వ్యాపార సంస్కృతి కుక్కచావు చావాలి. మగాళ్ల సౌందర్య భావజాలం మన శరీరాన్ని తాకనివ్వకుండా, లోలోపలికి ఇంకనీకుండా మనల్ని మనం రక్షించుకుందాం. మన ఆత్మవిశ్వాసాన్ని బ్యూటీపార్లర్లకు, కాస్మటిక్స్‌కీ తాకట్టు పెట్టొద్దు. స్త్రీత్వానికి సౌందర్య ఉత్పత్తులే గుర్తింపు గౌరవం తెస్తాయనే భ్రమల్లోంచి బయటపడదాం. ఆడవాళ్ళం అందంగా తయారవడం మగాళ్ళ కోసమే అన్న అబద్ధాన్ని నిట్టనిలువునా బ్రద్దలు గొట్టేద్దాం!" ఆవేశపడింది.

తల్లిని వదిలి దీపికని కావలించుకుందామె.

"అది సాధ్యమేనా?"

"మనం గట్టిగా తలచుకుంటే సాధ్యం కానిదేమీ ఉండదు. మొదట మన ఆలోచనల్ని దృక్పథాల్ని యాసిడ్‌తో కడిగేద్దాం. పిమ్మట మీ నాన్నలాంటివారందరినీ కళ్ళకు తగిలించుకున్న కృత్రిమ రంగుటద్దాలు తీసేసి ఆడవారిని స్ఫటికపు అద్దాల్లోంచి చూడమందాం. మనల్ని తోటిమనుషులుగా గుర్తించమని డిమాండ్ చేద్దాం. ఈ సమాజపు దృష్టికోణం మార్చేందుకు సహకరించమని కోరదాం..."

ఏమంటారన్నట్టు భర్త వంక చూసింది సుజాత.

"కవిగారూ! మీ అక్షరాలు జనం కళ్ళు తెరిపించాలి. ఆలోచింపజేయాలి. మేల్కొల్పాలి. ఆడమగ అంతా సవ్య నవ్యమార్గాన నడిచేలా చేయాలి. అంతేగాని ఎమ్మెన్సీల అమ్మకాలు పెంచడానికి, డబ్బు ఆరోగ్యాలు పాడుజేసుకోడానికి ఏమాత్రం దోహదపడకూడదు. దయచేసి మా కళ్ళముందు మాయాలోకం సృష్టించి మమ్మల్ని భ్రమల్లో ముంచి భ్రష్టుల్ని చేయకండి! ఆడవారు... ముఖ్యంగా అమ్మాయిలను అనారోగ్య ధోరణులను ఆరాధించే స్థాయికి దిగజార్చకండి ! దయచేసి సమాజాన్ని చీలికలు పీలికలు చేయొద్దు! ఆడవారిని గౌరవించడం నేర్చుకోండి, నేర్పండి! ఇది మా వినతే కాదు హెచ్చరిక కూడా!" తీవ్ర స్వరంతో అంది దీపిక.

"మనమ్మాయి ఎందుకు కుంగిపోతోందో, ఎందుకు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిందో ప్రత్యక్షంగా చూశారుగా. ఇకనైనా ఆకాశంలో విహరించడం మానేసి భూమ్మీద నడవడం నేర్చుకోండి!" మందలించింది సుజాత.

ఆసరికే తల నేలలోకి క్రుంగిపోయిన దుర్గారావు తలెత్తలేకపోయాడు!

# స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః

వసుంధర
✆ 9885620065

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథలపోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> *"ఒకసారి ఉద్యోగంలో చేరానా- ఫ్రీబర్డుని. పెళ్లి చేస్కుంటానో చేస్కోనో నా ఇష్టం. ఎవరి బ్లాక్మెయిలింగుకీ తలవంచను" అంది రమ్య.*
>
> *పరిస్థితి అర్థమైంది. "మరి నాపై నీ ప్రేమ?" అన్నాను ఆశ్చర్యంగా.*
>
> *"నాకు ప్రేమేంటి బావా? చిన్నప్పట్నించీ నా గోల్సు నాకున్నాయి. బొడ్డూడని వయసులోనే నా పెళ్లిని నిర్ధారించిన పెద్దల్ని కాదనలేక నీమీద ప్రేమని నటించానంతే!" బాంబు పేల్చింది రమ్య.*
>
> *"నటనా? ప్రేమ లేకపోతే నటించడమెందుకు?" అన్నాను తెల్లబోయి.*
>
> *"మగాడివి, నీకర్థంకాదులే బావా!"*

రమ్య నా మరదలు. పుట్టడమే నాకు పెళ్లాంగా పుట్టింది. చిన్నప్పట్నించీ కలుసుకున్నప్పుడల్లా తన సమక్షం రమ్యంగా ఉండేది నాకు. పదహారేళ్లొచ్చేక తనే నాకు 'ఐ లవ్యూ' చెప్పింది. తర్వాతనుంచి అత్తయ్య, మామయ్య రమ్యకి నామీదెంత ప్రేమో రమ్యంగా చెప్పేవారు. తనకి నేనంటే ప్రాణమట. నన్ను పెళ్లాడ్డమే తన ధ్యేయమట!

జాలేసేది. ఆడపిల్లని చిన్నప్పట్నించీ పెళ్లికోసమే పెంచే మన వ్యవస్థపట్ల జుగుప్స పుట్టేది. ఆడదానికి పెళ్లే పరమావధి అన్నట్లుండే మన సినిమాల ప్రాచుర్యానికి బాధ కలిగేది. ఆ మాట రమ్యతో అంటే, 'ఏమో, నాకు నువ్వంటే ప్రేమ' అనేది.

రమ్యకి బీటెక్ అవగానే పెళ్లికి ముహూర్తం పెట్టించమన్నాడు మామయ్య. నాన్న సరేనన్నాడు. కానీ ఇప్పట్లో పెళ్లొద్దని ఖచ్చితంగా చెప్పేశాను.

"పోనీ, ఎప్పుడు చేసుకుంటావో చెప్పు!" అన్నాడు నాన్న.

రమ్యని చేసుకోనప్పుడు, పెళ్లెప్పుడు చేసుకుంటేనేం అనాలనుకున్నాను. కానీ రమ్య రియాక్షన్!?


స్త్రీ బుద్ధిః ప్రళయాంతకః. రమ్యముందు నా ఆశయమెంత!

“అలా అడిగితే వాడేంచెబుతాడు? మీరడిగారని మాటవరసకి వద్దన్నాడు. గట్టిగా చెబితే కాదంటాడా ఏమిటి?” అని నాన్నని మందలించి, “ఏ వయసుకా ముచ్చట. పాతికేళ్లొచ్చాయి. పెళ్లి చేసుకో. మామయ్యా, మేమూ సంతోషిస్తాం” అంది అమ్మ లౌక్యంగా.

ఇది నాకు కొత్తేం కాదు. ఇలా నన్ను ఊదరగొట్టడంలో– ఇంటర్ ఫలితాలొస్తే టివిల్లో కోచింగు సెంటర్ల ప్రచారాన్ని మించిపోయారు– మా ఇంటి పెద్దలంతా!

పెళ్లి నా సంతోషం కోసమా, వాళ్ల సంతోషం కోసమా?

ఇంత చిన్న లాజిక్ వాళ్లకర్థం కాదు.



‘జీవితమంటే చదువు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు’ అని వాళ్లంటే– తిన్నామా, పడుకున్నామా, తెల్లారిందా అన్నట్లుంటుంది.

మానవ ప్రయత్నంగా ఓసారి రమ్యతో మాట్లాడాలనుకున్నాను.

★★★

నాలుగు తరాలుగా ఇదే జరుగుతోంది మా ఇంట్లో. ఈ నాలుగో తరంలోనూ అన్నయ్య, ఇదే అనుసరించి– ఇంజనీరై అమెరికా వెళ్లాడు. పెద్దలు చూసిన అమ్మాయి నాకు వదినయింది. వాళ్లిప్పుడు అమెరికాలో ఉన్నా, మన సంప్రదాయాల్నే పాటిస్తూ, పూజలూ పునస్కారాలతో మన సంస్కృతిని కాపాడుతున్నారు.

అన్నయ్య నాకంటే ఏడేళ్లు పెద్ద. వాణ్ణి ఆదర్శంగా తీసుకోమంటారు మా ఇంట్లో అంతా!

వాడంటే నాకిష్టం. గౌరవం. వాడిలా ఉండమంటేనే చిక్కు. నేనుండాల్సింది

నాకులాగే కదా! ఐనా ఈ నేను నేనా ఏమిటి? మావాళ్లే చదివించారు. చదువుతో బుద్ధి వికసించింది.

మావాళ్లు నా చదువుని మార్కులతో, రాంకులతో కొలుస్తూ– క్లాసులో టాప్ ఫైవులో ఉన్నానని సంతోషించారు. నా వ్యక్తిత్వం గురించి ఆలోచించరేమని మనసు చివుక్కుమనేది నాకు.

టెన్తులోకి వచ్చేకనే నా వ్యక్తిత్వం వాళ్లకి పరిచయమైంది.

పరీక్షకి ముందురోజు సాయంత్రం– అమ్మవారి ఆశీర్వాదం తీసుకుందుకు, గుడికి వెళ్లొద్దామన్నారు అమ్మా నాన్నా.

వెళ్లడానికో అరగంట. గుళ్లో అరగంట. వెనక్కి రావడానికింకో అరగంట. పరీక్షల ముందీ గంటన్నర రివిజనుకీ, రిలాక్సేషనుకీ పనికొస్తుందంటే, "అలాగనకూడదురా, లెంపలేసుకో! అమ్మవారిక్కోపమొస్తుంది" అంది అమ్మ.

నాకు దేవుడంటే గౌరవముంది. నమ్మకముంది. అర్హతకు తగ్గ ఫలితాన్ని అడక్కుండానే ఇవ్వడం అమ్మవారి వంతు. తగినకృషి చెయ్యడం నా వంతు. సరిగ్గా పరీక్షలముందే గుడికెడితే నా కృషికి అంతరాయం. కోపమంటూ వస్తే అందుకు రావాలి అమ్మవారికి! అది వివరించి, "అందాకా మీరు గుడికెళ్లి నా తరపున ఆశీర్వాదం తీసుకోండి. పరీక్షలయ్యేక నేనూ వెడతాను" అన్నాను వాళ్లతో.

ఆ మాట ఇద్దరికీ నచ్చలేదు. పరీక్షలముందు గొడవెందుకని వాదన పెంచలేదు. ఇద్దరూ గుడికెళ్లి ప్రసాదం తెచ్చిచ్చారు.

పరీక్షలు బాగా వ్రాశాను. అన్న ప్రకారం అమ్మానాన్నలతో గుడికెళ్లి భక్తితో అమ్మవారికి నమస్కరించాను. బయటికొచ్చేక, "ఏమని కోరుకున్నావురా?" అంది అమ్మ కుతూహలంగా.

"దర్శనం చేసుకునేది భక్తితోనా, కోరికలు తీర్చమనడానికా?" అన్నాను.

"అడగందే అమ్మైనా పెట్టదు" నా విషయం తెలియక నోరుజారింది అమ్మ.

"అడిగితే పెట్టేది అమ్మ. అడక్కుండా పెట్టేది అమ్మవారు" అన్నాను చటుక్కున.

"ఎవరు నేర్పుతున్నార్రా, ఇలాంటి మాటలు!" విసుక్కుంది అమ్మ.

"చదువు" అన్నాను.

"నువ్వొక్కడివేనా చదివావు! ఇక్కడ కోర్కెలు తీర్చమనేవారెవ్వరిదీ చదువు కాదా?" అన్నాడు నాన్న కలగజేసుకుని.

"ఏమో నాకు తెలియదు నాన్నా!" అన్నాను. అదే సమాధానమని నాకప్పుడు తెలియదు.

నేను ఇంటర్లో చేరేటప్పుడు అన్నయ్యింకా అమెరికా వెళ్లలేదు. వాడి చదువుకీ, కోచింగుకీ లక్షల్లో ఖర్చయింది. ఆ లోన్సుకింకా ఈఎంఐలు కడుతున్నాడు నాన్న. ఇప్పుడు నన్ను మంచి కోచింగ్ సెంటర్లో చేర్చాలంటే అప్పటికంటే ఎక్కువౌతుంది. పల్లెటూళ్లో మూడెకరాల పొలముంది. ఓ ఎకరం అమ్మేస్తానన్నాడు నాన్న.

"నేను గవర్నమెంటు కాలేజిలో చదువుతాను. కోచింగు తీసుకోను" అని ఆయనకు కరాకండిగా చెప్పేశాను.

"తరతరాలుగా ఎందరో పేదవాళ్లని చదివించిన వంశం మనది. నీకోసం వెనకాడ్డం గిల్టీగా ఉంటుంది" అన్నాడాయన.

నిజమే! మా పెద్దలు ఎన్నో మంచిపన్లు చేశారు. ముత్తాతగారి హయాంలో వందెకరాలుండేవి. తాతగారి హయాంలో పదుల్లోకి దిగాయి. ఇప్పుడు నాన్నకున్నవి మూడెకరాలు.

ఐతే మా పెద్దల దానధర్మాల సొమ్ము స్వయంకృషితో సంపాదించలేదు. తర్వాతి తరాలకు అందాల్సిన వారసత్వపుటాస్తిని బాధ్యతారహితంగా ఖర్చుచేశారు. చేసిన మంచిలోనూ మెహర్బానీ పాలెక్కువ. మంచిపన్లెన్ని చేసినా, వ్యక్తులుగా వారు ప్రత్యేకంగా సాధించింది లేదు. అలాగని వారిపట్ల నాకు నిరసన లేదు. వారంటే గౌరవంకూడా! కానీ వారు వ్యక్తిత్వాల్ని సంప్రదాయాలకి తాకట్టుపెట్టి, తిన్నామా పడుకున్నామా తెల్లారిందా సంస్కృతికి పాలుపోశారన్న అసంతృప్తి నన్ను వేధిస్తూంటుంది.

అలాగని అప్పుడప్పుడు అమ్మవద్ద అంటుంటాను. అమ్మద్వారా నాన్నకి చేరుతాయని తెలుసు. ఐతే ఇప్పుడుమాత్రం నేనా విషయం ప్రస్తావించలేదు.

"నాన్నా! ఒకప్పుడు పంట దిగుబడి పెంచడానికి ఎరువులు ఎక్కువగా వెయ్యడం రివాజు. అది మంచిపద్ధతి కాదని గ్రహించి, ఇప్పుడు ఎరువులు వెయ్యని పంటపై ఎక్కువ మక్కువ చూపుతున్నాం. ఆర్గానిక్ పంటలు, వంటలు నేటి ట్రెండ్. అదే ట్రెండులో నాదిప్పుడు ఆర్గానిక్ చదువు!" అన్నాను.

"ఆర్గానిక్ చదువా, అదేమిటి?" అన్నాడు నాన్న.

"కోచింగు సెంటర్లలో చదువు వంటబట్టినా పట్టకపోయినా, పాఠాలు ఇట్టే నోటికొచ్చేలా బట్టీపట్టిస్తారు. అది మార్కుల్లో అధిక దిగుబడికోసం– ఎరువెయ్యడంలాంటిదే. ఆ శిక్షణ తాత్కాలిక ప్రయోజనాన్నిచ్చినా, కాలక్రమంలో కలిగించే భౌతిక–మానసిక ఒత్తిడిపై ఎన్నో కథనాలున్నాయి. నాకు ఎరువుల చదువు కాదు, అవగాహన పెంచే ఆర్గానిక్ చదువు కావాలి" అన్నాను. అప్పటికప్పుడు నాలో పుట్టిన ఆర్గానిక్ చదువన్న మాట నాకే ఆశ్చర్యం కలిగించింది.

"పల్లెటూరితో మన అనుబంధమెలాగూ ఎన్నాళ్లో ఉండదు. పొలమమ్మడమిష్టంలేక, నువ్వు అర్గానిక్ చదువంటున్నావు. ఔనా?" అన్నాడు నాన్న. ఆయనలో ఇంకా గిల్టీ ఫీలింగుంది.

"ఆ పొలాన్ని టచ్ చెయ్యద్దు. ఊరితో మన అనుబంధాన్ని ఎవరూ టచ్ చెయ్యకుండా నేను చూసుకుంటాను" అన్నాను.

క్లాసురూమ్‌లో చదువు. ఇంటర్నెట్లో లోకజ్ఞానం. ఆలయాల్లో ప్రవచనాలు. సోషల్ మీడియాలో స్పందనలు. మనసుండాలి కానీ జ్ఞానపరిజ్ఞానాల ఆస్వాదనతో బుద్ధిని వికసింపజేసుకుందుకు ఇప్పుడు ఎన్ని అవకాశాలు!

ఇవే నా జీవనగమన దిశానిర్దేశానికి కూడా సహకరించాయి.

గవర్నమెంటు కాలేజిలో ఆర్గానిక్ చదువు చదివాను. ఇంటరయ్యేక ఫ్రీ సీటు సంపాదించి, కాలేజి టాపరుగా ఇంజనీరింగు డిగ్రీ తీసుకున్నాను. కేంపస్ ఇంటర్వ్యూలో రెండు మల్టీనేషనల్ కంపెనీలు నన్నెంపిక చేశాయి. వాటిలో ఓ కంపెనీ ఐతే ఏడాదికి యాభై లక్షల ఆఫరివ్వడం ఇంటా బయటా టాకింగ్ పాయింటైంది.

నాన్న సంతోషానికి అవధులు లేవు. ఇప్పుడున్న ఇల్లు అమ్మేసి కొత్త విల్లా కొనే యోచనలో ఉన్నాడు. అందుకు అదనంగా ఇంకో మూడు కోట్లు కావాలి. లోన్ తెస్తే, ఈఎంఐలు లక్షల్లో ఉంటాయి. సగం తను భరిస్తానన్నాడు అన్నయ్య.

మిగతా సగం నేను భరిస్తాననుకున్నాడు నాన్న. కానీ, “ఇప్పుడుంటున్న ఇల్లు నా బాల్యంతో ముడిపడింది. ఇంట్లో అందరికీ దశాబ్దాల అనుబంధమున్న ఇల్లది. అది అమ్మడం నాకిష్టం లేదు” అన్నాను.

“పోనీ, పొలం అమ్మేస్తాను” అన్నాడు నాన్న. మాట్లాడితే ఆ పొలమొకటి ఆయనకి! అది వారసత్వపుటాస్తి. అమ్మాలంటే నా సంతకం కావాలి. ఒప్పుకోనని చెప్పాను.

నాన్న కంగుతిన్నాడు. పొలమమ్మకపోతే, నేను కట్టాల్సిన ఈఎంఐ బాగా పెరిగిపోతుందన్నాడు.

“అసలు ఈఎంఐలు కట్టడానికి నా దగ్గర డబ్బెక్కడిది?” అన్నాను.

“ఏడాదికి యాభై లక్షలంటే నెలకి నాలుగు లక్షలు కదా, డబ్బు లేదంటావేంటి?” అన్నాడు నాన్న.

నాకొచ్చిన ఆ ఆఫరే నాన్న మనసుని విల్లావైపు తిప్పిందని అర్థమైంది నాకు. “నేనా ఆఫర్ యాక్సెప్ట్ చెయ్యలేదు. ఏడాదికి ఇరవైలక్షల ఆఫర్ ఇంకోటుంది. అది యాక్సెప్ట్ చేశాను” అన్నాను.

ఆ విషయం తెలియదేమో, నాన్న తెల్లబోయాడు. అసలలాంటి నిర్ణయం తీసుకునేవాళ్లుంటారని ఆయన ఊహించలేదు. చిన్నప్పట్నించి చూస్తున్నాను– ఆయన నన్నెప్పుడర్థం చేసుకున్నాడు కనుక!

“అలా ఎలా చేశావురా?” అన్నాడు నాన్న.

యాభైలక్షల ఆఫరుకి న్యాయం చెయ్యాలంటే– నేనా కంపెనీకే అంకితమైపోవాలి. పనిగంటలు పేరుకి రోజుకి ఎనిమిది గంటలైనా, వాస్తవంలో ఇరవై గంటలు కూడా చాలవు. ఆ ఉద్యోగం కోచింగ్ సెంటర్లో చదువులాగే ఉంటుంది. అదే ఇరవైలక్షల ఆఫరు తీసుకుంటే– వర్క్–ఫ్రం–హోం సదుపాయముంది. ఇవన్నీ చెప్పి, “మకాం మనూరికి మారుస్తాను. పొలం చూసుకుంటూ– నా ఆశయసిద్ధికి పాటుబడతాను. ఆర్గానిక్ చదువుకి, ఆర్గానిక్ ఉద్యోగం” అన్నాను నాన్నతో.

“అంతా విదేశాలకి ఎగబడుతున్నారు. లేదూ పెద్ద సిటీలకి వెడుతున్నారు. పల్లెటూరెళ్లి ఏం చేస్తావురా?” అన్నాడు నాన్న. ఆ గొంతులో ఆక్రోశముంది.

నాన్న ఆక్రోశంలో ఆశ్చర్యం లేదు. యుద్ధవిమానాలకి బదులు డ్రోన్లు వాడితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలొస్తాయని తెలుసుకుందుకు అత్యాధునిక భారతసైన్యానికే ఓ రోజు పట్టింది. కృత్రిమమేధ విజృంభిస్తున్న ఈ ఆధునిక యుగంలో తమకున్న అవకాశాల గురించి యువతలో ఎంతమందికి తెలుసు?

వ్యక్తిగతంగా ఆదాయం పెంచుకుందుకో, వైభవం పొందేందుకో, ఆకర్షణకి లోనయ్యో– పుట్టినూర్నీ, సొంతగడ్డనీ వదిలిపోయేవారు చాలామందున్నారు. కానీ వారు కాదు నాకాదర్శం! మన ఊరు, మన ప్రాంతం, మన దేశం– వీటికి ఉపయోగపడేందుకు ఏదో చెయ్యాలనుకునేవారు కొందరున్నారు. వారూ నాకాదర్శం!!

జ్ఞానవిజ్ఞానాల పాతర, అవకాశాల దొంతర– వీటిని మన యువత అవగాహనకు అందజెయ్యాలనుకోవాలే కానీ– అందుకు యూట్యూబువంటి ఎన్ని వేదికలు!

వాటిలో–

దేశంలో వివిధ రంగాల్లో ఊహాతీతఫలితాలు సాధించినవారెందరో ఉన్నారు. వారెవరూ, ఎంచేశారూ, ఎలా చేశారూ అన్న వివరాల్ని ఇంటర్వ్యూలుగా ప్రదర్శించొచ్చు. చదువులో క్లిష్టమైన అంశాల్ని కథల్లాంటి పాఠాలుగా అందించొచ్చు. సుఖజీవనానికి ఆర్గానిక్ చదువు, ఆర్గానిక్ ఉద్యోగం ఎలా దోహదం చేస్తాయో ప్రచారం చెయ్యొచ్చు.

నేను పక్కా ప్లానుతో ఉన్నానని నాన్నకి అర్థమైపోయింది. ఇక చివరి అస్త్రం ప్రయోగించాడు. అదే రమ్య!

చిన్నప్పట్నించీ నాకు భిన్నంగా పెరిగింది రమ్య. ఐతే తనూ నాకులాగే సమాజానికేదో ఇద్దామనుకుంటోంది. ఎటొచ్చీ ఆమెకు నేనే సమాజం. ఆ సమాజానికి తనతో తప్ప వేరే సమాజంతో అనుబంధముండకూడదు.

రమ్యంటే నాకిష్టం. అదే నా బలహీనత!

నేనొప్పుకుంటే సరేసరి! లేదూ, ప్రాణం తీసుకున్నా తీసుకుంటుంది. స్త్రీబుద్ధిః ప్రళయాంతకః. ఇక నా ఆశయమెంత!

“ఓసారి రమ్యతో మాట్లాడాలి” అన్నాను నాన్నతో. అది మానవ ప్రయత్నం మాత్రమేనని తెలుసు…

★★★

నిజం ఊహకంటే చిత్రమైనదని– ఏకాంతంలో రమ్యతో మాట్లాడినప్పుడు మరోసారి ఋజువైంది నాకు.

రమ్య నా ఆశయాన్ని సమర్థించింది. నా నిర్ణయాన్ని అభినందించింది. నేను తనని కాదంటే తనకంటే సంతోషించేవారు లేరంది. పెళ్లయ్యేదాకా తనని ఉద్యోగంలో చేరొద్దన్నాట్ట మామయ్య. ఇప్పుడు నేను పెళ్లొద్దంటే తను ఉద్యోగంలో చేరొచ్చుట. “ఒకసారి ఉద్యోగంలో చేరానా– ఫ్రీబర్డుని. పెళ్లి చేస్కుంటానో చేస్కోనో నా ఇష్టం. ఎవరి బ్లాక్మెయిలింగుకీ తలవంచను” అంది రమ్య.

పరిస్థితి అర్థమైంది. “మరి నాపై నీ ప్రేమ?” అన్నాను ఆశ్చర్యంగా.

“నాకు ప్రేమేంటి బావా? చిన్నప్పట్నించీ నా గోల్సు నాకున్నాయి. బొద్దూడని వయసులోనే నా పెళ్లిని నిర్ధారించిన పెద్దల్ని కాదనలేక నీమీద ప్రేమని నటించానంతే!” బాంబు పేల్చింది రమ్య.

“నటనా? ప్రేమ లేకపోతే నటించడమెందుకు?” అన్నాను తెల్లబోయి.

“మగాడివి, నీకర్థంకాదులే బావా! చిన్నప్పట్నించీ ఆడపిల్లలకి ఎన్నో అదుపులు. వాటిని అధిగమించడానికి నటన తప్పనిసరి! మా ప్రేమ నటన! సంతోషం నటన! దుఃఖం నటన! అన్నీ నటనే! ఒక్కసారి ఉద్యోగంలో చేరనీ! నేనేంటో అందరికీ తెలిసేలా చేస్తాను” ఉత్సాహంగా అంది రమ్య!

‘ఇప్పుడిదీ నటనేనా?’ అనబోయి ఆమె ఉత్సాహం చూసి ఆగిపోయాను.

పెళ్లి వద్దో అంటున్న ఎందరో నేటితరం యువతులు ఆమెలో దర్శనమిచ్చారు నాకు.

అప్పుడే “స్త్రీబుద్ధిః ప్రణయాంతకః” అనే కొత్త నినాదం దొరికింది నా యూట్యూబు వేదికకి!

# జాలివాన

పెనుమాక నాగేశ్వరరావు
✆ 9441254044

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***"అమ్మానాన్నలకు, ఈ విషయంగా ఇలా మీకు చెప్పాల్సివస్తుందని నేను ఊహించలేదు. నేనే కాదు ఏ కూతురు ఊహించలేదు. ఎందుకంటే ఇది ఊహాతీతం. కన్నతల్లితండ్రులే కూతురి పెళ్ళి విషయంలో స్వార్థంగా ఆలోచిస్తారని ఏ కూతురు అనుకుంటుంది? ఎలా ఊహిస్తుంది? నాకు ఉద్యోగం వచ్చేవరకు మనం చాలీచాలని ఆదాయంతో గడిపినమాట నిజం. నా చదువు పూర్తయ్యాక నాకు వచ్చిన ఉద్యోగం వలన మన ఆదాయం, ఆనందం పెరిగిన మాట కూడా నిజమే.***

"అమ్మా! ఓ మాట. నాన్నా! మీరు కూడా కూర్చోండి. నేను మీ ఇద్దరితో కాసేపు మాట్లాడాలి."

ఆలుమగలిద్దరూ ఒకరిముఖాలు ఒకరు చూసుకుంటూ చెరో కుర్చీలో కూర్చున్నారు.

చేతిలో ఉన్న సెల్‌ఫోన్ ఓసారి తల్లి చేతికి ఇచ్చింది కల్పన.

"నేను ఇతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అమ్మా నాన్నలిద్దరినీ ఉద్దేశించి చెప్పింది

ఆ ఇద్దరూ ఎప్పుడూ ఊహించని సంఘటన.

"ఎవరమ్మా ఇతను?"

"పేరు ప్రభాకర్. ఊరు గుంటూరు దగ్గర ఓ పల్లెటూరు. కులాలు, గోత్రాలు, జాతకాలు అన్నీ సరిపోయినై" సూటిగా చెప్పింది కల్పన.

కూతురి దగ్గర్నుంచి అలాంటి మాటలు వినాల్సి వస్తుందనుకోని ఆ దంపతులు అచేతనులయ్యారు. అవాక్కయ్యారు.

"ఏం చేస్తుంటాడు?" మాటలు కూడదీసుకుని అడిగింది తల్లి రామలక్ష్మి.

"ఏం చేయడు." చెప్పింది కల్పన.

"అదేంటమ్మా?" ఆశ్చర్యంగా అడిగాడు నాన్న నారాయణమూర్తి.

"నేను చేస్తున్నానుగా నాన్నా!"

"పోనీ చదువుకున్నాడా?" అడగకుండా ఉండలేక అడిగాడు.

"పి.జీ."

"అతని అమ్మా, నాన్నా?"

"ఉన్నారు. ఆయన వ్యవసాయం చేస్తుంటారు. ఆమె హౌస్‌వైఫ్."

"అన్నలూ, అక్కచెల్లెళ్లూ..."

"ఓ అక్క, ఓ తమ్ముడు. అక్కకి పెళ్లయ్యింది. తమ్ముడు చదువుకుంటున్నాడు."

"మీ ఇద్దరికీ ఇదివరకే పరిచయం ఉందా?"

"ఈ మధ్యనే పరిచయం."



“పెళ్ళి చేసేసుకోవటం ఖాయమా?'' అడగటంలో ఆదుర్దా దాచుకోలేకపోయింది రామలక్ష్మి.

“అవునమ్మా. ముహూర్తం కూడా నిర్ణయించుకున్నాం.''

“ఒకేసారి పెళ్ళిచేసుకుని చెబితే సరిపోయేది కదమ్మా'' నారాయణమూర్తి అన్నాడు.

“మొదట అదే అనుకున్నాం నాన్నా. కానీ ఎందుకో మనసొప్పలేదు. అందుకే ముందే చెప్పాలనుకున్నాను.''

“సంతోషం. పెళ్ళి సాంప్రదాయబద్ధంగానా? రిజిష్టర్ పెళ్ళా?'' అమ్మ అడిగింది

“అది నిర్ణయిస్తారనే ముందుగా మీకు చెబుతున్నాను.''

“అన్నీ నిర్ణయించుకున్నవాళ్లు ఆ విషయం నిర్ణయించుకోలేకపోయారా?''

“నిర్ణయించుకోలేక కాదు... అది మీకు వదిలేద్దామనుకున్నాం.''

“వాళ్ళ వాళ్ళు ఏమంటున్నారుట?''

“వాళ్ళకి ఎలాగైనా సరేట.''

“అవున్లే. ఉద్యోగం సద్యోగం లేని కొడుక్కి నెలకి లక్ష రూపాయల పైనే సంపాదిస్తున్న పిల్ల పెళ్ళాంగా వస్తుంటే, వాళ్ళకేం అభ్యంతరం ఉంటుంది?''

“వాళ్ళకి అలాంటి ఆలోచనేం లేదు నాన్నా.''

“నువ్వు వాళ్ళతో కూడా మాట్లాడావా?''

“రెండుసార్లు వాళ్ళ ఊరు వెళ్ళి వచ్చాను కూడా.''

“మాకు తెలీకుండా ఇంత జరిపావన్నమాట!''

“నేనేం జరపలేదు. అది అలా జరిగింది అంతే.''

“మమ్మల్ని ఇప్పుడేం చేయమంటావ్?''

“ఇది మీ అందరికీ ఆమోదయోగ్యమైన పెళ్లే అనేటట్లు, బంధువుల్ని, ఇతరుల్నీ పిలిచి చేస్తారో, మమ్మల్నే రిజిష్టర్ పెళ్ళి చేసుకుని రమ్మంటారో నిర్ణయించమంటాను... ఆనక మీ ఇష్టం.''

“ఇది మాత్రం మా ఇష్టానికి వదిలేశావ్ మొత్తం మీద.”

“మీకు అభ్యంతరం లేకపోతేనే...''

“ఉంటే?''

"ఆలోచిస్తా."

"నువ్వే ఆలోచిస్తావా? అతనితో కలసి ఆలోచించుకుంటారా?"

"కలిసే..."

"మీ ఇద్దరిదీ ఎన్నాళ్ల పరిచయం?"

"ఇటీవలే..."

"సరే మాకూ కాస్త ఆలోచించుకోవటానికి సమయం కావాలిగా..."

"రెండురోజుల్లో చెప్పండి" అంటూ తల్లి చేతిలోనుంచి తన సెల్‌ఫోన్ తీసుకుని తన గదిలోకి వెళ్లిపోయింది కల్పన.

మరో మూడు నాలుగు నిముషాలు మౌనంగా కూర్చున్న రామలక్ష్మి, నోటికి కొంగు అడ్డుపెట్టుకుని వడివడిగా గదిలోకి వెళ్లింది. వీధితలుపులకు తాళం వేసి, లైట్లు, ఫేన్లు ఆపేసి తానూ గదిలోకి నడిచాడు నారాయణమూర్తి.

"ఈ పిల్ల ఇలా చేస్తుందని కలలో కూడా ఊహించలేదు" దిగులుగా అన్నాడు మూర్తి.

"అదలా చెబుతుంటే నాలుగు పెట్టి నోరు మూయించకుండా ఇప్పుడిలా బేలగా మాట్లాడతారేంటండీ?" అసహనం ధ్వనించింది రామలక్ష్మి మాటల్లో.

"నాలుగో అయిదో పెట్టటానికి అదేం చిన్న పిల్లా! పెళ్లీడు దాటిన పిల్ల. సంవత్సరానికి పదిహేను లక్షలు సంపాదిస్తున్న ఉద్యోగస్థురాలు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యాధికురాలు."

"వాటన్నిటికీ మించి మన కూతురండీ."

"ఈ విషయం నీకు ఇప్పుడు తెలిసిందా?"

"అదేంటి మీరు కూడా అలా మాట్లాడతారు?"

"మనం తప్పు చేశాం. అది ఒప్పుకోవాలి ముందు."

"ఎవరి ముందు?"

"మనిద్దరం... ఎవరి అంతరాత్మల ముందు వాళ్ళం."

"మనం చేసింది తప్పు కాదు. కాస్తంత తాత్సారం... అంతే."

"ఆత్మవంచన చేసుకోవద్దు లక్ష్మీ"

"ఏం లేదు. మనం కాస్త ఆగాము కాబట్టే ఇప్పుడీ జీవితం ఇలా గడపగలుగుతున్నాం."

"అందుకోసం దానికి అన్యాయం చేయడం తప్పు కదూ?"

“దానికి జరిగిన అన్యాయం ఏముంది? ఇవ్వాళ కాకపోతే రేపు తగిన సంబంధం తటస్థపడగానే చేయాలనే అనుకుంటున్నాం కదా మనం కూడా.’’

“అనుకుంటూనే ఆరున్నర సంవత్సరాలు గడిపేసాం కదా.’’

“కాబట్టే కార్లు, ఇల్లు, బంగారం, వెండి, స్థలాలు వగైరాలు స్వంతం చేసుకోగలిగాం.’’

“అందుకే అది తన దారి తాను వెతుక్కుంది. తప్పేముంది?’’

“సరే కాసేపు నన్ను మాట్లాడించకండి. రేపు ఉదయం మాట్లాడుకుందాం’’ అంటూ అటు తిరిగి పడుకుంది రామలక్ష్మి. ఎటుతిరిగినా నిద్ర రాకపోంగా మనసంతా ఆలోచనలు, ఆదుర్దా. నారాయణ మూర్తి పరిస్తితి అందుకు భిన్నంగా ఏం లేదు.

‘కూతురు ఎందుకిలా చేసింది?’ అనే ప్రశ్నకు సమాధానం తేలిగ్గానే దొరుకుతున్నది కానీ, ఊహించని పరిణామం వల్ల ఇద్దరూ షాక్‌కి గురయ్యారు. తేరుకోవటం కష్టంగా ఉంది. మనసుల్ని సమాధాన పరుచుకోవటం అంత సులభంగా జరుగుతుందని అనిపించటం లేదు.

నారాయణమూర్తికి కూతురు తప్పు చేసిందని అనిపించటం లేదు. ఆమెకు సహనం నశించి తగిన నిర్ణయం తీసుకున్నదనిపించింది. అయితే ఉద్యోగం లేని వాడిని ఎందుకు ఇష్టపడిందో అర్థం కావటం లేదు ఆయనకి. తనతోపాటు ఉద్యోగం చేసే వాడిని ఎన్నుకుని ఉంటే ఇద్దరి సంపాదనతో ఇంకా మంచి జీవితం గడిపే అవకాశం ఎందుకు వద్దనుకుందో అంతుపట్టలేదు ఆ తండ్రి మనసుకి.

ఎంతగా ఆలోచించినా రామలక్ష్మికి కూతురు చేసిన పని ఏమాత్రం నచ్చలేదు. అన్నీ నిర్ణయించుకుని ఆ తర్వాత అమ్మా నాన్నలకి పెళ్ళి విషయం చెప్పటం మింగుడుపడటం లేదు ఆమెకు. కూతుర్ని ఏ రకంగానూ సమర్థించుకోలేకపోతోంది ఆ తల్లి మనసు. అందుకు తోడు తన అహం తనని మరింతగా రెచ్చగొడుతోంది. కూతురు తమని అవమానపరిచిందనే భావన ఆమె తట్టుకోలేకపోతోంది.

తాము ఆర్థికంగా బలపడేదాకా కూతురు పెళ్ళి వాయిదా వేయడంలో ఏ మాత్రం తప్పు కనిపించటం లేదు రామలక్ష్మికి. ఏ వయసుకు ఆ ముచ్చట అనేది నిజమే అయినా, ఈ కాలంలో పూర్వం రోజుల్లో లాగా ఇరవై ఏళ్లకే ఎవరూ పెళ్ళిళ్లు చేసుకోవటం లేదు. చదువులు అయ్యేసరికే దగ్గర దగ్గర పాతిక ఏళ్ళు వచ్చేస్తున్నై. చదువుకునేటప్పుడే ప్రేమించుకున్నవాళ్లు తప్ప మిగిలిన అందరూ కాస్త వయసు ఎక్కువ అయ్యాకనే చేసుకుంటున్నారు. ఈలోగా అందరూ ఆర్థికంగా పుంజుకోవటానికే మొగ్గు చూపుతున్నారు. తామూ అదే చేసారనేది ఆమె వాదన.

ఆహారవ్యవహారాలే కాదు, ఆహార్యం కూడా ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకున్నది. బ్రాండెడ్ డ్రెస్సులే కావాలి అందరికీ. కూడు, గూడు, గుడ్డ అనేది ‘గరీబీ హటావో’ నినాదానికి ముందురోజుల మాట. ఇప్పుడలా కాదే! ఏం తిన్నా, ఎంత తిన్నా, ఎలా తిన్నా, కట్టుకునే బట్టలు మాత్రం ఖరీదైనవిగా ఉండాలనేది నేటితరం మాట. ఆరోగ్యం అంటారా చిటికెనవేలు గోరు తీసుకుంటుంటే కాస్త ఎక్కువ తెగి, రక్తం వస్తే హాస్పిటల్‌కి వెళ్ళే పిల్లలున్న రోజులు. అలా వెళ్ళిన పిల్లల్ని భయపెట్టి వేలకు వేలు ఫీజులు, అనేకానేక పరీక్షలు చేయించి వైద్యం చేసే డాక్టర్లు ఉన్న ఈ రోజుల్లో ఎన్ని లక్షలు సంపాదించినా హాస్పిటల్ బిల్లులకే సరిపోవటంలేదని వాపోతున్నారు. అందుకోసం బీమా కంపెనీలు పుట్టుకొచ్చినై. అవి పొట్టపోసుకుంటున్నై.

ఇన్ని ఖర్చులు తట్టుకోవాలంటే డబ్బులు కావాలి. ప్రయాణాలంటే చాలు ఏ.సీ కార్లు కావాలి, లేదా విమానాలు. వేడుకలకీ వెళ్లాలన్నా, ఇంట్లో జరుపుకోవాలన్నా వేలకి వేలు అనే రోజులు పోయి లక్షలకి లక్షలు లక్షణంగా హారతి కర్పూరంలా ఖర్చుపెట్టే రోజుల్లో సంపాదించుకోకపోతే ఎలా? అందుకే కూతురి సంపాదన పెరిగి నాలుగు రాళ్ళు కాదు కాదు... నలభై రాళ్లయినా వెనకేసుకోకుండా పెళ్ళి ప్రయత్నాలు ఎలా మొదలు పెట్టటం అనేది రామలక్ష్మి అభిప్రాయం. అందుచేత తమ నిర్ణయం సముచితమేనన్నది ఆమె బలమైన అభిప్రాయం.

ఆమె అభిప్రాయంతో కొంతవరకు ఏకీభవించినా, ఎక్కడో మనసు మారుమూల పొరల్లో తాము చేస్తున్నది సక్రమంగా లేదు అనిపిస్తున్నది నారాయణమూర్తికి, డబ్బు, డాబు ఎంత అవసరం అయినా సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవటం సముచితం అనేది మూర్తి ఆలోచన. ఆడపిల్లలకు సంతానం కలగాలన్నా ఓ వయసు దాటాక అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని కూడా పుస్తకాల్లో చదివిన వాడు కావటంతో తన ఆలోచనలు భిన్నంగా ఉన్నాయి. ఆడ కానీ, మగ కానీ వయసు దాటాక కొంత వెలితి గానే సంసారజీవితం కొనసాగించవలసి ఉంటుంది అనే తన ఆలోచన నూటికి నూరుపాళ్ళు సమంజసమనేది ఆయనగారి నమ్మకం. అందుకే భార్యతో పూర్తిగా ఏకీభవించలేకపోతున్నాడు నారాయణమూర్తి. అలాగని ధైర్యం చేసి, కూతురి పెళ్ళి విషయంలో తొందరపడలేకపోయాడు.

ఈ తర్జనభర్జనల మధ్య కల్పన ఉన్నట్టుండి చెప్పిన తన నిర్ణయం అశనిపాతంలా ఆ దంపతుల్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. ఇంటి వాతావరణం అంతా ఒక్కసారిగా అల్లకల్లోలం అయిపోయింది. ఎవరిది సరైన నిర్ణయం, ఎవరిది కాదు అని ఎవరికి వారే అంతర్మథన పడుతూ, ఎవరికి వారే తమ నిర్ణయమే సమంజసం అని భావిస్తూ, వాదిస్తూ ఇంట్లో ప్రశాంతత లేకుండా చేసుకుంటున్నారు.

ఎవరి ఆలోచనల్లో వాళ్ళు రాత్రంతా జాగారమే చేశారని చెప్పుకోవాలి. కాలం మనకోసం ఆగదు కదా. కోడి కూసిందో లేదో కానీ, అలారం మోగింది, తెల్లవారింది. నిద్రపోతే కదా లేచారని చెప్పటానికి! ఎవరికి వారే మంచాలమీదినుంచి లేచారు. కాలకృత్యాలు కానిచ్చారు.

మాటలు కూడదీసుకున్నట్లు, భయంగా, బిడియంగా, జంకుగా మాట్లాడుకోవటం, ముగ్గురికీ కొత్తగానూ, వింతగాను మాత్రమే కాకుండా అసౌకర్యంగా కూడా అనిపించింది. అయినా తప్పదు. మాట్లాడుకోవాలి. మనసు విప్పి, మాట్లాడుకోవాలి. లేదంటే బంధువర్గంలో కానీ, స్నేహితులలో కానీ చులకన అయ్యే అవకాశం ఉందని ముగ్గురికీ తెలుసు. ఆ విషయంలోనే తగిన జాగ్రత్త పడాలని ముగ్గురి ప్రయత్నం.

“ఈ విషయాన్ని మన ముగ్గురమే చర్చించుకునే కన్నా తాతయ్యని, బామ్మని కూడా రమ్మని వాళ్ళతో కూడా ప్రస్తావిస్తే బాగుంటుందనిపిస్తున్నదమ్మా!” కూతురితో అన్నాడు మూర్తి

“మీరు ఎవరెవరికి చెప్పుకుంటారో, ఏం చెప్పుకుంటారో మీ ఇష్టం. ఎవరికి చెప్పుకోవాలన్నా ముందుగా మీరు దీంట్లో ఉన్న విషయాలన్నింటినీ వివరంగా చదువుకోండి. ఆనక ఆలోచించుకుని ఎవరికి చెప్పుకుంటారో, ఏమని చెప్పుకుంటారో చెప్పుకోండి. నాకు ఆఫీసు టైమవుతున్నది. వెళుతున్నాను” అంటూ చేతిలో ఓ కాగితం పెట్టి వెళ్లిపోయింది కల్పన.

నిన్నటి పరిణామాన్నించి కోలుకోకముందే మరో ఊహించని సంఘటనకు కలవరపడ్డారు ఆలుమగలు. లేని ధైర్యాన్ని కూడగట్టుకుని కాగితం మడతలు విప్పింది రామలక్ష్మి. పక్కనే ఉన్న భర్త చేతికి ఇచ్చింది.

కళ్ళజోడు సవరించుకున్న మూర్తి ఓసారి గొంతు కూడా సవరించుకోవాల్సివచ్చింది.

“అమ్మానాన్నలకు, ఈ విషయంగా ఇలా మీకు చెప్పాల్సివస్తుందని నేను ఊహించలేదు. నేనే కాదు ఏ కూతురు ఊహించలేదు. ఎందుకంటే ఇది ఊహాతీతం. కన్నతల్లితండ్రులే కూతురి పెళ్ళి విషయంలో స్వార్థంగా ఆలోచిస్తారని ఏ కూతురు అనుకుంటుంది? ఎలా ఊహిస్తుంది? నాకు ఉద్యోగం వచ్చేవరకు మనం చాలీచాలని ఆదాయంతో గడిపినమాట నిజం. నా చదువు పూర్తయ్యాక నాకు వచ్చిన ఉద్యోగం వలన మన ఆదాయం, ఆనందం పెరిగిన మాట కూడా నిజమే. ఇప్పుడు నా జీతం లక్ష పైగానే ఉన్నది. ఆదాయం పెరగటంతో పాటు నా వయసు కూడా పెరిగి ప్రస్తుతం ముప్పై దాటింది. నాకు పెళ్ళిచేసి పంపేస్తే మీ జీవనశైలి మళ్ళీ మొదటికి వస్తుందనే భయంతో, ఇప్పటి సుఖవంతమైన జీవితం దూరం అవుతుందని, నాకు పెళ్ళిచేయటం దాదాపు మర్చిపోయారు.

మొదట్లో మీరు చెప్పిన కారణాలు, వచ్చిన సంబంధాలలో మీరు చెప్పిన సాకులు సబబుగానే తోచినై. అందుకే నిర్ణయం మీకే వదిలేసి నేను మౌనం వహించాను. నా మేలు కోరేవాళ్ళు మీకన్నా ఎవరుంటారనే నమ్మకం నన్నలా ఆలోచింపచేసింది. ఇటీవలే మీ మాటల్ని యాదృచ్ఛికంగా విన్న నేను నిజంగా హతాశురాలినయ్యాను. అమ్మానాన్నలు కూడా ఇంత స్వార్థంగా ఆలోచిస్తారా అని విస్మయం చెందాను ఆ తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఇది నేను ఎవ్వరితోనూ పంచుకోలేను. మిమ్మల్ని ఎవరిముందూ పలుచన చేయలేను, కించపరచలేను. అందుకే ఈ నా నిర్ణయాన్ని అంగీకరించి మా పెళ్ళి జరిపిస్తే ఇకనైనా నాకంటూ ఓ సంసారం ఏర్పడుతుంది.

మీ సుఖానికి, తిండికి ఏ లోటూ రానివ్వను. ఇప్పటివరకూ నేను సంపాదించి దాచినదంతా నా పెళ్ళిఖర్చులు పోనూ మిగిలిన డబ్బు మీకే ఇస్తాను. దయచేసి వంకలు చెప్పి ఈ సంబంధం కాకుండా చేయవద్దు. మీకు చేతులెత్తి నమస్కారం చేస్తున్నాను. నన్ను నమ్మండి.

నామీద నేనే జాలి పడాలో, మీలా ఆలోచిస్తున్న తల్లితండ్రుల మీద జాలిపడాలో, మీలాంటి వాళ్ళ వల్ల పెళ్ళికాకుండా బ్రహ్మచారుల్లా మిగిలిపోతున్న మగపిల్లల మీద జాలిపడాలో, కొడుకులకు పెళ్ళి కావటంలేదని దిగులుపడుతున్న వారి తల్లితండ్రుల మీద జాలిపడాలో అర్థంకాని అయోమయ ప్రపంచంలో, వృద్ధకన్యగా మిగిలిపోయి అందరి జాలిపొందే అవసరం లేకుండా ముందే మేలుకుంటున్నాను. నా మేలుకోరే వాళ్ళే అయితే మా నెత్తిన నాలుగు అక్షింతలు వేసి ఆశీర్వదించండి చాలు. మాది ప్రేమ పెళ్ళి అని చెప్పుకుని మీ పరువు మీరే కాపాడుకోండి.”

మూర్తి, రామలక్ష్మి దంపతులు ఒకర్నొకరు ఓదార్చుకున్నారు. ఒకరిపై ఒకరు జాలి చూపుకున్నారు. కళ్ళు తెరిచారు.

# సుదూరమౌతున్న స్వప్నం

భమిడిపాటి గౌరీశంకర్
✆ 9492858395

**జన్మదిన సంచిక 'నేటి యువత' కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

> ***"మీవాడి సమస్య ఏమిటో మీకు అర్థమైందనుకుంటాను. ఆటలు, పెద్దవారితో సంబంధాలు, ముద్దులు, మురిపాలు, స్వేచ్ఛ... ఇవి ఏ స్థాయిలో వారికి అవసరమో వారికి తెలుసు. వారిని మనమే కారాగారాల్లో బంధిస్తున్నాం. కార్పొరేట్ కళాశాల్లో విద్య పేరుతో, చదువు జ్ఞానం కోసం... చావుకోసం కాదు... ఇవన్ని మీకు తెలియవని కాదు, కాకపోతే బాధ్యత పేరుతో ఎక్కువగా స్పందిస్తుంటాం... అంతే!***

"నా కలలన్నీ వీడు నాశనం చేస్తున్నాడు. లక్షలుపోసి హాస్టల్లో ఉంచి కార్పొరేట్ పాఠశాలలో చదివిస్తుంటే, వీడేమో, ఇదిగో ఇలా... పిచ్చివాడిలా తయారువుతున్నాడు" అన్నాను ఆవేదనతో, నా కొడుకును డా. రమేష్‌కి చూపిస్తూ.

రూమ్ చల్లగా ఉంది. డా. రమేష్ మొహంలో నవ్వు. డా. రమేష్ మా పెద్దనాన్నగారి అబ్బాయి. నాకు అన్నయ్య అవుతాడు. నేను, వాడు ఇంటర్ వరకూ కలిసే చదువుకున్నాం. తరువాత నేను సి.ఏ. చేయటానికి వెళ్ళిపోయాను. వాడు ఎం.సెట్ రాసి, మంచిర్యాంక్‌తో కాకినాడ రంగరాయలో డాక్టర్ కోర్సుకు వెళ్ళిపోయాడు. తరువాత విశాఖపట్నంలో కలిసే ఉంటున్నాం. నేను, వాడు ప్రయివేట్ ప్రాక్టీస్లు పెట్టుకొన్నాం. 'సైకాలజీ'లో ఎం.డి చేసాడు. కొన్నాళ్ళు అమెరికాలో చేసాడు. గ్రీన్‌కార్డు హోల్డర్ కూడా... అయినా, ఎందుకో ఇండియా వచ్చేసి, ఇక్కడ మా మేనకోడలినే వివాహం చేసుకొని సెటిల్ అయిపోయాడు. తను కూడా డాక్టరే. పీడియాట్రీ చేసింది. చిన్నపిల్లల మనస్తత్వంపై ప్రయోగాలు చేస్తున్నారు. మెడికల్ కాలేజీలో పాఠాలు చెబుతాడు.

'ఏం జరిగింది, అంతగా బాధపడుతున్నావు?" అన్నాడు డా. రమేష్, నా ఆలోచనలను త్రుంచేస్తూ. నేను చెప్పటం ప్రారంభించేను. నేను డా. రమేష్‌ను కలిసింది అతని క్లినిక్‌లో కాదు, ఇంటి దగ్గర. ఫ్రీగా ఉండే సమయంలో.

"నీకు తెలుసుగా, నాకు ఒక కొడుకు, కూతురు. ఇద్దరినీ కార్పొరేట్ స్కూల్లోనే చదివిస్తున్నాను. నా భార్య బ్యాంక్ ఆఫీసర్. ఇద్దరం ఉదయం వెళ్ళి సాయంత్రం వస్తాం. ఒక్కొక్కసారి రాత్రవుతుంది. మా ఇద్దరి తల్లిదండ్రులు వేరు వేరుగా అపార్ట్మెంట్స్‌లో ఉంటున్నారు. పాప విషయంలో ఫర్వాలేదు, ఇదిగో వీడే... పెద్ద మళ్ళీ... రెండురోజుల క్రితం ప్రిన్సిపాల్

నన్ను కాలేజీకి పిలిచి, 'మీ వాడిలో ఏదో తేడా కనిపిస్తున్నాది. చదువు పైన శ్రద్ధ కనపర్చలేకపోతున్నాడు. కాస్త శ్రద్ధ పెట్టండి. ఎవరైనా మంచి డాక్టర్‌కి చూపించండి' అన్నాడు. నేను వెళ్ళి వీడిని తెచ్చి, డాక్టర్‌కి చూపించాను, కాని... కంప్లైంట్ ఏమీ లేదంటున్నారు. నీవు కొంచెం తెలుసుకో, వాడి ఇబ్బంది ఏమిటో..." అని ఆగాను.

"ఏరా? ఏంటి నీ సమస్య? నాలా డాక్టర్‌వి కావా?" అని రమేష్ మా అబ్బాయిని దగ్గరకు తీసుకున్నాడు.

"అవుతాను అంకుల్! మీరే నా రోల్ మోడల్" అని మా బాబు సమాధానం.



"మరి మీ నాన్నేంటి ఇలా అంటున్నాడు?" అని డెస్క్‌నుండి ఓ ఫైవ్‌స్టార్ చాక్లెట్ తీసి ఇచ్చాడు. వాడి కళ్ళలో భయం. నేను, రమేష్ మొహాలు చూసుకున్నాం. నేను వాడికి అటువంటివి ఇవ్వను, ఏదైనా అనారోగ్యం చేస్తే చదువు పాడవుతుందని.

"ఫర్వాలేదు, నేను డాక్టర్‌ని. ఏమీకాదు, తీసుకో. నేను మీనాన్నకు చెబుతాలే. మీ నాన్న నా కన్నా చిన్నవాడే. నీకు తెలుసుగా!" తప్పేది లేక నేను సైగ చేసాను తీసుకోమన్నట్టుగా.

"సరే, రేపు మనమంతా కలసి ఓ చోటుకి వెళదాం నా మిత్రుడి దగ్గరకు. అతనికి అనంతగిరి వెళుతున్న దారిలో ఓ వృద్ధాశ్రమం ఉంది. అక్కడకు వెళదాం. సరేనా? అతని పేరు డా. రంజిత్ కుమార్."

"డాక్టరయి ఉండి... వృద్ధాశ్రమం నిర్వహిస్తున్నాడా?"

"రేపు వెళతాం కదా, ఈ రాత్రికి వీడిని ఇక్కడే ఉండనీ. నేను స్టడీ చేస్తాను. రేపు ఆ డాక్టర్‌కి చెప్పాలి కదా... ఏరా, ఉంటావా?" అన్నాడు మా బాబుతో.

"ఓఁ" అన్నాడు వాడు ఆనందంగా.

★★★

నేను, వాడిచ్చిన టిఫిన్ తిని బయలుదేరాను.

కారులో ఉదయం ఎనిమిదింటికి బయలుదేరాం. విశాఖపట్నం పొలిమేరలు దాటి, ఎస్ కోట వైపు కారు వెళుతున్నది. కారులో ఏ.సి. చల్లగా ఉంది. పాతపాటలు... ఘంటసాలవారి గానం మంద్రంగా వినిపిస్తున్నది. నేను, రమేష్ వెనుక సీట్లో కూర్చున్నాం. మావాడు ముందు సీట్లో కూర్చుని, ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. వాడికి ఏదో తెలియని సంతోషం క్రమ్మేసిందన్నట్లుగా ఉంది ముఖం.

నేను, డా.రమేష్ ఇంగ్లీష్‌లోనే మాట్లాడుకున్నాం, వాడికి అర్థం కాకూడదని. తరిగిపోతున్న రోడ్డు... తొలిగిపోతున్న చెట్లు... ఆకాశంలో వచ్చే మబ్బులు... ఆవులు... గేదెలు... పక్షులను ఎప్పుడూ చూడన్నట్టుగా చూస్తూ వాడు, మమ్మల్ని గమనించడం లేదు.

"మీ వాడిలో ఓ మానసిక అశాంతి ఉంది. దేనినో కోల్పోతున్నాననే భావన అతడిది. ఏసీ తరగతి గదులు అతనిలో ఈ అశాంతిని మరింతగా పెంచేస్తున్నాయి."

"ఈ వయసులో మానసిక అశాంతి... చిత్రంగా ఉంది, వినటానికే..." అన్నాను.

"మనసు ఓ విచిత్రమైన వ్యవస్థ. నీవు ఎందుకు నాలా డాక్టర్‌వి కాలేదు, నేనెందుకు నీలా సి.ఏ. చేయలేదు అని ప్రశ్నించుకుంటే మన దగ్గర సమాధానాలు ఏమని వస్తాయి?"

"మనదారులు వేరు.. నాకు డాక్టర్ కోర్సు నచ్చలేదు" అన్నాను.

"ఈ నచ్చడం... నచ్చకపోవడం... మనం ఇంటర్ దగ్గరనే ప్రారంభించుకున్నాం అవునా, కాదా?"

మౌనంగా ఉండిపోయాను.

"మరి మీ వాడికి మనసులో నచ్చకపోవడం అనేది ఎందుకు లేదనుకోవాలి?" రమేష్ వ్యాఖ్యానం.

"ఏంటా నచ్చకపోవడం?" అన్నాను నేను చికాకుగా.

"చికాకెందుకు? అది తెలుసుకొన్నాను. రాత్రి వాడిని నా ప్రక్కన పడుకో పెట్టుకొని... మీ వదిన కూడా కౌన్సిలింగ్ చేసింది. వాడి అశాంతికి కౌన్సిలింగ్ మెడిసిన్ కాదు... ఇంకేదో కావాలి. దానిని నేను ఊహించాను. అందుకే ఈ ప్రయాణం. డా.రంజిత్‌తో మాట్లాడాను. అతడు పదకొండింటికి రమ్మన్నాడు. ఆసరికి మనమక్కడ ఉంటాం..."

మా మధ్య మౌనం.

కారు మెత్తగా, మెల్లగా వెళుతున్నాది. కార్తీకమాసపు గాలి చల్లగా ఉంది. ఎస్.కోట దాటిన తరువాత వాన చినుకులు పడ్డాయి. కమ్మని మట్టివాసన... అద్దాలు వేసి ఉన్నా, కారులోనికి చొచ్చుకు వస్తున్నాది.

“అంకుల్ అద్దాలు దించేయనా?” నా కొడుకు రిక్వెస్ట్.

“నీ అద్దం దించుకో” అన్నాడు రమేష్. వాడలాగే చేసాడు. సన్నని వానజల్లు అతని ముఖాన్ని తాకింది. వాడి ముఖంలో కోటి రూపాయలు సంపాదించుకొన్న ఆనందం. నాలో అసహనం కనిపెట్టిన రమేష్, నా భుజంమీద చేయి వేసి అనునయించాడు, ‘నేనున్నానుగా...’ అన్నట్టు. నిజమేననిపించింది.

“దాదాపు పదిగంటలు సమయానికి అనంతగిరి చేరుకున్నాం. అరకు వెళ్ళే రోడ్డునుంచి కొంచెం కుడి ప్రక్కకున్న మట్టిరోడ్డులో ఉన్న తారురోడ్డు మీదకు కారు తిరిగింది. అంతటా ఆకుపచ్చ వర్ణశోభితం. సన్నని వర్షం... చల్లనిగాలి... దారికి అటు ఇటు పచ్చనిచెట్లు. రకరకాల పూలు... పక్షుల కిలకిలరావాలు... మంచుతో కూడిన చల్లదనం... మంచుపొగ... వాన... ఇప్పపూల వాసన... కాఫీతోటలనుంచి వచ్చే సువాసన... ఓహో... మనసులో తెలియని ఆనంద పరవశం... కారు కొంచెం దూరం ప్రయాణించాక, ‘ప్రకృతి వృద్ధాశ్రమం’ అనే బోర్డు కనిపించింది. వచ్చేసాం...” అన్నాడు డా.రమేష్.

అరగంట ప్రయాణం అనంతరం చేరుకొన్నాం. నిజంగానే ప్రకృతి రమణీయతకు చిరునామాలా ఉంది, ఆ ప్రాంతం. పేర్లు తెలియని పిట్టలు చేసే శబ్దాలు... గాలి తెచ్చే రకరకాల వాసనలు... ‘ఇదంతా మన చుట్టూ ఉందా?’ అని ఆశ్చర్యం కలిగింది.

కారు శబ్దం విని, ఓ నలభై, నలభై అయిదు సంవత్సరాల వ్యక్తి... మా వయసువాడే. ఎంతో హుందాగా, ఆరోగ్యంగా, చెరగని చిరునవ్వుతో మమ్మల్ని రిసీవ్ చేసుకొనేందుకు వచ్చాడు.

“హాయ్ రమేష్! ఎలా ఉన్నావు? ఎలా సాగుతోంది ప్రాక్టీస్? నీకేమి కింగ్‌లా ఉన్నావు, ఉంటావు. ఇతనేనా, మీ బ్రదర్?” అని నా వైపు తిరిగి, “నా పేరు రంజిత్ కుమార్” అన్నాడు, నాకు నమస్కారం పెడుతూ.

మా బాబు చేయి పట్టుకొని, “హాయ్ ఫ్రెండ్! ఎలా ఉన్నావు? నచ్చిందా, మా ఊరు? ఓ నాలుగు రోజులుంటావా?” అని అడిగాడు, వాడి బుగ్గలు గిల్లి మరీ.

వాడు కూడా, “ఓ తప్పకుండా అంకుల్! ఇటువంటి ప్రదేశాలు మన దగ్గర ఉన్నాయా?” అని కూడా అడిగాడు.

“ఎందుకు లేవు? బోలెడున్నాయ్... పదపద!” అని అందరినీ తన ఆఫీసులోనికి తీసుకువెళ్ళాడు. అక్కడ అందరికీ చల్లని మంచినీళ్ళు సర్వ్ చేశాడు బాయ్.

నేను చుట్టూ చూస్తున్నా. అది గమనించిన రంజిత్, “ఇది ఏభై ఎకరాల విస్తీర్ణంలో నిర్మించినది. ఆఫీస్, ఆసుపత్రి, చిన్ని పక్షుల ప్రదర్శనశాల, వృద్ధుల కోసం డార్మీటరీలు, సిబ్బంది కోసం కట్టిన గృహాలు, దేవాలయం, గ్రంథాలయం, ఓ మినీ థియేటర్, స్విమ్మింగ్ పూల్... అన్నీ ఉన్నాయి. కిచెన్, గోశాల... దాదాపుగా వందరకాల పండ్లరకాలు... మరో వందరకాల పూలమొక్కల తోటలు... అన్నీ ఉన్నాయి. ఓ చిన్న ప్రకృతి ప్రపంచం నిర్మించాను. రండి, సమయం అయింది. భోజనాలు చేద్దాం...” అన్నాడు.

అందరం డైనింగ్ హాలు చేరుకున్నాం. అన్నీ ఆర్గానిక్ ఫుడ్ అయిటమ్స్, పళ్ళు ఉన్నాయి. జంక్‌ఫుడ్ జాడలేదు. డెబ్బై ఎనభై ఏళ్ళ వయసున్నవారు కూడా యువకుల్లా ఉన్నారు. ఆ దృశ్యం నన్ను ఆశ్చర్యచకితుడ్ని చేసింది. అందరి ముఖాలలో

చిరునవ్వు... అది కూడా సహజమైనది. ఎలా సాధ్యం ఇది? నాలో ఎన్నో ప్రశ్నలు... అందరూ వృద్ధులే... సుమారు డెబ్బై దాటే ఉంటుంది వీరి వయస్సు. కాని, ఎవరూ అలా లేరు. ఎంతో ఉత్సాహంగా డైనింగ్ హాల్ దగ్గరికి వచ్చి 'క్యూ'లో నిలబడి ఎవరికివారు వడ్డించుకొని తింటున్నారు. ఎవరూ మమ్మల్ని గురించి తెలుసుకోవాలనుకోలేదు. డా.రంజిత్ కుమార్‌ను సహితం వారు పట్టించుకోలేదు. కాని ఆయన పట్ల ఆత్మీయాభిమానాలు మాత్రం వారి కళ్ళలో ఉన్నాయని నాకనిపించింది.

మేం నలుగురం తినటం ప్రారంభించే ముందు 'శాంతి మంత్రం' వినిపించింది. అందరూ ఆగి, మంత్రం అయిపోయిన తరువాత భోజనాలు చేస్తున్నారు. ఎక్కడ వృధాలేదు. ఎవరికి వారుగా కాకుండా ఒకరికొకరుగా కలిసి తినటం నాకశ్చర్యమనిపించింది.

"అంకుల్! నేను ఆ తాతగారి దగ్గరకు వెళ్ళి తిననా, ఫర్వాలేదా?" అని అడిగాడు, మావాడు. వాడా ప్రశ్న అడుగుతాడని నేనూహించలేదు.

రంజిత్ నవ్వి, "ఓ తప్పకుండా... మేము తినేసి ఆఫీసులో ఉంటాం. నీకెంతసేపు కావాలంటే అంతసేపు వారితో గడిపి, వచ్చేయ్. సరేనా. గుడ్‌బాయ్!" అని అనుమతి ఇచ్చాడు.

వాడు నా వైపు చూడకుండా వెళ్ళిపోయాడు.

నన్ను వారిద్దరూ గమనిస్తున్నారనే స్పృహ నాకు లేదు. నా ముఖంలో రంగులు మారుతున్నాయని నాకు తెలుస్తున్నాది.

కాని అక్కడ ముసలివారంతా తినేసి, ఎవరి కంచాలు వారే కడుక్కొని చక్కగా వెళ్ళిపోయారు. వారితో పాటుగా మావాడు కూడా.

ముగ్గురం ఆఫీసుకు చేరుకున్నాం. ఏజన్సీ ప్రాంతం... కార్తీక మాసం... ఆకాశంలో మబ్బులు దట్టంగా కమ్మసాగాయి.

"వాన వచ్చేటట్లు ఉంది. లోపలకు వెళదామా?" అన్నాను.

'వర్షం వచ్చేక' అని.. రంజిత్ కుమార్ మూడు కుర్చీలు తెప్పించారు. మధ్యలో ఓ టీపాయ్ మీద రకరకాల పండ్లముక్కలు ప్లేట్లో అమర్చి ఉంచాడు బోయ్. పళ్లు మంచి సువాసనగా ఉన్నాయి. సేంద్రియ ఎరువులతో పండించినవి. ఆ పెద్దవాళ్ళు శ్రమించారు. ఆ పళ్ళ వెనుక కష్టం వారిదే... అతని కళ్ళలో పెద్దవారి పట్ల గౌరవం.

మావాడి సంగతి నేను మరచిపోయాను. అసలు ఇక్కడ, ఇలా... ఎందుకు ఈ వృద్ధాశ్రమం? అదే అడిగాను.

"అమెరికాలో రెండు దశాబ్దాల పాటు డాలర్ల పంట పండించుకున్నాము. అయినా ఎక్కడో అసంతృప్తి. నాకు తెలిసిన. ఓ సైకాలజిస్టు దగ్గరికి వెళ్ళాను. అతను డీప్ స్లీప్‌లోకి తీసుకొని వెళ్లి, నా మనసులోని భావాలు చదివాడు. వాటిని డాక్టర్ భాషలోకి అనువదించకుండా, సింపుల్‌గా, 'నీపై బాల్యం విపరీతమైన ప్రభావం చూపుతున్నాది. నీవు మళ్ళీ అక్కడికే వెళ్ళిపో' అన్నాడు, నవ్వి. నేను కూడా నవ్వుకున్నాను."

రంజిత్ చెబుతూ ఉండగానే, ఓ ఆయమ్మ వచ్చి, "రంగనాథం గారికి ఆయాసంగా ఉందట. మిమ్మల్ని రమ్మన్నారు" అంది. అందరం డార్మిటరీకి చేరుకున్నాం. భోజనసమయంలో మావాడు వెళతానన్నది ఆయన దగ్గరకే. ఆయన ప్రక్కన మావాడు కూర్చున్నాడు. ఇద్దరూ నవ్వుకుంటున్నారు.

"ఏమయింది సర్?" అన్నాడు డా. రంజిత్ కుమార్.

అందుకు సమాధానంగా రంగనాథంగారు, "అబ్బే! గాబరాపడవలసినది ఏమీ లేదు. ఇదిగో ఈ మనవడు నాచేత గేమ్స్ ఆడించాడు. ఏదో చిన్న ఆయాసం. క్యూట్ బోయ్! నాకు బాగా నచ్చాడు. 'నా దగ్గరుండిపోతావా?' అని అడిగితే, ఉండిపోతానన్నాడు. గుడ్‌బోయ్!" అన్నారు. ఆయన కళ్ళల్లో బాల్యం నాకు కనిపించింది.

నాడి, గుండె, బి.పి చెక్ చేసి, "మీకేం సార్, రాయి! మరో వంద గ్యారంటీ..." అన్నాడు రంజిత్ నవ్వుతూ.

మా వైపు తిరిగి, "పదండి!" అన్నాడు. అందరం ఆఫీసుకు వచ్చేసాం.

"ఆఁ మధ్యలో ఆపేసారు కథ..." అన్నాను నేను.

"కథ కాదు సార్, నిజమే!" అన్నాడు నవ్వుతూ.

సమయం నాలుగు గంటలు కావస్తున్నాది. ఇంతలో మెయిన్‌గేటు తీసిన శబ్దం అయింది. ఓ కారు, వేగనార్... బ్లాక్ కలర్... బాగుంది. అందులోనుంచి ఓ నలభై సంవత్సరాల ఆవిడ దిగింది. ఎంతో హుందాగా ఉంది.

"ఏయ్ రమేష్! ఎలా ఉన్నావు? బాగుందా మా చెల్లెలు?" అని అడిగి, నా వైపు తిరిగి, "ఈయనెవరు? ఆఁ నిన్న ఫోన్ చేసావు, ఈయన గురించేనా? వీళ్ళ అబ్బాయి కూడా వచ్చాడా? ఉండు, వెళ్ళి చూస్తాను..." అని సుడిగాలిలా వెళ్ళిపోయిందామె.

"ఆమె పేరు స్వాతి. నా భార్య! బయోటెక్నాలజీలో రీసెర్చ్ చేసింది. చైల్డ్ సైకాలజీలో కూడా పి.జి. చేసింది. ఇక్కడే ఎస్ కోట డిగ్రీ కళాశాలలో పాఠాలు చెబుతుంది..." రంజిత్ ఆమెను పరిచయం చేసాడు.

"ఆమెను చూస్తే సుష్మాస్వరాజ్ గుర్తుకు వచ్చారు. ఎంతో హుందాగా... స్వంత సోదరిని చూస్తున్నట్టే అనిపించింది..." అన్నాను.

రమేష్, రంజిత్‌లు నవ్వుకున్నారు. ఇంతలో టీ, బిస్కెట్స్ వచ్చాయి.

"రాత్రికి ఇక్కడే ఉండిపొండి, బాగుంటుంది. రాత్రివేళ సన్నని వర్షం, పక్షుల కువకువలు, గాలి... అనుభవించండి. ఆనందం యొక్క సాంద్రత, ప్రకృతిలోని తాత్వికత అర్థమవుతాయి." అన్నాడు రంజిత్ కుమార్ ఆత్మీయంగా.

నేను ఇంటికి ఫోన్ చేసాను. రమేష్ ముందే చెప్పి వచ్చాడుట.

చీకటి పడుతున్నాది. నాలుగు గంటలకే, ఏడు గంటలులా ఉంది. శీతాకాలం... వర్షం... సన్నని చలి విద్యుత్ దీపాల వెలుగులో ఆశ్రమం దేవాలయంలా ఉంది. క్రమశిక్షణాయుతంగా... ఆనందంగా... స్వేచ్ఛగా ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు.

మావాడు ఏమైనా తిన్నాడో, లేదో... భోజనాల దగ్గరకు వెళ్ళినవాడు ఇంతవరకు నా దగ్గరకు రాలేదు.

"మీకాభయం అక్కర్లేదు. వాడికేం కావాలో వాడికి తెలుసు... రంగనాథంగారికి తెలుసు. ఆయనకిద్దరు మగపిల్లలు, ఇద్దరూ యు.కె.లో ఉన్నారు. సాఫ్ట్‌వేర్. భార్య ఈ మధ్యనే చనిపోయింది. ద్వారకానగర్లోని ఇంటిని అమ్మేసి, ఆ డబ్బును

డిపాజిట్ చేసారు. వడ్డీతో, పెన్షన్‌తో ఇక్కడ నాకు, నా స్వాతికి గార్డియన్‌గా ఉన్నారు. ఆయన షిప్‌యార్డ్‌లో సీనియర్ ఇంజనీర్‌గా రిటైరయినారు. నాకోబాబు. వాడు ప్రస్తుతం అమెరికాలో ఎం.ఎస్ చేస్తున్నాడు. ఓ పది సంవత్సరాలు ఉండి ఇక్కడకు వచ్చేస్తానన్నాడు.” రంజిత్ స్వగతంలా చెప్పాడు.

రాత్రి భోజనాలు కోసం వంటలు తయారు చేస్తున్నట్లున్నారు, స్వచ్ఛమైన వాసనలు వస్తున్నాయి.

వాతావరణం ప్రశాంతంగా ఉంది. నేను, రమేష్, రంజిత్ మాట్లాడుకుంటున్నాం. స్వాతి అప్పుడప్పుడు వచ్చి వెళ్ళిపోయారు.

“ఆమె అంతే! కాళ్ళకు చక్రాలుంటాయి. రాత్రి పదివరకూ ఇక్కడ ఆమెదే బాధ్యత. అయితే, ఇక్కడ ఎందుకు ఆశ్రమం అనేది కదా మీ ప్రశ్న?”

“నేను అడగలేదు...” అన్నాను నవ్వుతూ

“నేను చెప్పాలి కదా, నా గొప్పతనం గురించి?” అన్నాడు రంజిత్ నవ్వుతూ. “ఇందుకోసం నేను దశాబ్దం పాటు కల కన్నాను. దశాబ్దం పాటు కష్టపడ్డాను.”

“ఎందుకు నవ్వుకోసమా?” రమేష్ ప్రశ్న.

“కాదు. ఈ ఆశ్రమం కోసం. ప్రధానంగా నా ఉద్దేశ్యం సేవ... సంపాదన... పరిరక్షణ. నేను ఎన్నో వృద్ధాశ్రమాలు చూసాను. ప్రతీచోటా బాగానే ఉంది, కాని, ఏదో వెలితి... ఏమిటది? మనుషుల మధ్య మనుషులున్నా వారి మధ్య ఏదో మిస్ అవుతున్నాది. ప్రకృతిలో ఓ తాత్వికత ఉంది. గమనిస్తే అర్థమవుతుంది. అది తెలుసుకొనేందుకు నేను జగ్గీ వాసుదేవ బాబాగారి వేళంగిరి వెళ్ళాను. అక్కడ ఏదో మహత్తు ఉందనిపించింది. అది మనుషుల మధ్య కనిపించింది. తరువాత బెంగుళూరు రవిశంకర్‌గారి ఆశ్రమాన్ని చూసాను. కల్వకుర్తిలోని వందేమాతరం ఫౌండేషన్ వారు నిర్వహిస్తున్న స్కూల్‌ను గమనించాను. మదనపల్లిలో రిషివేలి, కలకత్తాలో శాంతినికేతన్, యలమంచిలిలోని బిటిసి నిర్వహిస్తున్న వాటిని పరిశీలించాను. ఇక కట్టడాల కోసం స్థలం కావాలి. నాకు అనంతగిరి నుంచి అరకు మధ్య ప్రాంతమంటే ఎంతో ఇష్టం... ఇక్కడ స్వచ్ఛత ఉంది. ప్రకృతి తెలియజెప్పే సందేశం బాగుంటుంది. మనసుతో చూడాలి, వినాలి... అంతే! ఇక్కడ స్థలం కోసం అన్వేషణ చేసాను. దాదాపు సంవత్సరంన్నర ప్రయత్నం చేసాను... గిరిజనుల సహకారం లేనిదే ఇది సాధ్యం కాదు. వారు మనిషిని నమ్మితే ప్రాణం ఇస్తారు. స్థలం కొన్నాను. స్వాతి నన్ను ఏనాడూ కాదనలేదు. ఎంతగానో సహకరించింది. కేవలం నేను డబ్బు మాత్రమే పెట్టాను. మిగిలినదంతా తనే చూసుకుంది... చెట్లు కొట్టకుండా భవనాల నిర్మాణం కోసం ఎన్విరాన్మెంటల్ మేనేజ్‌మెంట్ బిజినెస్ సైట్స్ చూసాను. వాటిలోని చూసిన నిర్మాణాల నమూనాల కోసం ఎన్నెన్నో విదేశీ, స్వదేశీ కనస్ట్రక్షన్ కంపెనీలతో మాట్లాడాను. చివరకు విశాఖలోని ఓ కంపెనీ... ఇదిగో ఇలా ప్రకృతిని పరిరక్షిస్తునే నిర్మాణాలు చేసారు. అంతా సోలార్ సిస్టమే...”

“ప్రకృతి అంటే మీకంత ఇష్టమా?” అన్నాను నేను ఆయన మాటలకడ్డువచ్చి.

“ప్రాణం! నేను ఇందాక చెప్పిన సేవ, సంపాదన, పరిరక్షణ ప్రకృతిసూత్రాలే... భారతదేశ సంస్కృతి యావత్తు ప్రకృతితో ముడిపడి ఉంది. ఆ మధ్య కరోనా భూతం మన జాతిని ఎంతగా గడగడలాడించిందో మీకు తెలుసు. ఎందుకో కూడా తెలుసు, మానవ శరీరం పంచభూతాత్మకం... గాలి, నీరు, నిప్పు, శూన్యం, మట్టి... మన శరీరంలో ఉన్నాయి. మరణం

తరువాత వాటి రూపాల్లో తిరిగి అవి చేరిపోతాయి. ఇది ప్రకృతి ధర్మం... గమనించండి. ఈ గాలి, చల్లదనం, వర్షం, మట్టివాసన, వివిధ పక్షుల శబ్దాలు... కొంత రాత్రి గడిచిన తరువాత నిశ్శబ్దం. అవి చేసే శబ్ద సందేశాలు... మనకర్థమౌతాయా? గిరిజనులు.. చెంచులు... కోయలు... ఈ జాతికి ప్రపంచం అడవి. 'అడవిలో ఎప్పుడూ వెన్నెలలే' అంటాడు కాళిదాసు, 'శృంగార శాకుంతలం'లో. ఎంతటి గాఢత అడవిలో... ఈ మధ్య 'కొండపొలం' అనే నవల చదివాను, అందులో గొల్లలు నీటికోసం గొర్రెలను అడివిలోకి తోలుకు వెళతారు. వారు చెప్పే అడవి రహస్యాలు, నిజంగా అద్భుతం, మనమెంత అల్పులమో వీటివలన మనకు తెలుస్తుంది..."

"రండి... రండి... ఆయనను కదిపితే తెల్లార్లూ ఈ అడవి గురించే చెబుతారు. మీ బాబు వెరీ స్మార్ట్... మంచి భవిష్యత్ ఉంది..." అని మా అబ్బాయి చేతిని పట్టుకొని స్వాతి వచ్చారు. భోజనాలకు అందరం లేచాం.

దూరంగా దేవాలయంలో గంటలు వినిపిస్తున్నాయి. పెద్దవారంతా భోజనాలు చేసి, చెట్ల క్రింద బల్లలు పైన కూర్చుని, నవ్వుతూ మాట్లాడుకుంటున్నారు.

జీవితమంటే ఆనందంగా జీవించటం. ఏదోలా బ్రతకటం కాదు. దీనికోసం సంపాదన అవసరమే. కాని, సంపద ఆనందం ఇవ్వదు. జీవితాన్ని రెండు చేతుల ఆస్వాదిస్తే మరణం భయపెట్టదు. భయపడుతుంది. వారిని చూస్తే అదే అనిపించింది.

"ఏమిటాలోచిస్తున్నారు?" రంజిత్ ప్రశ్న.

"ప్రకృతి గురించి, అదిచ్చే జీవితం గురించి." అన్నాను. తొలిసారిగా నేనేం కోల్పోయానో నాకు తెలిసింది.

"నాన్నా! ఆంటీ ఓ నాలుగు రోజులుండమంటున్నారు." అన్నాడు మా బాబు.

"ఉండు. కాని, నేను రేపు వెళ్ళాలి. నా పనులు నాకున్నాయి. రమేష్‌కు ధన్యవాదాలు చెప్పాలి. స్వాతిలాంటి సోదరినిచ్చినందుకు. డాక్టర్ గారూ! మా వాడికోసం నాకు మరి బెంగలేదు..." అన్నాను రంజిత్ దంపతులకేసి చూసి.

"మీవాడి సమస్య ఏమిటో మీకు అర్థమైందనుకుంటాను. ఆటలు, పెద్దవారితో సంబంధాలు, ముద్దులు, మురిపాలు, స్వేచ్ఛ... ఇవి ఏ స్థాయిలో వారికి అవసరమో వారికి తెలుసు. వారిని మనమే కారాగారాల్లో బంధిస్తున్నాం. కార్పొరేట్ కళాశాల్లో విద్య పేరుతో, చదువు జ్ఞానం కోసం... చావుకోసం కాదు... ఇవన్ని మీకు తెలియవని కాదు, కాకపోతే బాధ్యత పేరుతో ఎక్కువగా స్పందిస్తుంటాం... అంతే! మనమంతా ఒకటే. ఇదే ప్రకృతి సూత్రం. మనమంతా స్వార్థంతో మనమధ్య గోడలు కట్టుకుంటూ ఉంటాం. వాటిని చూస్తే మనకు గర్వం. వాటిని నిరంతరం పరిరక్షించుకుంటాం. కాని, ప్రకృతిలోని స్వేచ్ఛాసూత్రం... అనుభూతివాదం ఇందుకు అంగీకరించదు. స్వేచ్ఛ, అనుభవం, ఆనందం, ఆరోగ్యం... ఇవన్ని వీటిలో ఉన్నాయి. గీతాంజలిలో రవీంద్రుడు, 'నేనే నాకొక జైలు... విడుదలైతే నేను లేను' అంటారు. ప్రకృతి చెప్పేది ఇదే..."

రంజిత్‌తో పాటు అందరం నిద్రకు లేచాం.

నేనూ... పాఠం నేర్చుకొన్నాను, ఇది శాశ్వతం కావాలనేది నా కోరిక!

# అసలైన దేవుడు

విరించి
✆ 9848789094

***"కనపడని దేవుడికోసం మతం పేరుతో కొట్టుకుంటాం. మనం కష్టాల్లో ఉంటే ఆదుకొనే ప్రతివాడు దేవుడే. కులం, మతం పుట్టకముందు కూడా మనిషి ఉన్నాడు. అప్పుడు తనకు సహాయం చేసిన చెట్టును, పుట్టని కూడా దేవుడుగా కొలిచాడు. దేవుడు ఒక్కడే. ఎం డి గారి రూపంలో, డాక్టర్‌గారి రూపంలో, నీకు సహాయం చేసిన ప్రతీ ఒక్కడి రూపంలో ఉన్నట్టే ఈశ్వరుడు పేరుతో, ఏసు పేరుతో, అల్లా పేరుతో ఉన్నాడు. కనపడని దేవుడికంటే కనిపించే మనుష్యుల్లో దేవుళ్ళని గుర్తిద్దాం. దేవుడు ఒక్కడే అయినప్పుడు మతాలు దేవుడికి సమ్మతమేనా?" అన్నాను.***

సెల్ రింగౌతోంది. ఎవరా అని చూస్తే జయప్రకాష్. సెల్ ఆన్ చేసాను.

"గుడ్‌మార్నింగ్ సార్!" అన్నాడు జయప్రకాష్.

"గుడ్‌మార్నింగ్ జయప్రకాష్! ఏమిటి ఫోన్ చేసావ్? ఏమిటి విశేషం?" అన్నాను.

జయప్రకాష్ నా కోలిగ్. ఓ ఐదేళ్లు జూనియర్.

"ఏమీ లేదు సార్! మీరు అంగీకరిస్తే రేపు ఆదివారం నేను, నా మిసెస్ మీ ఇంటి వద్దామనుకుంటున్నాం సార్!" అన్నాడు.

"మోస్ట్ వెల్కమ్. దీంట్లో నేను అంగీకరించేదేముంది?" అన్నాను నవ్వుతూ.

"అంటే సార్! అంటే... మీ ఇంటికి వచ్చి ప్రార్థనలు చేద్దామనుకుంటున్నాం సార్! మీకు మ్యారేజ్ అయ్యి పదేళ్లు దాటిపోయింది కదా సార్! ప్రార్థన చేస్తే పిల్లలు పుడతారు సర్! అనారోగ్యంగా ఉన్నా, ఏదైనా కష్టాలు ఉన్నా మేం ప్రార్థన చేస్తాం సార్! తప్పక మా ప్రార్థన పని చేస్తుంది సార్! బంధువులు, స్నేహితులలో ఎవరికి ఆరోగ్యం బాగుండకపోయినా, ఎలాంటి రోగాలైనా ప్రార్థన చేస్తే తగ్గిపోతాయి సర్!" అన్నాడు.

అతను ఎందుకు నా అంగీకారం అడిగాడో ఇప్పుడు అర్థమయ్యింది. అతను నాకు ఏదో సహాయం చేద్దామనే మంచి ఉద్దేశ్యంతో నన్ను అడిగేడు. కాని, అమ్మ, రాధ ఒప్పుకోరు. వాళ్ళ మతం వేరు మన మతం వేరు అంటారు. నేను ఇలాంటివి ఏవీ పట్టించుకోను. అన్ని మతాలు ఒక్కటే, దేవుడు ఒక్కడే అని నమ్ముతాను. అతన్ని నొప్పించకుండా ఎలా 'నో' చెప్పాలాని ఆలోచించాను.



“థ్యాంక్యూ జయప్రకాష్! మా ఫ్యామిలీ ఊళ్ళో లేరు. వాళ్ళు వచ్చాక చెబుతాను. అప్పుడు మీరు తప్పక వద్దురుగాని” అన్నాను.

“ఓకే సార్!” అన్నాడు జయప్రకాష్.

అతను ప్రతివారం అడుగుతూనే ఉన్నాడు. నేను ఏదో వంకపెట్టి తప్పించుకుంటూనే ఉన్నాను. మాకు పెళ్ళయ్యి పదిహేను సంవత్సరాలు అయినా పిల్లలు పుట్టలేదు. రాధ, నేను ఏ ఫంక్షన్‌కు వెళ్ళినా, ‘పిల్లలెంతమంది?’ అని అడుగుతారు. రాధ ఏదో తప్పు చేసినట్లుగా తలవంచుకుంటుంది. మా అమ్మ ‘అంత అదృష్టమా?’ అనో, ‘దేనికైనా రాసిపెట్టి ఉండాలి’ అనో అంటుంది. నాదైతే ఒకటే సమాధానం.

'మేం ఎవ్వరికీ ఋణపడి లేం. ఉంటే తప్పక పుడతారు' అని తప్పించుకుంటాను. రాధ తరుచు పోరుతోంది 'మీకెప్పుడూ ఆఫీసు గొడవే. ప్రొద్దున్న పోయి రాత్రి వస్తారు. నా బాధ మీరు అర్థం చేసుకోరు.' అని.

గుళ్ళు, గోపురాలు అన్నీ తిరిగాం. ఊళ్ళో ఉన్న మా ఫ్యామిలీ డాక్టర్‌ని చూసాము.

"ఇప్పటికే బాగా ఆలస్యం చేశారు. ఒకసారి హైదరాబాద్ వెళ్ళి ఫెర్టిలిటి క్లినిక్‌లో చూపించుకోండి. నాకైతే దోషం ఏమీ కనపడటం లేదు." అన్నారు.

"హైదరాబాద్‌కు ట్రాన్స్ఫర్ చేయించుకోండి" అంది రాధ. ఇప్పటికే చుట్టాలు 'గొడ్రాలు' అని స్టాంప్ వేసేసారు. పిల్లలు లేకపోతే సమాజం అదేదో ఆడవారి తప్పన్నట్లు చూస్తుంది. రాధ చెప్పింది సమంజసం అనిపించింది. అప్పుడే నాకు నలభై ఐదేళ్లు వచ్చేసాయి. ఇంకా ఆలస్యం చేస్తే అవకాశాలు పూర్తిగా తగ్గిపోతాయి.

మెడికల్ ట్రీట్మెంట్ అని రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేసి, మా యూనియన్ వాళ్ళచేత చెప్పించాను. నెల్లాళ్ళలో హైదరాబాద్ హెడ్ ఆఫీస్‌కు ట్రాన్స్ఫర్ వచ్చింది. హైదరాబాద్‌లో జాయిన్ అయ్యి ఇల్లు చూసుకుని వచ్చాను. ఓ మంచిరోజు చూసుకుని హైదరాబాద్ మకాం మార్చేశాను. హెడ్‌ఆఫీస్‌లో జాయిన్ అయ్యినప్పటినుంచి యూనియన్‌లో చురుకుగా పాల్గొంటున్నాను. రాధను తీసుకుని సంతాన సాఫల్యకేంద్రాలకు తిరుగుతూనే ఉన్నాను.

నేను దేవుడిని నమ్ముతాను. అలా అని సైన్స్‌ను కొట్టిపారేయను. మనకు ఏది ఇవ్వాలో ఎప్పుడు ఇవ్వాలో భగవంతుడికి తెలుసు. మనకు ఏది శ్రేయస్కరమో అది ఇస్తాడు. అది మనం కోరింది కాకపోవచ్చు. కృషి, పట్టుదల ఉంటే భగవంతుడు సహాయం చేస్తాడు. నా ప్రక్క సీట్లో ఉండే సంతోష్ మతం మారాడని ఆనంద్ చెప్పాడు.

"నువ్వు మతం ఎందుకు మారావ్ సోదరా?" అన్నాను సంతోష్‌ని.

"నేను పుట్టిన మతంలో దేవుడ్ని ఎన్నిసార్లు ప్రార్థించినా నా కోరిక నెరవేరలేదు. మా ఇంటికి వచ్చి వాళ్ళు రెండుసార్లు ప్రార్థన చెయ్యగానే నా కోరిక నెరవేరింది. ఆ తర్వాత నాకు ప్రమోషన్ కూడా వచ్చింది" అన్నాడు ఆనంద్ నవ్వుతూ.

"అంటే నిన్ను పుట్టించిన మతం దేవుడు చేతకానివాడు, నువ్వు మారిన మతం దేవుడు సమర్థుడూ అనా?" అన్నాను.

"అంతేగా!" అన్నాడు.

"అంటే దేవుడు మన కోర్కెలు తీర్చడానికే ఉన్నాడన్నమాట. అసలు దేవుళ్ళు ఎంతమంది ఉన్నారు?"

"అంటే... అంటే... అసలైన దేవుడు మా దేవుడే... అంటే నేను మారిన మతంలోని దేవుడు."

"దేవుళ్లలో అసలైన దేవుడు, నకిలీ దేవుడు ఇద్దరున్నారా?"

సంతోష్ ఒక్క క్షణం తటపటాయించాడు.

"నేను అసలైన దేవుడి మతంలోకి మారాను."

"అంటే నిన్ను, కొన్ని కోట్లమందినీ పుట్టించిన దేవుడు నకిలీనా?" అన్నాను.

అతను వాచీ చూసుకున్నాడు.

"కొంచెం అర్జెంట్ పనుంది బాస్... తర్వాత మాట్లాడుదాం." అన్నాడు సంతోష్ కుర్చీలోంచి లేస్తూ.

ఇంతలో నా సెల్ మ్రోగింది.

జయప్రకాష్ కాల్ చేస్తున్నాడు. సెల్ ఆన్ చేసి,"హల్లో! జయప్రకాష్! చెప్పు" అన్నాను.

"సర్! నేను హైదరాబాద్ వచ్చాను సార్! ద్వారక హోటల్‌లో దిగాను సర్!" అన్నాడు.

"మరి మన హెడ్ఆఫీస్‌కు వస్తావా?" అన్నాను.

"లేదు. అపోలోకి పోయి వచ్చాను. టెస్టులు చేయించారు. క్యాన్సర్ అని చెప్పారు సర్! రేపు హాస్పిటల్‌లో అడ్మిట్ అవమన్నారు సర్!" అన్నాడు బాధగా.

నాకు షాక్ అనిపించింది.

"వాట్? ఏం క్యాన్సర్?" అన్నాను.

"లంగ్ సార్" అన్నాడు నీరసంగా.

"డోంట్ వర్రీ జయప్రకాష్! భగవంతుడు నీలాంటి మంచివాళ్ళకు ఎప్పుడూ మేలు చేస్తాడు. ఇప్పుడు సైన్స్ ఎంతో డెవలప్ అయ్యింది. ఈరోజు క్యాన్సర్ అంటే పూర్వంలా భయపడక్కర్లేదు. నీకు ఖచ్చితంగా తగ్గిపోతుంది. ధైర్యంగా ఉండు. రేపు నేను హాస్పిటల్‌కు వస్తాను. నువ్వు రెస్ట్ తీసుకో. ఏదైనా సహాయం కావలిస్తే కాల్ చెయ్యి" అన్నాను ధైర్యం చెబుతూ.

"థ్యాంక్యూ సర్!" అన్నాడు.

మర్నాడు ఉదయమే హాస్పిటల్‌కు వెళ్ళాను. జయప్రకాష్, అతని భార్య, కూతురు, కొడుకు ఆంకాలజిస్ట్ రూమ్ దగ్గర బయట వెయిట్ చేస్తున్నారు. అతను నన్ను చూడగానే విష్ చేశాడు. అతడితో కరచాలనం చేసి, భుజం తట్టి చిరునవ్వుతో ప్రక్కనే కూర్చున్నాను. అతను వ్యాధి వల్లనో, బెంగ వల్లనో కాస్త చిక్కాడు. డాక్టర్‌గారి అసిస్టెంట్ పిలవగానే అందరం ఆయన గది లోపలకు వెళ్ళాం. డాక్టర్ వంశీమోహన్ నాకు తెలిసినవారే.

"మీరు రావడం కాస్త లేటు చేశారు. అయినా నథింగ్ టు వర్రీ. మొదట కీమో స్టార్ట్ చేద్దాం. వారానికి ఒకసారి. ఓ ఏడుసార్లు అయిన తరువాత చూసి రేడియేషన్ ఇద్దాం. ఇప్పుడు ఆపరేషన్ చెయ్యకూడదు. మెడిసిన్స్ రాస్తాను" అన్నారు డాక్టర్.

"అలాగే సార్!" అన్నాడు జయప్రకాష్. డాక్టర్‌కు నమస్కారం పెట్టి లేచారు. నేను కూర్చునే ఉన్నాను. వాళ్ళు బయటకు వెళ్ళారు.

"సర్! ఏమిటి పరిస్థితి?" అన్నాను.

"వీళ్లు ఎక్కడో వైద్యం చేయించుకుని వచ్చారు. సరైన వైద్యం జరగలేదు. స్టేజ్ ఫోర్" అన్నాడాయన.

“అంటే? సర్!” అన్నాను.

ఆయన పెదవి విరిచాడు.

“కనీసం ఓ ఐదారు సంవత్సరాలు?”

“కష్టం”

“రెండు మూడేళ్లు?”

“చెప్పలేం... ఆరునెలలనుంచి ఓ సంవత్సరం. మంచి ట్రీట్మెంట్ ఇద్దాం. తర్వాత దేవుడి దయ. అంత కంటే మనం ఏం చెయ్యలేం” అన్నాడు.

“సరే సర్! మళ్ళీ కలుస్తాను” అని వచ్చేసాను.

వాళ్ళకీవిషయం ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. వాళ్ళు బయట కూర్చున్నారు. కూతురు, కొడుకు మందుల కోసం ఫార్మసీకి వెళ్లారు. నేను కూడా వెళ్ళాను.

“అంకుల్! నాన్నకి...” అంది కూతురు.

“ఒకసారి నువ్వు, నీ తమ్ముడు డాక్టర్‌ను కలవండి. ఎన్నాళ్లు ట్రీట్మెంట్ తీసుకోవాలి, ఎంత ఖర్చు అవుతుంది కనుక్కోండి” అన్నాను.

“డాక్టర్ చెప్పేది నేను వినలేను అంకుల్! ఆరునెలలు అన్నవాళ్ళు ఆరేళ్లు కూడా ఉంటారు” అంది.

“సరే! నీ ఇష్టం” అని వచ్చేసాను. నేనేం చెప్పాను? ఆమె ఏమంటోంది?

జయప్రకాష్‌కు రూమ్ అలాట్ చేశారు. ఆరోజు కీమో స్టార్ట్ చేస్తారు.

“జయప్రకాష్! డాక్టర్‌తో మాట్లాడాను. నథింగ్ టు వర్రీ. ధైర్యంగా ఉండు. ధైర్యమే మొట్టమొదటి మందు. హాస్పిటల్ నుంచి ఎస్టిమేట్ తీసుకుని మన ఆఫీసు నుంచి మెడికల్ అడ్వాన్స్ ఇప్పిస్తాను” అన్నాను.

“సార్! మీరు దేవుడు సార్! సమయానికి నాకు అండగా ఉన్నారు.” అన్నాడు జయప్రకాష్ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ.

అతని భుజం తట్టి, ధైర్యం చెప్పి, హాస్పిటల్ వాళ్ళ ఎస్టిమేట్ తీసుకుని మా ఆఫీసుకు వచ్చాను. ఫైల్ పుటప్ చేసిన వెంటనే మా ఎం డి గారు రెండు లక్షలు అడ్వాన్స్ శాంక్షన్ చేశారు. చెక్కు బదులు క్యాష్ డ్రా చేయించి మర్నాడు వెళ్లి జయప్రకాష్ భార్యకు ఇచ్చాను.

“నిజంగా ఎం డి గారు దేవుడు. ఇంత త్వరగా... అదీ క్యాష్ ఎవరిస్తారు చెప్పండి?” అన్నాడు జయప్రకాష్.

వారానికి ఒకసారి కీమో తీసుకుని వాళ్ళ ఊరు వెళ్ళి వస్తున్నాడు. ఆరోజుతో కీమోలు అన్నీ పూర్తయ్యాయి. మర్నాడు నుంచి రేడియేషన్ ప్రారంభించారు. ఇరవై ఒక్క రేడియేషన్‌లు ఇచ్చారు. ఈరోజు పెట్ ఎం ఆర్ ఐ చేశారు. క్యాన్సర్ ఎంతవరకు

తగ్గిందో తెలుస్తుంది.

“జయప్రకాష్! నేను రోజూ నీ గురించి దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. భగవంతుడ్ని ఒకరి గురించి ప్రార్థించాలంటే వాళ్ళ ఇంటికో, ప్రార్థన మందిరానికో వెళ్ళి ప్రార్థించక్కర్లేదు. ఇతరుల గురించి మన మనస్సులో ప్రార్థన చేస్తే తప్పక వింటాడు. నా గురించి నేను కోరుకుంటే ఒకసారి, రెండుసార్లు వింటాడు. ఇతరుల గురించి ప్రార్థన చేస్తే ఎన్నిసార్లు అయినా వింటాడు.” అన్నాను.

విచిత్రం... అతను నా గురించి ప్రార్థన చేద్దామనుకున్నాడు. ఇప్పుడు నేనే అతని గురించి ప్రార్థన చేస్తున్నాను.

ఇంతలో డాక్టర్ వంశీమోహన్ విజిట్‌కు వచ్చారు.

“కంగ్రాట్యులేషన్ మిస్టర్ జయప్రకాష్! రిపోర్ట్స్ చాలా బాగున్నాయి. వైద్య చరిత్రలోనే అద్భుతం అని చెప్పొచ్చు. చాలా బాగా క్యూర్ అయ్యింది. మీరు ఇక్కడనుంచి ఆరు నెలలకు ఒకసారి చెకప్‌కు రండి. మందులు రాసిస్తాను. జాగ్రత్త గా వాడండి.” అన్నారాయన.

“మీరు నా పాలిట దేవుడు సార్! నేను జీవితం మీద ఆశ వదిలేసుకున్నాను. మీ వల్లే బతికాను సార్!” అంటూ జయప్రకాష్ కన్నీళ్లు పెట్టుకున్నాడు.

“కూల్... కూల్ జయప్రకాష్! నువ్వు మృత్యుంజయుడివి” అని భుజం తట్టి వెళ్ళిపోయాడాయన.

“మీరు, ఎం డి గారు, డాక్టర్ గారు దేవుళ్ళు సార్!” అని చేతులెత్తి దండం పెట్టాడు నాకు.

“కనపడని దేవుడికోసం మతం పేరుతో కొట్టుకుంటాం. మనం కష్టాల్లో ఉంటే ఆదుకొనే ప్రతివాడు దేవుడే. కులం, మతం పుట్టకముందు కూడా మనిషి ఉన్నాడు. అప్పుడు తనకు సహాయం చేసిన చెట్టును, పుట్టని కూడా దేవుడుగా కొలిచాడు. దేవుడు ఒక్కడే. ఎం డి గారి రూపంలో, డాక్టర్‌గారి రూపంలో, నీకు సహాయం చేసిన ప్రతీ ఒక్కడి రూపంలో ఉన్నట్టే ఈశ్వరుడు పేరుతో, ఏసు పేరుతో, అల్లా పేరుతో ఉన్నాడు. కనపడని దేవుడికంటే కనిపించే మనుష్యుల్లో దేవుళ్ళని గుర్తిద్దాం. దేవుడు ఒక్కడే అయినప్పుడు మతాలు దేవుడికి సమ్మతమేనా?” అన్నాను.

“ఈరోగం నా కళ్ళు తెరిపించడానికే వచ్చింది సార్!” అన్నాడు నన్ను కౌగలించుకుని. అతని వెన్ను తట్టి సెలవు తీసుకుని ఇంటికి వచ్చాను. గుమ్మంలోనే ఎదురొచ్చింది రాధ.

“శుభవార్త... మీరు తండ్రి కాబోతున్నారు” అంటూ వచ్చి నన్ను కౌగలించుకుంది. ఇది ఏ దేవుడి కరుణో, ఏ ప్రార్థన ఫలితమో...

# అద్భుత శక్తులు

శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు
✆ 9912848738

కథామంజరి బాలకథ

***అద్భుతశక్తులు ఒకరిస్తే వచ్చేవి కావు. అవి మనకు మనమే సాధించుకోవాలి. సాధనతో సాధించేవే అద్భుతాలై నిలుస్తాయి. శరీరంతో మమేకమై దాగి ఉండే అద్భుతశక్తులను సరిగ్గా తెలుకోగలిగి, విజ్ఞతనెరిగి వినియోగించుకున్నప్పుడే... అదే నిజమైన నిత్యనూతనమైన, దేదీప్యవంతమైన జీవితం!***

దండకారణ్యానికి ఆనుకుని ఉన్న ఓ కుగ్రామంలో తిన్నడు అనే ఓ సోమరిపోతు ఉండేవాడు. యవ్వనప్రాయంలోకి అడుగిడిన తిన్నడికి చదువుసంధ్యలు సరిగ్గా అబ్బక, ఏ పనీపాటూ లేకుండా తల్లిదండ్రుల కాయకష్టంతోనే కడుపులోని చల్ల కదలకుండా, అల్లరి చిల్లరగా తిరుగుతూ రోజులు గడిపేసేవాడు.

తిన్నడు తల్లిదండ్రుల హితవాక్యాలను ఇసుమంతైనా లెక్కచేయకుండా పెడచెవిని పెట్టేవాడు. అంతేగాక, నిత్యం తన తల్లిదండ్రులను నిందించేవాడు. ఏ ఆస్తిపాస్తులూ సంపాదించిపెట్టలేదని నిత్యం దుమ్మెత్తిపోసేవాడు.

అలా రోజులు గడిచిపోతున్నాయి.


ఒకరోజు తిన్నడు బాగా ఆకలితో ఆవురావురుమని ఇంటికి వచ్చి, తల్లిని భోజనం పెట్టమన్నాడు. ఒంట్లో బాగోలేక మంచంమీద పడుకున్న అతని తండ్రి తిన్నడిని దగ్గరకి పిలిచి, "నాయనా! ఈరోజు పొయ్యి వెలిగించలేదు. వంట చేయడానికి ఏ విధమైన వంట సరుకులు లేవు. సరుకులు కొనడానికి ఏ కాస్త ధనమూ మన దగ్గర లేదు. మాకేమో రోజురోజుకి శక్తి సన్నగిల్లుతోంది. నీకిప్పుడు యుక్తవయసు సమీపించింది. ఇకనుంచైనా నీవు ఏదైనా ఉపాధిమార్గం చూసుకుంటే, ఈ తల్లిదండ్రుల మనసులు కాస్త ఊరట చెందుతాయి. నువ్వో గాడిన పడితే ప్రశాంతంగా కన్నుమూస్తాం..." అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

తన తండ్రి కళ్ళల్లో కనిపించిన కన్నీటి తడికి తిన్నడి మనసులో ఎక్కడో కాస్త చలనం కలిగి, తొట్టతొలిసారిగా ఆలోచనలో పడ్డాడు. ఆహారం గురించి యోచించడం మొదలుపెట్టాడు. అలా ఆరోజు రాత్రంతా, అదేపనిగా దీర్ఘాలోచన చేసుకుని, ఆ మరుసటి రోజు ఉదయాన్నే లేచి, తల్లిదండ్రులకు చెప్పి, బ్రతుకుతెరువుకై ఇంటినుండి బయల్దేరాడు.

అలా బయలుదేరిన తిన్నడు, దండకారణ్యం గుండా చాలాదూరం ప్రయాణం చేసి బాగా అలసిపోయాడు. అతనికి చాలా దాహం వేసింది. అక్కడకి కాసింత దూరంలో ఓ ముని ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమం ప్రకృతినంతా తనలోనే ఇముడ్చుకున్నట్టుగా చుట్టూ పచ్చని చెట్లతో, రకరకాల పూలమొక్కలతో అత్యంత మనోహరంగా కనిపిస్తోంది.

తిన్నడు నెమ్మదిగా కాళ్ళీడ్చుకుంటూ అక్కడికి చేరుకున్నాడు. అక్కడ ఎవరో ఒక స్వామీజీ తన శిష్యులకు విద్యకు సంబంధిత అంశాలను బోధిస్తున్నారు. అతని ముఖవర్చస్సు తేజోవంతంగా వెలిగిపోతోంది. ఆ స్వామీజీ శిష్యగణానికి బోధిస్తున్న జ్ఞాన ప్రబోధాలు అర్థం కాకపోయినా తిన్నడు మనసుని ఎంతగానో ఆకర్షించి, చాలా ఊరట కలిగించాయి. ఆ వాక్కులు వింటూ చాలాసేపు అలాగే ఉండిపోయాడు.

అప్పుడనిపించింది తిన్నడికి, 'స్వామీజీలకు ఏవేవో దివ్యశక్తులు ఉంటాయని తను ఎక్కడో వినియున్నాడు. ఆ స్వామీజీకి మంచిగా సేవ చేసుకొని, ఆయన ద్వారా ఏదైనా అద్భుత శక్తులను సాధించుకుని తద్వారా లభించిన అపారమైన ధనరాశులతోనే ఇంటిముఖం పట్టాలి' అని గట్టిగా సంకల్పం చేసుకున్నాడు.



కాసేపటికి ఆ విద్యాబోధన కార్యక్రమం ముగియగానే, తిన్నడు స్వామీజీ చెంతకు చేరి "సాములోరికి కోటిదండాలు! సామీ... నా పేరు తిన్నడు. బతుకుతెరువుకై దేశాన పడ్డాను. తమరు కనికరిస్తే కొంతకాలం ఇక్కడే ఉండి, తమకి సేవ చేసుకుని ఓ నాలుగు మంచిముక్కలు నేర్చుకుని, ఇక్కడినుంచి వెడతాను..." అన్నాడు తిన్నడు వినయంగా నమస్కరిస్తూ.

తిన్నడు మాటలకు స్వామీజీ చిరు మందహాసం చేస్తూ "నాయనా! ఆశ్రమపు అలవాట్లు, నియమనిబంధనలు చాలా కఠినంగా ఉంటాయి. నీకు సమ్మతమైతే అలాగే కానిమ్ము..." అని ఆ ఆశ్రమం బాగోగులు చూసుకునే ఓ శిష్యుడికి తిన్నడిని అప్పగించారు.

★★★

ఎన్నడూ ఒళ్ళువంచి పనిచేసే అలవాటులేని తిన్నడు, నెమ్మదిగా ఎలాగోలాగా అద్భుత శక్తులు సాధించుకునే సాధనలో భాగంగా ఆశ్రమంలో అన్ని పనులను చకచకా చక్కబెడుతూ అందరి మన్ననలు అందుకోగలుగుతున్నాడు.

ఏరోజూ బారెడు పొద్దెక్కినా లేవని తిన్నడు ఉదయాన్నే బ్రహ్మముహుర్తానికే నిద్రలేస్తున్నాడు. ఎలాగైనా గురువుగారి మనసును గెలుచుకొని, ఆయన కృపకు పాత్రుడు కావాలనేదే తిన్నడి ఆశ, ఆశయం!!

కొద్ది రోజుల్లోనే తిన్నడు అందరి ప్రేమనీ, నమ్మకాన్నీ చూరగొన్నాడు. ఇప్పుడు అతని జీవనవిధానమే సంపూర్తిగా మారిపోయింది. అలా అందరి తలలో నాలుకలా మారిపోయిన తిన్నడు గురువుగారు ప్రసాదించబోయే అద్భుత శక్తుల కోసం ఎదురుచూడసాగాడు.

స్వామీజీ తిన్నడిని గమనిస్తూనే ఉన్నారు. ఆ ఆశ్రమం కోసం అహర్నిశలు శ్రమించే తిన్నడు అంటే గురువుగారికి సదభిప్రాయమే ఏర్పడింది. కానీ ఏనాడూ తిన్నడిని పిలిచి మాట్లాడలేదు. ఈ విషయమై ఏరోజూ తిన్నడు మథనపడలేదు. ఎందుకంటే తాను గురువుగారి కృపను సంపాదించుకోలేకపోవడంలో ఎక్కడో తనలోనే లోపం ఉందని అనుకునేవాడు.

మరింత భక్తిశ్రద్ధలతో మెలిగేవాడు. తిన్నడు ఇలా అనుకోవడానికి కారణం లేకపోలేదు. గురువుగారు శిష్యులకు చెప్పే ఉపనిషత్తులు అందులోని సారాంశాన్ని కాస్తోకూస్తో వంటబట్టించుకోవడంతో అతని ఆలోచన విధానములో చాలా మార్పు చోటుచేసుకుంది.

ఆలోచనే ప్రధానం... మనిషిని అత్యున్నత శిఖరానికి తీసుకుపోవాలన్నా, అధఃపాతాళంలోకి నెట్టెయ్యాలన్నా!

★★★

తిన్నడు ఎదురుచూసే రోజు రానే వచ్చింది. ఒకరోజు అతన్ని గురువుగారు పిలిచి "నాయనా! ఈ ఆశ్రమంలో నీవు అందరితో బాగా కల్సిపోయావు. నీవు ఇక్కడే ఇలాగే ఉండిపోతే నీ కుటుంబానికి దూరం అయిపోతావు. చక్కగా ఓ ఇంటివాడవై గృహస్థ ధర్మాన్ని, బాధ్యతల్ని పాటిస్తూ సుఖసంతోషాలతో జీవించు..." అని చెప్పగా, స్వామీజీ మాటలకు తిన్నడు ఇదే మంచి సమయమని భావించి, "స్వామీ... మీ మాట కోసం ఎదురు చూస్తున్నాను. తమరు దయతలచి ఏదైనా వరం ప్రసాదిస్తే..." అని అర్థోక్తిగా ఆగి, స్వామీజీని భక్తితో చూశాడు ఆశగా.

అతను మాటలతో స్వామిజీ చిన్నగా నవ్వి, "నాయనా! ఏళ్ల తరబడి తపస్సు చేసుకునే మునీశ్వరులకు మాత్రమే వరములుగాని, శాపములుగాని ఇచ్చే శక్తి ఉంటుంది. నాకు అలాంటి అద్భుత శక్తులు ఏమీ లేవు. ఏదో నాకు తెలిసిన నాలుగు మంచిమాటలు విద్యగా ప్రసాదించటం తప్ప! అంతకన్నా ఏ అద్భుతాలు ఇవ్వలేనివాడను.

చూడు నాయనా! నీకు జన్మనిచ్చిన నీ తల్లిదండ్రులపట్ల నీకు చిన్నచూపు ఉందని కొంతమంది శిష్యుల ద్వారా నా చెవినిబడింది. తల్లిదండ్రులే నీకీ జీవితాన్నిచ్చి ఈ భూమ్మీదకు నిన్ను తీసుకొచ్చారు. నువ్వు ఈ అద్భుత ప్రపంచాన్ని చూసేందుకు కళ్ళు, నడిచేందుకు కాళ్లు, పనిచేసి పొట్ట నింపుకునేందుకే కాక సాటిప్రాణులను సాకేందుకు చేతులను, వివేకంతో ఆలోచించుకునేందుకు మహత్తరమైనటువంటి మెదడు... అనే అనేక దివ్య శక్తులతో చక్కటి శరీరాన్ని నీకు అందించారు.

తమ నెత్తురుని ధారపోసి, నీకీ జన్మనిచ్చారు. ఆ నెత్తురు నిండా సత్తువనిచ్చారు. నీ శరీరంలో ప్రవహించే ప్రతీ రక్తపుబొట్టు వారిదేనని తెలుసుకున్న రోజున జీవితానికి నిజమైన అర్థం, సార్థకత చేకూరినట్టే! ఇంతకన్నా నీకేమి కావాలి? ఏమివ్వాలి?

అద్భుత శక్తులు ఒకరిస్తే వచ్చేవి కావు. అవి మనకు మనమే సాధించుకోవాలి. సాధనతో సాధించేవే అద్భుతాలై నిలుస్తాయి. శరీరంతో మమేకమై దాగి ఉండే అద్భుత శక్తులను సరిగ్గా తెలుసుకోగలిగి, విజ్ఞతనెరిగి వినియోగించుకున్నప్పుడు... అదే నిజమైన నిత్యనూతనమైన, దేదీప్యవంతమైన జీవితం!" అని స్వామీజీ తిన్నడివైపు చూసారు లాలిత్యంగా.

తిన్నడి ముఖంలో ప్రకాశవంతమైన ఓ దివ్యమైన వెలుగు. ఏదో సాధించిన ఘనత ఆ కళ్ళల్లో ప్రస్ఫుటంగా గోచరిస్తోంది. స్వామీజీ మాటలతో ఎక్కడో కమ్ముకున్న మాయామోహావేశాల మైకపు పొరలు సంపూర్తిగా తొలగిపోయాయి.

తనలో నిక్షిప్తమైన అద్భుత శక్తులను తనకు పరిచయం చేసిన గురువుగారికి అనేక కృతజ్ఞతలు చెప్పుకొని, ఆశ్రమంలో అందరి వద్ద వీడ్కోలు తీసుకుని, గుండెల్నిండా జీవితానికి సరిపడా అద్భుతమైన శక్తులు నిండిన ఆత్మవిశ్వాసంతో ఆశ్రమంనుండి బయటికి నడిచాడు.

తిన్నడి అడుగులు తన ఇంటివైపుగా వేగంగా సాగిపోతున్నాయి. తన తల్లిదండ్రులకు ప్రేమను పంచేందుకు, వారిని తన సేవలతో తరింపజేసేందుకు , తన బాధ్యతలతో ఆ కన్నవారి కళ్లల్లో సంతోష కాంతులను చూసుకునేందుకు ఉత్సాహంగా నడుస్తున్నాడు స్వచ్ఛత నిండిన మనసుతో!

# పందిరి మంచం

డేగల అనితాసూరి

కథామంజరి బాలకథ

***సుధాముడివంటి శ్రమ విలువ తెలిసి, వినయంతో, పరోపకారంతో ఉన్నవాళ్ళు జీవితంలో ఎప్పటికైనా బాగుపడతారు. లంకెబిందెలతో సుధాముడు తన కుటుంబాన్ని మాత్రమేకాక అన్నార్తులను ఆదుకోవాలని కాంక్షిస్తున్నాను***

మాధవాపురంలో సుధాముడనే పేదవాడు ఉండేవాడు. రెక్కాడితేగానీ డొక్కాడని సుధామునికి తల్లి, తండ్రి, భార్య, కొడుకు ఉన్నారు. జానెడు భూమికూడా లేని సుధాముడు పొలాల్లో కూలీ పనులకు వెళ్ళేవాడు. తెలిసినవాళ్ళు ఏ పనిచెప్పినా చేసేవాడు. కొందరు బియ్యం, పప్పులు ఇస్తే కొందరు పావలో అర్ధో చేతిలో పెట్టేవాళ్ళు.

ఒకసారి ఊరి జమిందారు పొలాన్ని కౌలుకుచేసే సుబ్బన్న పనిమీద వేరే ఊరు వెళ్ళాల్సి వచ్చింది. అసలే వరిపంట కోతకు దగ్గరపడింది. అటువంటప్పుడు జాగ్రత్తగా ఉండకపోతే దొంగలుపడే అవకాశం ఎక్కువ కాబట్టి నమ్మకమైన సుధాముడ్ని పంటకు కాపలాగా పడుకోమని చెప్పాడు. సుధాముడు తన పందిరిమంచం భుజానమోసుకుంటూ పొలంవైపు వెళ్తుంటే పక్కపొలం రమణయ్య, 'ఇతను చాలా మెతకవాడు. అసలే పొద్దంతా అందరిపనులూ చేసి అలసిపోయి ఉంటాడు కాబట్టి తొందరగా నిద్రపోతాడు. అప్పుడు జమిందారు పొలంలోని వరి కంకులు అందినంతా కోసుకోవచ్చు' అని తలచి, వెంట నడవసాగాడు.

సుధాముడు నడుస్తున్న దారిలో ఒక ముసలితాత చలికి గజగజ వణుకుతూ ఎదురుపడ్డాడు. "ఏం తాతా! చీకటిపడుతున్నప్పుడు ఎక్కడికి బయలుదేరావు? నీకు తోడుగా ఎవరూ లేరా?" అని అడిగాడు సుధాముడు.

"లేదుబాబూ... పక్క ఊరెళ్ళాను. తొందరగా ఇంటికెళ్ళిపోవచ్చనుకున్నా. నాకు పిల్లలెవరూ లేరు" అని చెప్పాడు తాత.

సుధాముడు మంచాన్ని వెల్లకిలాపెట్టి తాతను కూర్చోబెట్టుకుని, తన కంబళి తాతకు కప్పి, తన భుజానున్న తాడుతో మంచం నాలుగువైపులా కట్టి వీపునమోసుకుంటూ మైలుదూరంలో ఉన్న తాత ఇంట్లో దిగబెట్టి పొలానికి బయలుదేరాడు.

ఆ రాత్రి రమణయ్య భావించినట్టే సుధాముడు రెండవఝాము దాటీదాటగానే ఆదమరచి నిద్రపోయాడు. రమణయ్య సంతోషంగా అందినంత వరిపంటను కోసుకెళ్ళాడు.



మర్నాడు ఊరినుంచి వచ్చిన సుబ్బన్నపంట ఎవరోకోసుకెళ్ళారని గ్రహించి, సుధాముడ్ని నిలదీసాడు. తనకేమీ తెలియదని సుధాముడు ఎంతచెప్పినా జమిందారుముందు నిందితుడిగా నిలబెట్టాడు సుబ్బన్న.

జమిందారు ఊరివాళ్ళందరినీ పిలిపించి తన పనివాడితో నిజం ఒప్పుకునేంతవరకూ సుధాముడ్ని కొరడాతో శిక్షించమని చెప్పాడు. పనివాడు కొరడా కదిలించేలోపు సుధాముడి పందిరిమంచం గాల్లో ఎగురుతూ వచ్చి చుట్టూచేరిన గుంపులో నిలబడ్డ రమణయ్యను మంచంకోళ్ళు తగిలేలా వాయించడం మొదలు పెట్టింది.

జమిందారుతో సహా అందరూ ఆశ్చర్యంగా చూస్తుండగానే రమణయ్య దెబ్బలు తాళలేక కుయ్యో మొర్రోమంటూ జమిందారు కాళ్ళమీదపడి వరి కంకులు తానే దొంగిలించానని ఒప్పుకున్నాడు.

ఆ రాత్రి ముసలితాత రూపంలో సుధాముడ్ని పరీక్షించిన సస్యదేవత పందిరిమంచాన్ని ఆవహించి, అసలునిజం చెప్పించాక, సుధాముడి మంచిబుద్ధిని మెచ్చుకుంటూ రెండు లంకెబిందెలు పందిరిమంచంపైన ప్రత్యక్షమయ్యేలాచేసి అందరూ వినేలా అశరీరవాణితో, “సుధాముడివంటి శ్రమ విలువ తెలిసి, వినయంతో, పరోపకారంతో ఉన్నవాళ్ళు జీవితంలో ఎప్పటికైనా బాగుపడతారు. లంకెబిందెలతో సుధాముడు తనకుటుంబాన్ని మాత్రమేకాక అన్నార్తులను ఆదుకోవాలని కాంక్షిస్తున్నాను” అని మంచాన్ని వీడి మాయమైంది.

ఈ వింతను చూసిన ఊరిజనం మార్పుచెంది, తాముకూడా ఇతరులకు సహాయం చేస్తూ చుట్టుపక్కల గ్రామాల్లో మాధవాపురమంతటి ఊరు మరెక్కడా లేదన్న గొప్ప పేరు తెచ్చుకున్నారు.

# సంకెళ్ళు

**మంజరి**

**విశిష్ట అతిథి కథ**

***రాఘవరావు చప్పున అన్నాడు "సార్! నా కూతురొస్తోంది..." అటే చూస్తూ తలూపాను. "హేండ్‌కఫ్ తీసేయండి సార్!" ఆందోళనగా అన్నాడతను. ఉలిక్కిపడి అతని ముఖంలోకి చూసాను. "బేడీలు చూస్తే అదేడుస్తుందండీ..." దీనంగా చూసాడు రాఘవరావు. హేండ్‌కఫ్ తియ్యడం ఎంత ప్రమాదమో నాకు తెలుసు. చేతికి సంకెళ్ళు లేకపోతే... ఉన్నట్టుండి లేచి పరిగెట్టవచ్చు. నేను ఆయుధం సర్దుకునేలోపు అదృశ్యమవుతాడు. ఒకవేళ ఆయుధంతో రెడీగా ఉన్నా, మనుషుల మధ్య పరిగెడితే చేసేదేమీ ఉండదు. ఆలోచించి నిర్ణయం తీసుకునే సమయం లేదు. ఆ పిల్ల అత్యంత వేగంగా మా దగ్గరకు వచ్చేస్తోంది.***

"కాస్త జాగ్రత్తగా ఉండాలి" చెప్పాడు జైలర్ నా ముఖంలోకి చూస్తూ నెమ్మదిగా. తలూపి గేటు పైకి దృష్టి సారించాను. అవతల వైపు గుంపుగా ఉన్నారు ముద్దాయిలు. సాయంకాలం వాళ్ళని జైలునుండి తీసుకొని, మరునాడు కోర్టులో జాగ్రత్తగా హాజరుపరచాలి. లోకల్ కోర్టుకైతే, వాయిదా రోజు తీసుకుంటే సరిపోతుంది. కానీ, దూరప్రాంతాల్లోని కోర్టులకైతే ముందురోజు సాయంకాలం ముద్దాయిల్ని తీసుకోవాలి. ముద్దాయిని రిసీవ్ చేసుకున్నాక కోర్టులో హాజరుపెట్టి తిరిగి జైలుకి అప్పగించేవరకూ ఎస్కార్ట్ వారిదే బాధ్యత. జైలు సిబ్బంది ముద్దాయిని ఇచ్చేముందు... అతను తీవ్రనేరాలకు పాల్పడినా లేదా గతంలో ఎస్కార్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినా హెచ్చరించడం రివాజు.

నా ఆలోచనలు చెడగొడుతూ, "మురికిపూడి రాఘవరావూ..." అరిచాడు వార్డెన్.

గుంపుగా ఉన్న ముద్దాయిల మధ్య నుంచి ఒకతను గుమ్మం దాటి జైలర్ ముందు నిలుచున్నాడు. అతను కాస్త లావుగా, దానికి తగ్గ ఎత్తుతో పుష్టిగా ఉన్నాడు. అప్పుడే చేసుకున్నట్టు గెడ్డం శుభ్రంగా ఉంది. లాల్చీ, పైజమా వేసుకున్నాడు. ముఖంలో దుడుకుతనం, కరకుతనం కొంచెం కూడా కనిపించడం లేదు.

మురికిపూడి రాఘవరావు అతనేనని నిర్ధారించుకొని కాగితాలు నా చేతికి ఇచ్చి తలూపాడు జైలర్. సెంట్రీ తలుపు తీసి మేము బయటకి అడుగు పెడుతున్నప్పుడు, "ఒక్కటీ" అని అరచి తలుపు మూసేసాడు. బయట ఎదురు చూస్తున్న

కానిస్టేబుల్ ముద్దాయి కుడిచేతికి హేండ్‌కఫ్ తగిలించి లాక్ చేసి కీ నా చేతికి అందించాడు. అతన్ని వ్యాన్ ఎక్కించి కూర్చున్నాం. మిగతా ఎస్కార్టు పార్టీలు వచ్చాక వ్యాన్ బయలుదేరింది.

సిటీకి పది కిలోమీటర్ల దూరంలో ఉంది జైలు. చీకటి నెమ్మదిగా ఆవరించుకుంటోంది. ప్రకృతిని ముద్దాయిలంతా బయటకి చూస్తున్నారు వింతగా. జైళ్లలో ఉన్న వాళ్ళకి స్వేచ్ఛ విలువ బాగా తెలుస్తుంది. మా ఆఫీసు చేరుకొని వెయిటింగ్ రూమ్ కిటికీకి లీడింగ్ చైన్ తగిలించి, లాక్ చేసి అడిగాను ముద్దాయిని.



"ఇక్కడనుండి బస్ ఎన్ని గంటలకి?"

"తొమ్మిదికండీ" చెప్పాడతను.

"కోర్ట్ టైముకి వెళ్లగలమా?" మళ్ళీ అడిగాను.

"ఏడుకే వెళ్ళిపోతామండి..." అని, "సార్! సిగరెట్లు కావాలి..." ప్రాధేయపడుతున్నట్టు అన్నాడు.

కోర్టుకి ముద్దాయిని తీసుకువెళుతున్నప్పుడు ఫీడింగ్ చార్జీలు ఇస్తారు. ఆ డబ్బు ఎస్కార్ట్ ఇన్‌ఛార్జి దగ్గర ఉంటుంది. ఆ డబ్బుతో ముద్దాయికి రెండు పూటలా భోజనం పెట్టించాలి. మరోదానికి ఆ డబ్బు ఉపయోగించకూడదు. కానీ... ముద్దాయి అభ్యర్థన మీద సిగరెట్లు, బీడీలూ కొనిపెడతాం. ఇదంతా రూల్సుకి విరుద్ధం. ఫీడింగ్ ఛార్జీలు వేరేవాటికి ఖర్చుపెడితే, భోజనం పెట్టించడానికి డబ్బుండదు. అయితే, కోర్టుకొచ్చిన బంధువులు అతని అవసరాలు చూస్తారు కాబట్టి, ఫీడింగ్ డబ్బు ముందే ఖర్చుచేసినా ఇబ్బంది ఉండదు. ఇదంతా రిస్క్‌తో కూడిన వ్యవహారం. అయినా తప్పదు. ఇరవై రూపాయలతో ఓ మనిషికి రోజంతా తిండి పెట్టడం అసాధ్యమని జగమెరిగిన సత్యం.

ముద్దాయికి అవసరమైన సిగరెట్లు తెప్పించి, అతని వద్ద కానిస్టేబుల్‌ని కాపలా ఉంచి ఆఫీసులోకి వెళ్ళాను. గుంటూరు జిల్లాలోని ఆ ఊరు కోర్టుకి వెళ్లి రావడానికి అవసరమైన బస్ వారంట్లు తీసుకున్నాను. వెయిటింగ్ రూమ్‌కి తిరిగొచ్చి బస్సుకి ఇంకా టైము ఉండటంతో కానిస్టేబుల్‌ని భోజనానికి పంపాను.

ముద్దాయి సిగరెట్టు కాలుస్తున్నాడు.

“నీ కేసేమిటి?” అడిగేను, రిలాక్స్డ్‌గా కూర్చొని.

“మర్డర్ కేసండి...” అన్నాడతను.

“చేసేవా?” అని అడిగాను.

“ఆ... ఒకే దెబ్బకి తెగిపడేలా తల నరికా...” చెప్పాడతను ఓ సామాన్య విషయంలా. నేను ఏమాత్రం ఆశ్చర్యపోలేదు.

నా సర్వీసులో ఎందరో ముద్దాయిలు తారసపడ్డారు. మేము ముద్దాయిల్ని నమ్మనట్టే వాళ్ళు కూడా మమ్మల్ని నమ్మరు. కానీ... మాతో నిజం చెప్పినందువల్ల వచ్చే ప్రమాదం ఏమీ లేకపోవడంతో నిర్భయంగా మాట్లాడతారు. పైగా ఎస్కార్ట్ పార్టీతో మంచిగా ఉండకపోతే, తమ అవసరాలు తీరవని వాళ్ళకి తెలుసు.

పోలీసు సర్వీసులో ముద్దాయి ఎస్కార్ట్ డ్యూటీ అంత కష్టమైనది మరొకటి లేదు. ముద్దాయిలు పారిపోవడం వల్ల ఉద్యోగాలు కోల్పోయినవాళ్ళు ఎంతోమంది ఉన్నారు. అలాంటివారు మా ఆఫీసు చుట్టూ, కోర్టు చుట్టూ తిరుగుతూ ఉంటారు. అందుకే ఎస్కార్ట్ డ్యూటీలో నేను ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తాను.

“నీకు శిక్ష పడుతుందా?” ఆలోచనల నుండి బయటపడి అడిగాను.

“పడదండి” నమ్మకంగా అన్నాడతను.

“ఏం?” అన్నాను ఆశ్చర్యంగా. అతను చిన్నగా నవ్వాడు.

“హత్య జరిగిన సమయంలో నేను హాస్పిటల్లో ఎక్కడకీ కదల్లేని స్థితిలో ఉన్నాను. నేను హత్య చెయ్యడం చౌదరి మామ చూసాడు. అతని సాక్ష్యం కంటే నా ఎలిబీ బలమైనది...” చాలా తేలిగ్గా అన్నాడు. ఇంటెలిజెంట్ క్రిమినల్ అన్నమాట. నేను ఇంకా జాగ్రత్తగా ఉండాలి అనుకున్నాను.

“హత్య ఎందుకు చేసావ్?” అడిగేను, అతని ముఖంలోకి చూస్తూ. రాఘవరావు నిట్టూర్చాడు.

"నేను దుబాయ్‌లో రెండేళ్ళు పని చేసి వచ్చాను సర్! ఆ డబ్బుతో పెద్దపిల్ల పెళ్లి చేశాను. మరో పిల్ల ఉంది కాబట్టి, చిన్నచిన్న వ్యవహారాలు చక్కబెట్టుకొని తిరిగి దుబాయ్ వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను. అప్పుడే పొలం దగ్గర వచ్చిన తగాదా పరిష్కారం కోసం మా గ్రామపెద్ద చౌదరిని కలవడానికి వెళ్ళాడు నా తండ్రి. ఓ గంట తర్వాత ఒళ్ళంతా దుమ్ముకొట్టుకుపోయి తిరిగొచ్చాడు. ఆ విషయం కనుక్కోవాలని చౌదరిని కలిసాను. నాకేం జవాబు ఇవ్వకుండా మనుషులతో కొట్టించి, కొనఊపిరితో వదిలేసాడు చౌదరి..." ఆగాడతను.

నేను ఆసక్తిగా వింటున్నాను.

"ఆస్పత్రిలో చేర్చారు. ఆరోగ్యం కుదుటపడడానికీ, విరిగిన ఎముకలు అతుక్కోవడానికీ మూడు నెలలు పట్టింది.

కృష్ణాజిల్లానుంచి నా మిత్రులను పిలిచి పథకం తయారు చేశాను. తెల్లవారుజామునే నిద్రలేచి పొలం వెళ్ళడం చౌదరి అలవాటు. సాధారణంగా ఎప్పుడూ ఒక్కడే వెళతాడు. స్పాట్ పెట్టిన రోజు మామను వెంటేసుకొని బయలుదేరాడు. దారిలో మాటేసిన నా స్నేహితులు ఎదురెళ్ళారు. ఆ సమయంలో వచ్చిందెవరో అర్థంకాక నిలబడిపోయాడు చౌదరి. వెనక పక్క తుప్ప చాటునుండి బయటకి వచ్చాను. ఒక్క వేటుతో తల నరికాను."

"తర్వాత ఏమైంది?" కంగారుగా అతణ్ణి అడిగాను. అంత వరకూ కళ్ళముందు కదిలిన భయంకర దృశ్యంనుండి బయటపడి.

"వెంటనే ముగ్గురం అక్కడి నుండి అదృశ్యమయ్యేం... నా స్నేహితులు తమ ఊళ్ళకి వెళ్ళిపోయేరు. నేను హాస్పిటల్ బెడ్డు మీద బ్యాండేజితో పడున్నా... చౌదరి మామ పోలీస్ కంప్లెయింట్ ఇచ్చాడు..." అన్నాడతను.

అతని కళ్ళలోకి చూసి అడిగాను. "హత్య చెయ్యడానికి ముందు నీ భార్యాపిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించలేదా?"

"లేదు..." తల అడ్డంగా ఊపాడు.

ఓ క్షణం తర్వాత అన్నాడు. "మనిషి భయంతో ఎంతకాలం బతుకు సాగిస్తాడు? పెద్దవాడని చూడకుండా కండకావరంతో నా తండ్రి మీద చెయ్యి చేసుకున్నాడు చౌదరి. అడగడానికి వెళితే నిర్దాక్షిణ్యంగా నన్ను కొట్టించాడు. నా ప్రాణాలు పోవలిసిందే! కానీ, బతికాను. బతికి బదులు తీర్చుకున్నాను. ఇప్పుడు మా ఊరి జనం భయం లేకుండా బతుకుతున్నారు. ఆ జనమే నా కుటుంబాన్ని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటున్నారు" అన్నాడు.

అతని మాటలు నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. సరిగ్గా తొమ్మిది గంటలకి బస్సెక్కాం. మురికిపూడి రాఘవరావుని మధ్యలో కూర్చోబెట్టి, లీడింగు చైను సీటు రాడ్డుకి తగిలించి లాక్ చేశాను. అటూ, ఇటూ కానిస్టేబుల్స్ కూర్చుంటే నేను వెనక సీటు ఆక్రమించాను. ఎవరో ఒకరు మేల్కొని ఉంటే, మిగతా ఇద్దరూ కునుకు తియ్యచ్చు.

★★★

బస్‌స్టాండ్ పరిసరాలు వింతగా కనిపించాయి. నేను మొదటిసారి వచ్చాను ఆ ఊరు. 'కోర్టుకు ఎటు వెళ్ళాలో...' అనుకుంటూ ఉండగా, అటుగా వెళుతున్న ఓ ఆటోని పిలిచి అన్నాడు ముద్దాయి, "మీరు ఎక్కండి సార్! కోర్టు దగ్గరకు వెళ్లి, అక్కడే ముఖాలు కడుక్కుందాం."

అంతకంటే చేసేదేమీ లేకపోవడంతో ఆటో ఎక్కాను. కోర్టు దగ్గర దిగాక ఆటోకి డబ్బులివ్వబోయాను. "వద్దండి..." అని చెప్పి, డ్రైవర్ ఆటోని తీసుకొని వెళ్ళిపోయాడు. నా నొసలు ముడివడింది.

మేము కాలకృత్యాలు ముగించి, కోర్టు ముందున్న టీ కొట్టులో కూర్చున్నాం. అందరికీ పొగలు కక్కుతున్న ఇడ్లీ ఇచ్చాడు కొట్టతను. కొబ్బరిచట్నీలో ముంచుకు తింటుంటే, అందులోని కారానికి మా కళ్ళలో నీళ్ళు తిరగడమే కాకుండా, శరీరాలు చెమటలు కూడా పట్టాయి. నెమ్మదిగా సమయం గడుస్తోంది. ఒక్కొక్కరుగా జనం వస్తున్నారు. కొందరు ముద్దాయిని పలకరించి, క్షేమ సమాచారాలు అడుగుతున్నారు. ఓ కానిస్టేబుల్ ఆ రోజు పేపరు చదువుతున్నాడు. మరొకతను తాపీగా సిగరెట్టు కాలుస్తున్నాడు. నేను మరింత జాగ్రత్తగా ముద్దాయిని గమనిస్తున్నాను. ఎస్కార్ట్ డ్యూటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ముందుగా ఊహించడం కష్టం.

ముద్దాయిల్లో తెలివి అధికంగా ఉంటుంది. ఎస్కార్టు పార్టీ బలహీనత కనిపెట్టి తప్పించుపోతారు. ఉద్యోగంలో చేరిన కొత్తలో ఓ ముద్దాయి హేండ్కఫ్ 'కీ' వెంట తెచ్చుకున్నాడు. అవకాశం చిక్కితే దానితో బేడీ లాక్ తీసి తప్పించుకోవాలని. నేను ఎలర్ట్‌గా ఉండి, ఆ 'కీ' పట్టుకున్నాను. మొదట పథకం వేసుకొని పారిపోయేవాళ్ళు కొందరైతే, అవకాశం చిక్కినపుడు అనాలోచితంగా తప్పించుకునేవాళ్ళు మరికొందరు. అసలు పారిపోవాలనే ఆలోచన కొన్ని పరిస్థితుల్లో మాత్రమే కలుగుతుంది. అయినా కూడా ఎస్కార్ట్ పార్టీ తగిన జాగ్రత్త తీసుకుంటే, ఎలాంటి ప్రమాదమూ ఉండదు. లేదంటే ఉద్యోగానికి నీళ్ళు వదులుకోవలసిందే! పదిన్నరకి కోర్టు మొదలయ్యింది. మొదటగా రాఘవరావు కేసు విచారణకు వచ్చింది. హేండ్‌కఫ్ తీసి బోనులో నిలబెట్టాం. వాయిదా పడింది కేసు.

అక్కడ పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేకపోయేసరికి మాకు సంతోషం కలిగింది. వెంటనే బయలుదేరితే, ఏదో బస్సు దొరుకుతుంది. ఆ ప్రయత్నంలో ఉండగా రాఘవరావు అన్నాడు.

"కాసేపు ఇక్కడ ఉందాం సార్!"

"దేనికి?" అడిగేను.

"నా భార్యా, కూతురూ వస్తారండీ..."

నిర్ణయం తీసుకోవాల్సింది నేనే కాబట్టి, రెండు క్షణాలు అలోచించి, అతనిని అడిగాను. "కేసు ఈరోజు వాయిదా అని తెలిసినపుడు ఇంతవరకూ ఎందుకు రాలేదు?'

"మా ఊరికి ఒకటే బస్సండి. ఈపాటికే రావాలి."

అంత దూరం వచ్చాక భార్యనీ, కూతురుని చూడనివ్వకుండా అతన్ని తీసుకుపోవడానికి మనస్కరించలేదు నాకు. కొద్దిసేపు వెయిట్ చెయ్యడం వల్ల పోయేదేమీ లేదు. డ్యూటీకి వెళ్లి వారం తరువాత తిరిగొస్తున్నప్పుడు భార్యాపిల్లల్ని చూడాలనే కోరిక మనసులో ఎంత తీవ్రంగా కలుగుతుందో అనుభవపూర్వకంగా నాకు తెలుసు.

కొట్టు లోపల చెక్కబల్లపై కూర్చున్నాం. అప్పటికే కోర్టు ఆవరణ జనంతో నిండిపోయింది. బంట్రోతు గొంతు బయటకు వినిపిస్తోంది. ఆ పేరు గల ఆసామి లోనికి వెళుతున్నాడు. చకాచకా సాగిపోతోంది అక్కడి వ్యవహారం.

రాఘవరావు చూపు కోర్టుకు ఎడమవైపు విశాలంగా ఉన్న పొలంలో కేంద్రీకృతమై ఉంది. కాలం దొర్లిపోతోంది.

కోర్టు ఆవరణలో జనం పల్చబడుతున్నారు. ఆ రోజు విచారించాల్సిన కేసులు ఉంచి మిగతావి వాయిదావేసి, మేజిస్ట్రేట్ లంచికి వెళ్ళడం జరుగుతుంది. టీ కొట్టులో తినుబండారాలు అయిపోవడంతో ఖాళీపాత్రలు గుట్టగా పడవేసారు. కుంపట్లో మగ్గుతో టీ డికాక్షన్ మరుగుతోంది.

వాచీ చూసి, పన్నెండు దాటడం గమనించి, రాఘవరావుతో అన్నాను — “ఇంకెంత సేపు ఉంటామిక్కడ? వెళదాం.”

“ప్లీజ్… మరో పదినిముషాలు. దీనంగా అన్నాడు.

“సరే… పదినిముషాలు మాత్రమే చూద్దాం…” గంభీరంగా చెప్పాను. అతను దిగులుగా తలూపాడు. సెకన్ల ముల్లు ఎవరో నెడుతున్నట్టు కదులుతోంది. కానిస్టేబుల్స్ ఇద్దరూ నన్ను ఆశ్చర్యంగా చూస్తున్నారని నాకు తెలుసు. అలాంటి డ్యూటీలో నేను చాలా స్ట్రిక్ట్ అని చాలామంది అభిప్రాయం. ఈ ముద్దాయి విషయంలో మెతకదనం ప్రదర్శించడానికి కారణం తెలీక అలా చూస్తున్నారు. నిజం చెప్పాలంటే నాకూ తెలీదు.

హఠాత్తుగా రాఘవరావు ఉలిక్కిపడడం గమనించి, అతను చూస్తున్న వైపు దృష్టి సారించేను. ఓ అమ్మాయి పొలాల మధ్య పరిగెడుతున్నట్టు వస్తోంది. ఒకతను బరువైన సంచితో ఆ పిల్లని అనుసరిస్తున్నాడు.

రాఘవరావు చప్పున అన్నాడు “సార్! నా కూతురొస్తోంది…” అటే చూస్తూ తలూపాను. “హేండ్‌కఫ్ తీసేయండి సార్!” ఆందోళనగా అన్నాడతను. ఉలిక్కిపడి అతని ముఖంలోకి చూసాను. “బేడీలు చూస్తే అదేడుస్తుందండీ…” దీనంగా చూసాడు రాఘవరావు.

హేండ్‌కఫ్ తియ్యడం ఎంత ప్రమాదమో నాకు తెలుసు. చేతికి సంకెళ్ళు లేకపోతే… ఉన్నట్టుండి లేచి పరిగెట్టవచ్చు. నేను ఆయుధం సర్దుకునేలోపు అదృశ్యమవుతాడు. ఒకవేళ ఆయుధంతో రెడీగా ఉన్నా, మనుషుల మధ్య పరిగెడితే చేసేదేమీ ఉండదు. ఆలోచించి నిర్ణయం తీసుకునే సమయం లేదు. ఆ పిల్ల అత్యంత వేగంగా మా దగ్గరకు వచ్చేస్తోంది. “సార్!”

నా మెదడు పని చెయ్యడం మానేసినా, కుడిచెయ్యి మాత్రం జేబులోంచి హాండ్‌కఫ్ ‘కీ’ బయటకు తీసింది. చైన్‌తో సహా హాండ్‌కఫ్ ఊడిపోయింది. దాన్ని లాఘవంగా తన సంచిలోకి నెట్టి టవలు కప్పేడతను. అదే క్షణంలో ఆ పిల్ల తండ్రి మీద వాలిపోయింది.

నేను కానిస్టేబుల్‌ని టీ కొట్టు బయట కాస్త దూరంలో నిలబెట్టి, రాఘవరావు ఎదురుగా బెంచీ మీద కూర్చొని జాగ్రత్తగా చూడసాగేను.

చొక్కా అంచుతో కూతురు కళ్ళు తుడిచి అడిగేడు రాఘవరావు , “అమ్మరాలేదేం?”

“పంట కొయ్యడానికి కూలీలు వస్తామన్నారు… ఈరోజు తప్పితే నెలవరకూ రారట…” ఆ అమ్మాయితో పాటు వచ్చిన మనిషి సంచినుండి ఆరుగిన్నెల పెద్దక్యారేజి ఒకటి బయటకు తీసాడు. సాధారణంగా హొటల్లోనే అలాంటి క్యారేజులు ఉంటాయి. అతను క్యారేజీ చెక్కబల్ల మీద పెట్టి, ఒక్కో గిన్నె వరసగా ఉంచి సర్దడంలో మునిగిపోయాడు.

ఆహారపదార్థాల కమ్మటివాసన జిహ్వని రెచ్చగొట్టసాగింది. పప్పుచారుకి వేసిన తాలింపు కాబోలు ఘాటుగా నాసికని తాకుతోంది. అయినాసరే, నా దృష్టిని రాఘవరావు మీద నుంచి మళ్ళించలేదు. తండ్రీకూతుళ్ళు మాటల్లో పడ్డారు. ఒంటిగంట దాటింది సమయం. హఠాత్తుగా ఏదో గుర్తొచ్చినట్టు నాతో అన్నాడు రాఘవరావు.

"సార్! మీరు భోజనం చేసేయండి..."

"హోటల్లో తిందాం..." చెప్పాను.

అతను నవ్వేడు. "మీరు భలేవారే! ఇంటినుంచి మనకి భోజనాలు వచ్చాయి..." అన్నాడు. నేను ఇబ్బందిగా చూసాను. బయటనుండి తెచ్చిన ఆహారపదార్థాలు ముద్దాయికి ఇవ్వకూడదు. ఎస్కార్ట్ పార్టీ తినకూడదు.

"వద్దులే" అన్నాను.

అతను లేచి కూతురుతో సహా క్యారేజి గిన్నెలను సమీపించాడు. స్పూనుతో ఒక్కొక్క గిన్నెలోని పదార్థం కూతురుతో తినిపించి, వచ్చి కూర్చున్నాడు.

"ముందుగా మిమ్మల్ని ఎందుకు తినమన్నానంటే... మీరు భోజనం చెయ్యడానికి కొంత సమయం పడుతుంది. ఆ సమయాన్ని నా కూతురుతో మాట్లాడడానికి ఉపయోగించుకోవాలని..." నేను మాట్లాడకుండా ఓ కానిస్టేబుల్‌ని భోజనానికి పంపాను. అతనూ, ఆ తర్వాత రెండో అతను, నేనూ భోజనం పూర్తి చేసాం.

చివరిగా రాఘవరావు, కూతురిని పక్కనే కూర్చోబెట్టుకొని కబుర్లు చెబుతూ తను తింటూ, ఆ పిల్లకి తినిపించాడు. ఎస్కార్టు డ్యూటీలో ఎక్కడో, ఏదో హొటల్లో కడుపు నింపుకోవాల్సిన మేము తృప్తిగా ఇంటి భోజనం తిన్నాం. తన ప్రేమంతా రంగరించి రాఘవరావు భార్య వంటచేసి ఉంటుంది. అందుకే అంత రుచిగా ఉంది. ఎందుకో నా కళ్ళు ఒక్కసారిగా చెమర్చాయి. తల తిప్పి క్షణాల్లో సర్దుకున్నాను.

నాలుగు గంటలకి అక్కడినుండి బయలుదేరాం. రాఘవరావు కూతురు చెయ్యి ఊపి మాకు వీడ్కోలు పలికింది. తండ్రితో అంతసేపు గడపడం వల్ల కలిగిన తృప్తి ఆ పిల్ల కళ్ళల్లో కదులుతోంది. రాఘవరావు బదులుగా కుడిచేతిని ఆడించాడు. ఆ చేతికి ఇప్పుడు సంకెళ్ళు లేవు! భవబంధాలతో పోలిస్తే, ఉక్కుసంకెళ్ళు ఏపాటి? బతికినంతకాలం బంధించి ఉంచే సంసార సాగరం కంటే పెద్దదైన జైలు ఎక్కడుంది? బస్సు వెళుతోంది. కిటికీ పక్కనే కూర్చొని బయటకు చూస్తున్నాడు రాఘవరావు. అతను ఏం ఆలోచిస్తున్నాడో నాకు తెలియదు.

అతని సంచిలో అలాగే ఉండిపోయాయి సంకెళ్ళు.

*(స్వాతి వారపత్రిక, 3-7-2009, సి.పి. బ్రౌన్ కథల పోటీలో బహుమతి పొందిన కథ)*

# వన్ మినిట్

**కీ. శే. బెహరా వెంకట సుబ్బారావు**

**కథామార్గదర్శి కథ**

***"ఆఫీసర్‌గారు హైదరాబాద్ క్యాంపు వెళ్లారు! నాలుగురోజుల దాకా తిరిగి రారు!" నాన్చుతూ చెప్పాడు శేఖరం. దోషిలా తన దృష్టిని ప్రక్కకు మరల్చుకుని.***

***"నా కొంప నిలువునా కూలిపోయింది రామారావు గారూ!" గుండె బాదుకున్నారు.***

***మౌనంగా ఉండిపోయాడు రామారావు.***

***చటాలున కుర్చీలోంచి లేచాడు శేఖరం. అతని వైపు చూశారిద్దరూ.***

***"రామనాథం గారూ! దీనికంతటికీ కారకుణ్ణి నేను! మీరు అప్రతిష్టపాలు కాకుండా చూసే బాధ్యత నాది!" అన్నాడు దృఢంగా.***

టైపిస్టు గదిలోంచి ఫైల్స్ తెచ్చి రామారావు టేబుల్ మీద పెడుతూ, "శేఖరం బాబుగారు మిమ్మల్ని పిలుస్తున్నారు!" చెప్పాడు ఆ ఆఫీస్ ప్యూన్ పోలయ్య.

తాను తెచ్చిన వర్తమానాన్ని రామారావుగారు విన్నారా లేదా? అన్నది తనకనవసరం అన్నట్లు ఆయన మాట కోసం వేచి చూడకుండానే వెళ్ళిపోయాడు పోలయ్య.

పోలయ్య అన్న మాటలు విన్నా, మాట్లాడే స్థితిలో లేడు యూ.డి.సి. రామారావు! ఏదో ఫైల్ చూస్తున్నాడు. ఫైలు పేజీ తిరగేస్తూ తలెత్తి చూసాడు, అతనికి జవాబు చెప్పాలని! పోలయ్య కనిపించలేదు, మరో అపరిచిత వ్యక్తి కనిపించారు. ఆయన వైపు ఎగాదిగా చూశాడు. వయస్సు యాభై దాటి ఉంటాయి. తెల్లని పంచె ధరించారు. చొక్కాపై కోటు వేసుకున్నారు. ఆ కోటు వయస్సు సులువుగా రెండు పుష్కరాలు ఉండొచ్చు! అక్కడక్కడ కుట్లున్నాయి. లోపలి చొక్కా కూడా బాగా చిరిగిందే అయివుండొచ్చు. దైన్యంగా తన వైపే చూస్తున్నాడు.

"నమస్కారం రామారావు బాబూ!" అన్నారు చేతులు జోడించి వినయంగా.


తిరిగి నమస్కారం చేస్తూ "అలా కూర్చోండి!" అంటూ ప్రక్కనే ఉన్న కుర్చీని చూపించాడు రామారావు.

"తమరు పెద్దవారు! తండ్రిలాంటివారు! మాలాంటి కుర్రాళ్ళకి నమస్కారం పెట్టడం నాకిష్టం ఉండదు!" అన్నాడు.

రామారావు మాటలకి ఏమనాలో తెలియక తికమక పడుతూంటే మరలా రామారావు అన్నాడు.

"నేనీ మధ్యనే ట్రాన్స్ఫరయి ఇక్కడకు వచ్చా! మిమ్మల్ని చూడ్డం యిదే!"

"చిత్తం! నన్ను రామనాథం అంటారండి! కాకినాడ సబ్ డివిజన్లో యూడీసీని" చెప్పారు నమ్రతగా.



"రామనాథం గారంటే మీరేనా సార్! మీ పేరు చాలాసార్లు విన్నా! మీరంటే మా ఆఫీసులో అందరికీ మంచి ఒపీనియన్ ఉంది!"

ఆ కాంప్లిమెంట్సుకు ఆయన ముఖం వికసించింది.

"ఏదో నా మీద అభిమానం కొద్దీ అలా అనుకుంటారు! మనం జీతం పుచ్చుకున్నందుకు పని చేయాలిగా!" అనేశారు తేలిగ్గా.

"మీకు లీవ్ శాంక్షన్ అయినట్లు ఆర్డర్స్ పంపాం! ఇంకా రిలీవ్ అవ్వలేదా సార్?"

"రిలీవ్ అయ్యాను బాబూ! మా అమ్మాయి పెళ్ళికని సెలవు పెట్టా! పి ఎఫ్ విత్‌డ్రాయలుకు కూడా అప్లై చేశా! మూడు వారాలయింది. ఎల్లుండికల్లా మిగతా కట్నం పెళ్ళివారికివ్వాలి! తమరెలాగైనా సాంక్షన్ అయ్యేలా చూడాలి! లేకపోతే అభాసుపాలవుతా! నాకీ సహాయం చేయాలి!"

తాను వచ్చిన పనిని సవినయంగా మనవి చేసుకున్నారు రామనాథంగారు! ఆయనలో ఆందోళన ద్యోతకమవుతోంది.

"ష్యూర్ ష్యూర్! ఆఫీసర్ గారు ఈమధ్య క్యాంపులో ఉండటం వలన ఆలస్యం అయింది. మీ లోన్ శాంక్షన్ అయింది!" చెప్పాడు రామారావు కుర్చీలో సర్దుకుని కూర్చుంటూ.

రామనాథంగారి మోహంలో మతాబాలు వెలిగాయి... మహదానందం పొంది, లేచి నిలబడ్డారు.

"చాలా థాంక్స్ సార్! శాంక్షన్ డిస్పాచ్ అయిపోయిందా సార్?" అడిగారు.

"నో నో! కూర్చోండి! ఇప్పుడే మీ శాంక్షన్ టైప్ అయి వచ్చింది. వెరిఫై చేసి ఆఫీసరుగారికి పంపిస్తా సంతకానికి!" అంటూ ఫెయిర్ కాపీ ప్యాడ్ విప్పాడు.

టైప్డ్ కాపీలను బయటకు తీసి, పెన్ కాపీతో వెరిఫై చేస్తుంటే ఉప్పెనలా వచ్చి పడ్డాడు డిస్పాచింగ్ క్లర్క్ శేఖరం!

"వాట్ మాన్ యింతాలస్యం? పోలయ్య చేత కబురు పంపా... చెప్పలేదా?" వస్తూనే అడిగాడు.

రామారావు పలక్క పోవడంతో చికాకు పడ్డాడు.

"ఏమిటోయ్ అంత దీక్షగా చదువుతున్నావ్? డిసిప్లినరీ ప్రొసీడింగ్సా?" అడిగాడు ఆలస్యానికి అసహనంగా.

"రెండు నిమిషాలాగవోయ్! వస్తా!" చెప్పాడు రామారావు స్పెల్లింగును కరెక్ట్ చేస్తూ.

"మన టైపిస్టు టైపు చేస్తే పేరాకి పాతిక తప్పులుంటాయి. తర్వాత తాపీగా చూసుకోవచ్చు! గెటప్ మ్యాన్! లెటజ్ హావ్ కాఫీ!" తొందర చేశాడు.

"వీరు రామనాథం గారు మన..." ఏదో చెప్పబోతుంటే సగంలోనే అందుకున్నాడు శేఖరం.

"నాకు తెలియక పోవడం ఏమిటోయ్!" అన్నాడు రామనాథంగారి నమస్కారాన్ని ఉదాసీనంగా అందుకుంటూ...

"వీరు పిఎఫ్ లోనుకి అప్లై చేశారు! శాంక్షన్ కాపీ వెరిఫై చేస్తున్నా! వన్ మినిట్ ఆగవోయ్!"

"ఆ ఆ! ఈ లోన్లూ, అడ్వాన్సులు ఎప్పుడూ ఉండేవే! నైంటీ పర్సెంట్ బోగస్! కాఫీ తాగొచ్చిన తర్వాత చూడొచ్చు! రావోయ్! నాకు నాలుగు ట్రేలు డిస్పాచ్ కోసం ఎదురుచూస్తున్నాయ్!"

"నాది బోగస్ కాదు బాబూ! మా అమ్మాయి పెళ్లి పదిరోజులుంది!" ఆర్ద్రంగా అన్నారు రామనాథంగారు.

"ఓహ్! మీది బోగస్ అని నేననడం లేదండి! ఎక్కడో టెన్ పర్సెంట్ మీలాంటి నిజమైన కేసులుంటాయి! కాదన్ను! మీరేమీ అనుకోకుండా ఉంటే... వన్ మినిట్‌లో కాఫీ తాగి వచ్చేస్తాం!" అని ఆయన పర్మిషన్ తీసుకున్నట్లుగా భావించి, "రావోయ్! కాఫీ పడకుండా ఒక్క నిమిషం కూడా ఉండలేను!" తొందర చేశాడు శేఖరం.

రామారావు ఏమి మాట్లాడలేక మౌనంగా ఉండిపోయాడు.

"వెళ్ళండి బాబూ! ఆయనంత ఆత్రుత పడుతున్నారు! నా లోను ఎలాగూ శాంక్షన్ అయ్యింది కదా! వెంటనే వచ్చేయండి! లాస్టు బస్సులో ఇంటికి పోతా!"

ఇరకాటంగా ఉన్నా, అలా అనక తప్పింది కాదు రామనాథంగారికి! సభ్యత కోసం "వెంటనే వచ్చేస్తాం! రాగానే ఆఫీసర్‌గారి చేత సంతకం చేయించి యిచ్చేస్తా! రేపు క్యాష్ చేసుకోవచ్చు!" అంటూ లేచాడు రామారావు అయిష్టంగానే.

ఆఫీసునుంచి బయట పడగానే విసుక్కున్నాడు రామారావు.

"ఏమిటోయ్ నీ కాఫీ గొడవ? లంచవర్‌లో తాగావా? తర్వాత పాపారావు మూడున్నరకి పార్టీ ఇచ్చాడా? ఇప్పుడు నాలుగున్నరయింది! అప్పుడే మళ్ళా కాఫీయా?"

"మీకేవిటోయ్ గబగబా నాలుగు ముక్కలు రాసేసి నా మొహాన పడేస్తారు! ఆఫీసంతటికి నేనొక్కడినే డిస్పాచర్ని! నాలుగు ట్రేలు ఫుల్ స్వింగ్‌లో పడి ఉన్నాయి. అవన్నీ కదలాలంటే నా మెదడు పని చేయాలి! లేకపోతే ఒక వూరివి ఒక వూరికి పోతాయి! అప్పుడు చీవాట్లు!"

"ఆఫీసు టైమ్‌లో యిలా బయటకు వచ్చి టైమ్ వేస్ట్ చేయడం నాకు నచ్చదు!" ఖచ్చితంగా చెప్పాడు రామారావు ఎదురుగా వస్తున్న రిక్షాను తప్పుకుంటూ.

"అంటే... నేను పని ఎగ్గొట్టే వాడినా నీ ఉద్దేశం?" కోపించాడు శేఖరం.

"అహ! ఊరికినే అన్నా! నాకూ కాఫీ తాగాలనే ఉంది! కాకపోతే చేతిలో పని ఆపుచేసి వచ్చినందుకు అలా అంటున్నా!" సర్దుకున్నాడు స్నేహితుడ్ని ప్రసన్నం చేసుకుందుకు.

ఇద్దరూ హోటల్లో దూరారు. ఎక్కడా కుర్చీలు ఖాళీగా లేవు.

"హోటల్ రేట్స్ పెరిగిపోయాయంటూ అందరూ గోల చేస్తూ ఉంటారు! ఒక్క సీటు కూడా ఖాళీ ఉండదు!" విసుక్కున్నాడు శేఖరం.

ఎవరో ఇద్దరూ మిత్రులు కాఫీలు తాగుతుంటే వారి పీకల మీద నిలబడ్డారు కుర్చీల కోసం.

"నాలుగూ నలభై! అంటే మనం బయలుదేరి పది నిమిషాలయిందన్నమాట!" అన్నాడు రామారావు కుర్చీలో కూర్చుంటూ.

"ఎంతసేపోయ్! ఒన్ మినిట్!" అంటూ సర్వర్ దగ్గరికి పోయి వన్ బై టు కాఫీ ఆర్డర్ ఇచ్చి తిరిగి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు శేఖరం.

“ఈ సర్వరు మనల్ని చూడ్డానికి ఐదు నిమిషాలు. చూశాక ఏం కావాలి అని అడగడానికి మరో ఐదు నిమిషాలు, తేడానికి మరో పది నిమిషాలు! అందుకే వెళ్లి చెప్పివచ్చా! లాంఛనం కోసం చూస్తే టైం వేస్ట్! ఏమంటావ్?”

రామారావు మాట్లాడలేదు. ఐదు నిమిషాల తర్వాత అనుకున్నట్టుగానే సర్వర్ వచ్చి “ఏం కావాలి సార్?” అని అడిగాడు. నిర్ఘాంతపోయారు మిత్రులిద్దరూ.

“బాబూ! సర్వారావూ! ఇప్పుడే కదయ్యా దోశల పెనం దగ్గరికొచ్చి మరీ మనవి చేసుకున్నా! వన్ బై టు కాఫీ అని” అంటూ తల పట్టుకున్నాడు శేఖరం.

చిన్నగా నవ్వుకున్నాడు రామారావు.

“చూడు మిస్టర్! అర్జెంటుగా వెళ్లాలి! తొందరగా తెచ్చిపెట్టు!” చెప్పాడు రామారావు.

“వన్ మినిట్ సార్!” అంటూ పక్క టేబుల్ దగ్గరకి పోయాడు.

ఆ మిత్రులిద్దరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

“ఏవిటోయ్! వీడూ వన్ మినిట్ అంటున్నాడు! నిజంగా వన్ మినిట్ లోనే తెచ్చేస్తాడేవిటి?” అంటూ నవ్వేశాడు రామారావు. మరీక్షణంలోనే కాఫీ తెచ్చి టేబుల్ మీద ఉంచాడు సర్వర్.

“నిజంగా వన్ మినిట్ లోనే తెచ్చేసావే?” ఆశ్చర్యంగా అడిగాడు శేఖరం.

“మా హోటల్ అంతే సార్! వన్ మినిట్ అంటే వన్ మినిట్! అరవై సెకండ్లు! లేకపోతే పాసింజర్లు చాలా ఇబ్బంది పడిపోతారు! ఒక్క నిమిషం ఆలస్యం అయితే ఒక్కొక్కప్పుడు కొన్ని రోజులూ నెలలూ వెయిట్ చేయాల్సి వస్తుంది! ఎంతోమంది బస్సులు తప్పిపోతారు. ట్రైన్స్ మిస్సవుతారు! ఇంటర్వ్యూలు పోతాయ్! ఒక్కొక్కప్పుడు ఉద్యోగాలూ ఊడతాయి! మమ్మల్ని తిట్టుకుంటారు సార్! అందుకే టైమ్ ఈజ్ టైమ్!” నవ్వుతూ చిన్న ఉపన్యాసం లాంటిది ఇచ్చాడు సర్వర్.

“హోరి పిడుగా! మాకంటే నీవే నయం!” పైకే అనేశాడు శేఖరం వాడిచ్చే బిల్లు అందుకుంటూ.

కాఫీ తాగుతూ మాటలు మొదలుపెట్టాడు శేఖరం.

“చూడు బ్రదర్! ఈ ‘వన్ మినిట్’ అన్నది ఒక కేవలం ఊతపదం లాంటిదే. అవతలి వారిని ఆకట్టుకొందుకి వాడే మాట మాత్రమే! మొన్న ఏమైందనుకున్నావ్! నేను మా మామయ్య కలిసి, మావయ్య పనిమీద ఓ మినిస్టర్ గారింటికి వెళ్ళాం! ఆయన సాదరంగా ఆహ్వానించి ఓ గదిలోకి తీసుకెళ్లారు. సోఫాలు చూపించి కూర్చోమన్నారు. ఆయన కూడా మాకెదురుగా మరో సోఫా మీద ఆసీనులయ్యారు. కుశలప్రశ్నలు అయ్యాయి! అంతలో మరొక జట్టు ముగ్గురు వచ్చారు మినిస్టర్‌గారిని చూడడానికి. ‘వన్ మినిట్ ప్లీజ్!’ అని మాతో చెప్పి వాళ్ళకెదురెళ్లి మరొక గదిలోకి తీసుకెళ్లారు.

గంటన్నర పోయాక తిరిగివస్తూ...” క్షమించాలి ఆలస్యం అయితే!” అన్నారు ఆ చిదానందమూర్తి. మమ్మల్ని మర్చిపోయారేమో అని భయపడుతున్న మేము ‘పోనీలే తిరిగి వచ్చారు’ అని సంతోషపడ్డాం. ’అబ్బే! ఆలస్యం ఏవీ లేదండీ!’

అనేశాడు మామయ్య.. మా మావయ్య కార్యశూరుడు కాబట్టి.” అని ఖాళీ గ్లాస్‌ని టేబుల్ మీద ఉంచి మరల చెప్పడం మొదలెట్టాడు శేఖరం.

“అంతవరకూ ఎందుకు? నిన్నటికి నిన్న ఏమైందనుకుంటావ్? మన స్టెనో కూతురికి జ్వరంగా ఉంటే డాక్టర్ దగ్గరికి వెళ్ళాం! ఆయన థర్మామీటర్‌ను అమ్మాయి నోట్లో పెట్టారు. అంతలో పక్క గదిలో ఉన్న ఫోను మ్రోగింది. ఆన్సర్ చేయడానికి అని లేచి ‘వన్ మినిట్ ప్లీజ్!’ అన్నారు. గదిలోకి పోయి ఫోను ఆన్సర్ చేశారు. ఆ వెళ్లడం వెళ్లడం ఎంతకూ తిరిగి రాలేదు! థర్మామీటర్ అమ్మాయి నోట్లోనే ఉండిపోయింది. ఎంక్వైరీ చేయగా తేలిందేవిటంటే ఎవరో ఎమ్మెల్యే గారికి తలనొప్పిగా ఉన్నట్లు అనుమానంగా ఉందిట. వెంటనే వచ్చి చూడమని ఫోన్ చేశార్ట! ఆయన్ని చూడ్డానికి స్కూటర్ మీద డాక్టర్‌గారు అలాగుననే వెళ్లిపోయార్ట గజేంద్ర మోక్షంలో శ్రీకృష్ణునిలా! ఆయన తిరిగి వచ్చేసరికి మూడు గంటలు పట్టింది. అప్పటికి ఆ అమ్మాయి జ్వరం కూడా తగ్గిపోయింది” అని చెప్పి నవ్వేశాడు శేఖరం.

రామారావుకూ నవ్వొచ్చింది. వాచీ చూసుకొని “మనం ఆఫీసు వదిలి ముప్పై నిమిషాలయింది” అన్నాడు.

స్నేహితుని వైఖరి చికాకు కలిగించింది శేఖర్కి. “వాట్ మాన్! ఆ రామనాథం గోదావరిలో కాకపోతే కృష్ణాలో పోతాడు! మన పని మీదనేవీ రాలేదు కదా!” అంటూ వీధి గుమ్మంలోకి చూశాడు అలవోకగా. “కొంపలంటుకుంటునట్లుగా వచ్చేస్తున్నాడు రామనాథం!” అన్నాడు.

చటాలున లేచి నిలబడ్డాడు రామారావు.

“బాబూ! ఆఫీసర్‌గారు ఇంటికి పోయే ప్రయత్నంలో ఉన్నార్ట! తమరర్జెంటుగా రావాలి!” రొప్పుకుంటూ చెప్పారు రామనాథం గారు.

“మీరు వెళ్ళండోయ్! బిల్లు చెల్లించి నేను తాపీగా వస్తాను!” లేచాడు శేఖరం.

హోటల్ మెట్లు దిగుతుండగా ఎదురుగా ఆఫీసర్‌గారి జీపు దూసుకునిపోయింది. ఆ జీపులో ఉన్న ఆఫీసర్‌గారిని చూసి మాటా మంతీ లేకుండా నిలబడిపోయారు ఆ ఇద్దరూ.

“ఇప్పుడు వెళ్ళింది ఆఫీసర్‌గారి జీపులా ఉంది!” వెనకనే వెళ్లిన శేఖరం అన్నాడు నొచ్చుకుంటూ.

“అవును బాబూ! కొంప మునిగిపోయింది! రేపు రెండో శనివారం! ఎల్లుండి ఆదివారం!”

బావురుమన్నారు రామనాథంగారు. ఆయనకి కన్నీటిపర్యంతం అయింది. అపరాధిలా తలవంచుకున్నాడు రామారావు. వారిని గమనించిన శేఖరమూ బాధపడ్డాడు.

“అయ్యా రామనాథం గారూ! ఏదో పొరపాటు జరిగిపోయింది! సోమవారం నాడు ఫస్ట్ బస్సులోనే రండి!” అని ఇంకా ఏదో చెప్పబోయాడు శేఖరం.

సగంలోనే అందుకున్నారు రామనాథం గారు.

"ఈరోజు ఫస్ట్ బస్సులోనే రావాలని ఇంటి దగ్గర బయలుదేరా. బజారులో ఒక మిత్రుడు బాతాఖానీకి తగులుకున్నాడు. ఒక్క నిమిషంలో బస్సు తప్పిపోయింది. రెండో బస్సులో వచ్చా రెండు గంటలు ఆలస్యంగా!"

"వన్ మినిట్‌లో తప్పిపోయారన్నమాట!" ఆలోచిస్తూ అనేశాడు శేఖరం.

"క్షమించండి రామనాథం గారూ! సోమవారం పది గంటలకల్లా దయచేయండి! మీకు కుదరకపోతే మీ అబ్బాయిలని ఎవరినైనా పంపండి! ఆఫీసర్‌గారి చేత సంతకం చేయించి శాంక్షన్ రెడీగా ఉంచుతా! ఆ రోజే మీరు క్యాష్ చేసుకోవచ్చు! ఐయామ్ ఎక్స్‌ట్రీమ్‌లీ సారీ!" క్షమాపణ అర్థించాడు రామారావు.

"సోమవారం తప్పకుండా పనయేలా చూడండి బాబూ! మంగళవారం రెండు వేలు పట్టుకెళ్ళి మగపెళ్ళివారికి ఇయ్యాలి! లేకపోతే నా పరువు పోతుంది!" బతిమాలారు రామనాథం గారు.

"షూర్! షూర్! తప్పకుండా!" అభయం ఇచ్చాడు శేఖరం.

★★★

ఆఫీసు మెట్లెక్కుతున్న రామారావుకెదురుగా వెళ్ళి, "గురూ! కొంప మునిగింది! ఆఫీసర్‌గారు హైదరాబాదు క్యాంపు వెళ్లారు. నాలుగు రోజుల దాకా తిరిగి రారట!" దుర్వార్త అందజేశాడు శేఖరం.

నవనాడులూ కృంగిపోయిన రామారావు భారంగా అడుగులో అడుగు వేసుకుంటూ తన సీటులో చతికిలపడ్డాడు. వెనకనే వెళ్ళాడు శేఖరం.

"రామనాథం గారికేమని చెప్పడం?" మిత్రుని కళ్ళలోకి చూస్తూ నిస్పృహగా అడిగాడు రామారావు.

"అదిగో! రామనాథం గారొస్తున్నారు! నీవేమీ మాట్లాడకోయ్! ఆయనతో నేనే చెబుతా!" అని ధైర్యం చెప్పి రామనాథం గారికి ఎదురెళ్లి నమస్కారం చేశాడు శేఖరం.

"ఈవేళ ఫస్టు బస్సులోనే వచ్చినట్లున్నారే!" పలకరించాడు.

"అవును బాబూ! మొన్నయిందిగా... ప్రాయశ్చిత్తం!" అంటూ రామారావును సమీపించారు.

మౌనంగా నమస్కారం చేసి కుర్చీ చూపించాడు రామారావు.

"ఏమిటో! రామారావుగారీవేళ అదోలా ఉన్నారు!" డబ్బు అందుతుందన్న హుషారులో పలకరించారు కుర్చీలో కూర్చుంటూ.

"ఏవీ లేదండి! తలనొప్పిగా ఉంది!" జవాబిచ్చాడు శేఖరం తనూ ఓ కుర్చీలో ఎదురుగా కూర్చుంటూ.

"నా పని అయిపోయినట్టేనా బాబూ?" ఆత్రుతగా అడిగారు.

రామారావు సమాధానం చెప్పకపోవడంతో కంగారుపడ్డారు. శేఖరం మొహంలోకి చూశారు.

"మీ అమ్మాయి పెళ్లి ఎప్పుడన్నారు?" అడిగాడు శేఖర్ ఆయన ప్రశ్నకు జవాబు చెప్పకుండా.

"పదిరోజులుంది బాబు! ఇరవై రెండో తారీఖున పెళ్లి!" చెప్పారు జారిపోతున్న కళ్ళజోడుని ఎగదోసుకుంటూ.

"అయితే నాలుగైదు రోజుల్లో అందితే చాలదంటారా?" అడిగాడు శేఖర్.

"లేదు బాబూ! రేపు మిగతా డబ్బు ఇస్తానని నిన్ననే చెప్పివచ్చా! లేకపోతే నా పరువు పోతుంది! నా పిల్ల బతుకు పోతుంది!" లబోదిబోమన్నారు.

"ఆఫీసర్‌గారు హైదరాబాద్ క్యాంపు వెళ్లారు! నాలుగురోజుల దాకా తిరిగి రారు!" నానుస్తూ చెప్పాడు శేఖరం. దోషిలా తన దృష్టిని ప్రక్కకు మరల్చుకుని.

"నా కొంప నిలువునా కూలిపోయింది రామారావు గారూ!" గుండె బాదుకున్నారు.

మౌనంగా ఉండిపోయాడు రామారావు.

చటాలున కుర్చీలోంచి లేచాడు శేఖరం. అతని వైపు చూశారిద్దరూ.

"రామనాథం గారూ! దీనికంతటికీ కారకుణ్ణి నేను! మీరు అప్రతిష్టపాలు కాకుండా చూసే బాధ్యత నాది!" అన్నాడు దృఢంగా.

ఆశగా చూశారిద్దరూ ఏమి చెబుతాడో అని.

"మీకిప్పుడు అర్జెంటుగా ఎంత కావాలి!"

"రెండు వేలు కావాలి బాబూ!" మిగతా సొమ్ము నాలుగు రోజుల తర్వాత అందినా పర్వాలేదు!" లేచి నిలబడి ఆర్ద్రంగా సమాధానం ఇచ్చారు.

"లోన్ ఎంత శాంక్షన్ అయిందోయ్?" మిత్రుడ్ని అడిగాడు శేఖరం.

"ఐదు వేలు!" చెప్పాడు రామారావు.

"ఆల్రైట్! నాతో రండి! ప్రస్తుతానికి మీకర్జెంటుగా కావాల్సిన రెండువేలూ బ్యాంకు నుంచి డ్రా చేసి ఇస్తా. మీ లోన్ క్యాష్ అవ్వగానే నా డబ్బు నాకిచ్చేయండి! జరిగిన పొరపాటుకి చాలా విచారిస్తున్నా! మీరు నన్ను మనసారా క్షమించాలి!"

శేఖరం మాటలకి ఆశ్చర్యపోయాడు రామారావు. శేఖరంలో భగవంతుని చూశారు రామనాథం గారు.

"బాబూ! మీ పొరపాటు కాదు. ఇదంతా నా దురదృష్టం! అయినా శేఖరం బాబు ఆదుకుంటున్నారు! మీరేమీ చింతించకండి!" ఓదార్చారు రామారావుని.

"రండి సార్! బ్యాంకుకి వెళ్దాం!" అంటూ రెండు అడుగులు వేసి వెనక్కి తిరిగాడు శేఖరం.

"వన్ మినిట్‌లో వచ్చేస్తా బ్రదర్!" అన్నాడు స్నేహితునితో.

ముసిముసిగా నవ్వుకున్నాడు రామారావు.

*("ఆంధ్ర సచిత్ర వార పత్రిక" 18.11.1977 నుండి పునర్ముద్రణ)*

# తెలుగు సాహిత్యము
## శతకములు

మోచర్ల అనంత పద్మనాభరావు

(జూన్ 2025 సంచిక తరువాయి భాగం)

*కనకపు సింహాసనమున*
*శునకము గూర్చుండబెట్టి శుభ లగ్నమునం*
*దొనరగ బట్టము గట్టిన*
*వెనుకటి గుణమేల మాను వినరా సుమతీ ||*

కుక్కను బంగారు సింహాసనం మీద కూర్చోపెట్టినా దాని నైజగుణము నెలా మానలేదో, ఆ విధముగనే అల్పుడైనవానికి ఎంత గౌరవము చేసి ఎంతటి మంచి పదవొసంగినను తన నీచత్వమును వదలలేడు. అల్పులైన వారికి అధికారమిస్తే ఎలా ఉంటుంది అన్న విషయాన్ని ఇంతకంటే చిన్న మాటలలో ఎవరు చెప్పగలరు? ఈ చిన్న పద్యం మన ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టినట్లు లేదూ?

వేమన పద్యములు ఆటవెలదిలో నీతిని నింపి విషయము తేటతెల్లముగా తెలియునట్లు వ్రాయబడినవి. వేమన పద్యములు శతకమును మించియున్ననూ శతకముగానే ప్రశస్తి నొందినది.

*వేమననగ యోగి వెలసె లోకములోనఁ*
*బూజలిడుఁడు, పుణ్య పురుషులార*
*పూజలిడిన యంత, భుక్తి ముక్తుల నిచ్చు*
*విశ్వదాభిరామ వినర వేమ ||*

అన్న పద్యముతో మొదలిడి, ఎన్నో నీతివంతములైన పద్యములను మనకందించెను. ఇచ్చట నుదహరించిన కొన్ని పద్యములు అజరామరము.

*అల్పుఁ డెపుడు బల్కు నాడంబరము గాను*
*సజ్జనుండు బలుకుఁ జల్లగాను*
*కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?*
*విశ్వదాభిరామ వినర వేమ ||*

ఈ పద్యమునకు అర్థము వేరే వివరించనేల? తెలుగుభాష సజీవంగా నున్నంతవరకు ప్రజల నోళ్ళలో నానుతోనే వుంటుంది. మన రాజకీయ నాయకుల వాగ్దానాలకు ఈ పద్యం చక్కని ఉదాహరణ కదూ!!

(సశేషం)